thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 49 కరీంనగర్ బుధవారం, 30 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## త్వరలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు

న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ వేదికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా యాప్‌లు భారీ సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. వీటి నియంత్రణ ప్రభుత్వాలకు సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మీడియా కౌన్సిల్ అనివార్యమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి ఇటీవలే నివేదించింది. ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కొత్తగా మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం డిజిటల్ వేదికలు ఐటీ చట్టం, 2021 కింద ఉన్నాయి. ప్రింట్ మీడియాను ప్రెస్ కౌన్సిల్ నియంత్రిస్తున్నది. టీవీ చానళ్లు కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ మీడియా కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.

## భూదాన్ భూముల వ్యవహారం.. హైకోర్టును ఆశ్రయించిన ఐపీఎస్‌లు



హైదరాబాద్: భూదాన్ భూముల వ్యవహారంపై పలువురు ఐపీఎస్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఇదే అంశంపై ఈ నెల 24న విచారణ చేపట్టిన న్యాయస్థానం.. 27 మంది అధికారులకు చెందిన భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ భాస్కర్‌రెడ్డి సింగిల్ బెంచ్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తాజాగా కొందరు ఐపీఎస్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. వీరిలో మహేశ్‌భగవత్, స్వాతి లక్రా, సౌమ్యా మిశ్రా ఉన్నారు. భూదాన్ భూముల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో సీబీఐ, ఈడీలతో దర్యాప్తు చేయించాలని కోరుతూ మహేశ్వరం మండలానికి చెందిన బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి ఏప్రిల్ 24న విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు విన్న ధర్మాసనం.. ప్రాథమికంగా రికార్డులను పరిశీలిస్తే నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూములు భూదాన్ బోర్డుకు చెందినవని తేలుతోందని స్పష్టం చేశారు. పిటిషన్‌లో ఉన్నతాధికారులపై తీవ్రమైన ఆరోపణలు చేసిన నేపథ్యంలో వారి ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. హైకోర్టు తన విచక్షణాధికారంతో సామాజిక ఆస్తి పరిరక్షణలో భాగంగా ఈ పిటిషన్‌పై విచారణ ముగిసేదాకా ఆ సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని ఆదేశాలు జారీచేశారు.

తదుపరి ఉత్తర్వులు జారీ చేసేదాకా ఆ భూముల్లో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయరాదని, అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదని ప్రతివాదులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో పలువురు ఐపీఎస్‌లు హైకోర్టును ఆశ్రయించారు.



## మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్ : మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనేందుకు వస్తున్న పార్టిసిపెంట్స్‌కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఉన్నతాధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అందులోభాగంగా ఎయిర్ పోర్టులు, అతిథులు బస చేసే హోటళ్లతోపాటు అందాల పోటీలు జరిగే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ఉన్నతాధికారులకు ఆయన కీలక సూచనలు చేశారు.




ఛత్తీస్‌గడ్: మావోయిస్ట్ పార్టీ ట్రాప్‌లో భద్రతా బలగాలు పడినట్లు తెలుస్తోంది. కర్రె గుట్టల చుట్టూ ఐ.ఈ.డీలు ఏర్పాటు చేశామంటూ రెండు వారాల క్రితం మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. ఈ క్రమంలో కర్రె గుట్టలను భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. గత తొమ్మిది రోజులుగా సెర్చ్ ఆపరేషన్ జరుగుతోంది. అయినా మావోయిస్టుల ఆచూకీ లభ్యం కాలేదు... ఎట్టకేలకు బంకర్‌ను గుర్తించారు. భద్రతా బలగాల రాక పసిగట్టిన మావోయిస్టులు మకాం మార్చారు. కర్రెగుట్టల్లో పదుల సంఖ్యలో గుహలు ఉన్నాయి. దీంతో భద్రతా బలగాలకు సెర్చ్ ఆపరేషన్ సవాల్‌గా మారింది. కర్రె గుట్టల నుంచి మావోయిస్టులు తప్పించుకున్నట్లు నిఘా వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. కొయ్యద సాంబయ్య అలియాస్ ఆజాద్ నేతృత్వంలో పామెడు వైపు మూడు బ్యాచ్‌లు.. దంతెవాడ వైపు రెండు బ్యాచ్‌లు వెళ్లినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గెరిల్లా సుప్రీం కమాండర్ హిడ్మా కర్రె గుట్టలోనే ఉన్నాడనే సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. కాగా కర్రెగుట్టలపై మంగళవారం కూడా బలగాల కుంబింగ్ కొనసాగుతోంది. హెలికాప్టర్ ద్వారా కర్రెగుట్టపైకి భారీగా బలగాలు వెళ్తున్నాయి. కర్రెగుట్టలపై తాత్కాలిక బేస్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. బేస్ క్యాంప్ కోసమే బలగాలు , ఆయుధ సామాగ్రిని హెలికాప్టర్ ద్వారా తరలిస్తున్నారు. కాగా కర్రె గుట్టల్లో అనేక గుహలు ఉండటంతో భద్రతా బలగాలకు తీవ్ర సవాళ్లు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఏది ఏమైనా ప్రస్తుతానికి కర్రెగుట్టల నుంచి మావోయిస్టులు తప్పించుకున్నట్లు సమాచారం. కర్రెగుట్టలు దట్టమైన అటవీ ప్రాంతం. సాయంత్రం నాలుగైందంటే చాలు.. ఐదు అడుగుల దూరంలో ఉన్న మనుషులు కూడా కనిపించనంత చీకటి అలుముకుంటుంది. అందుకే ఈ ప్రాంతాన్ని మావోయిస్టులు తమ సురక్షిత స్థావరంగా భావిస్తారు. అందులోనూ ఆ ప్రాంతం వారికి కొట్టినపిండి. కానీ.. బలగాలకు మొత్తం కొత్తే కావడంతో ఇక్కడ ఆపరేషన్ నిర్వహించడం పెను సవాళ్లుగా మారింది. కాగా భద్రతా బలగాలు కూంబింగ్ ప్రారంభమైనప్పటి నుంచి నక్సలైట్లు ఆహారం, మంచి నీటి కోసం వెంపర్లాడుతున్నట్లు తెలుస్తోంది. నక్సలైట్లు తమను తాము సురక్షితంగా ఉంచుకోవడానికి సుమారు 4 నెలల పాటు రేషన్‌తో కర్రెగుట్ట కొండలలో క్యాంప్ ఏర్పాటు చేసుకున్నప్పటికీ.. భద్రతా బలగాలు కర్రెగుట్టను చుట్టుముట్టడంతో.. ఆ రేషన్ కూడా వారికి ఉపయోగపడలేదు.. కొండలపై నుంచి దిగితే సైనికుల తూటాలకు బలి అవుతారనీ, భయంతో కొండల పైనే ఎక్కువ కాలం దాక్కుని ఉంటే డీహైడ్రేషన్ వల్ల చనిపోతామనే భయం వారిని వెంటాడుతుంది. మరోవైపు, నక్సలైట్లు దాక్కున్న కొండలను మొత్తం స్వాధీనం చేసుకునే వరకు ఈ ఆపరేషన్ కొనసాగించాలని భద్రతా దళాలు పట్టుదలతో ఉన్నాయి. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు చొరవ చూపాలంటూ ఇటీవల మావోయిస్టులు ప్రెస్ నోట్ విడుదల చేసిన విషయం తెలిసిందే.







హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా భారాస నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. 'ఎన్‌డీఎస్‌ఏ ఎవరు..? వాళ్లెవరు నివేదిక ఇవ్వడానికి' అని కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎక్కువ కమీషన్లు వస్తాయని గత ప్రభుత్వ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

కమీషన్ల కోసం ప్రాజెక్టు అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారని మండిపడ్డారు. రూ.80వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే.. ఇప్పటికే రూ.లక్ష కోట్లు దాటిపోయిందన్నారు. "వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారు. అధికశాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. భారాస హయాంలోనే ప్రాజెక్టు నిర్మించారు. వాళ్ల హయాంలోనే కూలిపోయింది. ఎన్‌డీఎస్‌ఏ అనేది పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడింది. చట్టం చేసినప్పుడు భారాస ఎంపీలు మద్దతిచ్చారు. బ్యారేజీల భద్రతపై ఎన్‌డీఎస్‌ఏ అత్యున్నత బోర్డు. దేశంలోని 700 బ్యారేజీల భద్రతను పరిశీలిస్తోంది. వివిధ అంశాల్లో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో ఈ బోర్డు ఏర్పాటైంది. తుమ్మడిహట్టి కాదని మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడమే ప్రధాన లోపమని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. మేడిగడ్డ ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ప్రారంభంలోనే తోసిపుచ్చింది. బ్యారేజీ పూర్తయిన తొలి ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయి. లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా సరే.. పట్టించుకోకపోవడంతో నష్ట తీవ్రత పెరిగింది. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలపై భారాస ఉన్నప్పుడు కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చారు. బ్యారేజీ లోపలి భాగంలో నీళ్లు భూమిలోకి పోయి బ్యారేజీ వెలుపలకు వస్తున్నాయి. బ్యారేజీ నిర్మాణానికి మట్టి పరీక్షలు, నాణ్యత పరీక్షలు చేయలేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సీపేజీ ఉందని ఎన్‌డీఎస్‌ఏ నివేదిక చెబుతోంది. నిర్మాణం మొదలుపెట్టిన 6 నెలల తర్వాత సీడబ్ల్యూసీకి డీపీఆర్ పంపించారు.

ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చవద్దని ఐదుగురు విశ్రాంత ఇంజినీర్లతో కేసీఆర్ ఏర్పాటు చేసిన నిపుణుల బృందమే చెప్పింది. సీడబ్ల్యూసీకి ఇచ్చిన డీపీఆర్‌లో కూడా తర్వాత ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. డీపీఆర్‌కు విరుద్ధంగా కేసీఆర్ ఎలా చెప్తే అలా నిర్మించేశారు. భారాస నేతల నిర్లక్ష్యం, కక్కుర్తి, అవినీతి వల్ల ప్రాజెక్టు పనికిరాకుండా పోయింది" అని ఉత్తమ్ మండిపడ్డారు.

# హైదరాబాద్‌ను వీడిన పాకిస్థానీలు

హైదరాబాద్, ఏప్రిల్ 29: పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ వాసుల వీసాలు రద్దు చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. భారత్‌లో ఉన్న పాకిస్థాన్ పౌరులు దేశాన్ని విడిచి వెళ్లేందుకు ఈరోజే చివరి రోజు. దీంతో పాకిస్థానీలు దేశం విడిచి హుటాహుటిన తమ దేశానికి పయనమవుతున్నారు. అలాగే హైదరాబాద్‌లో ఉన్న పాకిస్థాన్ వాసులను గుర్తించిన పోలీసులు.. వారు వెంటనే నగరం విడిచి పెట్టిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పాకిస్థానీలు హైదరాబాద్‌ను వీడుతున్నారు. తాజాగా నలుగురు పాకిస్థానీలు హైదరాబాద్‌ను వీడి పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. ఆ నలుగురిలో ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు, మరో బాలుడు ఉన్నారు. వీరంతా కూడా శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్ మీదగా పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. నలుగురు పాకిస్తానీలు ఆదివారమే హైదరాబాద్ నుంచి వెళ్ళిపోయారు. తెలంగాణలో మరికొంత పాకిస్తానీలకు సంబంధించిన డాక్యుమెంట్లను పోలీసులు వెరిఫై చేస్తున్నారు. నేటితో పాకిస్థానీలకు గడువు ముగింపు ఉండటంతో నిన్నటి వరకు నలుగురు పాకిస్థానీలు వెళ్ళిపోయినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా.. కేంద్రం ఆదేశాలతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ మూడు కమిషనరేట్‌లో మొత్తం 213 మంది పాకిస్థానీలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే వీరిలో నలుగురు షార్ట్ టర్మ్ వీసాపై ఉన్నారని, మిగిలిన వారందరికీ లాంగ్ టర్మ్ వీసాలు కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే లాంగ్ టర్మ్ వీసాలు కలిగిన పాకిస్తానీలకు కేంద్రం మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో షార్ట్ టర్మ్ వీసా ఉన్న నలుగురు పాకిస్థానీలను దేశం విడిచి వెళ్లాల్సిందిగా హైదరాబాద్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గడువులోపు దేశం విడిచి వెళ్లని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరికాలు జారీ చేశారు. ఈ క్రమంలో నలుగురు పాకిస్థానీలు దేశం విడిచి వెళ్లిపోయారు.




షట్‌పల్లి: చట్టం పేద ప్రజలకు చుట్టంలా ఉండాలనే భూభారతి చట్టం రూపొందించామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

కామారెడ్డి జిల్లా షట్‌పల్లిలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న మంచి పనులు చూడలేక మాజీ సీఎం కేసీఆర్‌కు దుఃఖం వస్తోందన్నారు. ప్రతిష్మాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2 వరకు పైలట్ ప్రాజెక్టు మండలాల్లోని భూసమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అధికారులు మాట వినలేదని కేసీఆర్ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేశారని విమర్శించారు. పది రోజుల్లోనే గ్రామాల్లో రెవెన్యూ అధికారులను నియమిస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# ఆదివాసీలను కాల్చిచంపడం, మేధావులను జైల్లో పెట్టడం.!

## ఇప్పుడు కగార్ పేరిట నరమేధం - శాంతి చర్చలపై సర్కార్ పై ఒత్తిడి తెద్దాం

## హైదరాబాదులో సిపిఐ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయం..





చురకలు ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్ కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఖగర్ ఆపరేషన్ ఆదివాసీ జాతిని హననంచేస్తున్న తీరును సిపిఐ నాయకత్వం తీవ్రంగా ఎండగట్టింది. ఆపరేషన్ కగార్ నిలిపివేయడంతో పాటు తక్షణమే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో బేషరతుగా శాంతిచర్చలు జరపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. అర్బన్ నక్సలైట్ పేరుతో మేధావులను నిర్బంధించడం, నక్సలైట్ల పేరుతో అమాయకులను కాల్చి చంపడం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమని సిపిఐ నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాదులో ప్రెస్ మీట్ లో మాట్లాడారు. దాదాపు 20 వేల మంది పోలీసుల బలగాలతో కర్రెగుట్టను చుట్టుముట్టి నరమేధం సృష్టించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశాయి. వెంటనే కర్రెగుట్టల నుంచి పోలీసు క్యాంప్ ఎత్తివేయాలని కోరాయి. హైదరాబాద్ సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్ మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, సిపిఐ ఎంల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కె.జి.రాంచందర్, ఎంసిపిఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఆర్ రాష్ట్ర కార్యదర్శి ఎ.జానకి రాములు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, ఎస్ యు సి ఐ రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్.మురహరి, పార్వర్డ్ బ్లాక్ నాయకులు ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పరాయి దేశంపై యుద్ధం చేస్తున్నట్లు దేశ పౌరులైన మావోయిస్టులను తుదముట్టిస్తామని ప్రతిజ్ఞ చేసి మరీ అత్యంత కిరాతకంగా వేటాడి వెంటాడి చంపడం దుర్మార్గమన్నారు. దీనిని న్యాయ స్థానాలు సుమోటాగా స్వీకరించి న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. మావోయిస్టుల అడవులను గానీ, అక్కడ ఉన్న సంపద కానీ స్వాధీనం చేసుకోలేదని, అమాయక ప్రజలైన ఆదివాసీల హక్కులు, వారి రక్షణ కోసం మాత్రమే పోరాడుతున్నారన్నారు. కానీ అదే రాజ్యాంగ బద్దంగా ఎన్నికైన కేంద్ర ప్రభుత్వం ఆ సహజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడంలో భాగంగా వారిని తుదముట్టిస్తుండడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. మావోయిస్టుల పేరుతో అడువుల్లో వారిని కాల్చి చంపుతూ, అర్బన్ నక్సలైట్ల పేరుతో మేధావులైన వరవరరావు, ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వారిని అక్రమంగా జైళ్లలో నిర్భంధించి తీవ్ర మానసిక క్షోభకు గురిచేసి చంపుతున్నారన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఎవరూ ఊహించలేని పరిస్థితులు నేడు దేశంలో నెలకొన్నాయని, స్వాతంత్రం రాకముందు కూడా సాయుధ పోరాటం జరిగిందని, అప్పుడు కూడా ఇప్పుడు ఉన్న పరిస్థితి లేదని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ఫ్యాసిస్టు ప్రభుత్వం ప్రశ్నించే వారు ఉండకూదని, అందుకే కుంటి సాకులతో మావోయిస్టులను భౌతికంగా అంతం చేస్తోందన్నారు. మావోస్టులు తప్పు చేస్తే రాజ్యాంగ బద్దంగా ఏర్పడిన చట్టాల ద్వారా శిక్షించాలి కానీ ప్రజాస్వామ్యంలో ఒకరిని చంపే అధికారం ఎవరికీ లేదన్నారు. గోద్రా అల్లరి కేసుల్లో గుజరాత్ రాష్ట్రం నుంచి బహిష్కరణకు గురైన అమిత్ షా అనే వ్యక్తి దేశ హెూంశాఖ మంత్రిగా ఉండడం ఈ దేశ ప్రజల దురదృష్టమన్నారు. తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

**వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మే 2న సదస్సు**

కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేసి మావోయిస్టులతో భేషరతుగా చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సదస్సును మే 2వ తేదీన హైదరాబాద్ బషీర్ బాగ్ దేశోద్ధారకభవన్ లో నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ సదస్సులో వామపక్ష పార్టీల నాయకులతో పాటు వివిధ వర్గాల మేధావులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. సదస్సులో అన్ని పార్టీలు, వర్గాల అభిప్రాయాల మేరకు కగార్ ఆపరేషన్ చర్చించి కేంద్రం శాంతి చర్చలు చేపట్టేలా ఒత్తిడి తెచ్చేందుకుగాను కార్యాచరణను రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు.

# మహిళా కమిషన్ విచారణకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే

హైదరాబాద్, ఏప్రిల్ 29: ఎల్బీనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఈరోజు(మంగళవారం) మహిళా కమిషన్ విచారణకు హాజరయ్యారు. జీహెచ్ఎంసీ మహిళా కార్పొరేటర్ సుజాత నాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సుధీర్ రెడ్డిపై మహిళా కమిషన్‌లో ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో ఫిర్యాదుపై వివరణ ఇవ్వాలని, కమిషన్ ముందుకు హాజరు కావాలంటూ సుధీర్ రెడ్డికి మహిళత కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఇందులో భాగంగా నేడు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విచారణకు హాజరయ్యారు.

కాగా.. ఎల్బీనగర్ నియోజకవర్గంలో శంకుస్థాపన వ్యవహారంలో జరిగిన గొడవ సందర్భంగా హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్‌ను ఉద్దేశించి సుధీర్ రెడ్డి పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై సుజాతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే సుజాతకు మద్దతుగా పలువురు రోడ్డెక్కి నిరసనకు దిగారు. ఎస్టీ మహిళా కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్‌పై అసభ్యకర వ్యాఖ్యలకు చేసినందుకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారదకు ఫిర్యాదు చేశారు.

ఒక ఎస్టీ మహిళను కాబట్టే తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని కమిషన్ ముందు సుజాత కన్నీంటి పర్యంతమయ్యారు. ఈ వ్యవహారాన్ని మహిళా కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను విచారణకు రావాల్సిందిగా సుధీర్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. అలాగే ఈ వ్యవహారంపై ఎల్బీనగర్ పోలీసులకు కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యేపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. సుధీర్ రెడ్డి వ్యాఖ్యలపై డీసీపీ ఆఫీసులో కూడా ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డిని కలిసి మాట్లాడినట్లు సుజాత తెలిపారు. ఇలాంటి వారిని బీఆర్ఎస్ కూడా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాడుతానని కార్పొరేటర్ సుజాత నాయక్ స్పష్టం చేశారు.

## ఉగ్రవాద సమూల నాశనానికి...

# మోదీ సర్కార్ భారీ స్కెచ్!

# ఇక పాకిస్తాన్ కోరలు పీకుడే!




జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడి తర్వాత దేశంలో పరిస్థితులు ఆసక్తికరంగా మారుతున్నాయి. పాకిస్తాన్ విషయంలో భారత్ ఏం చేయబోతుందనేదే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఉత్కంఠ. పాకిస్తాన్ విషయంలో ముందు నుంచి కఠినంగా ఉంటున్న మోడీ సర్కార్ ఇప్పుడు కచ్చితంగా దిమ్మ తిరిగిపోయే దెబ్బ కొట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

పదేపదే ఉగ్రవాదులను దేశంలోకి పంపిస్తున్న పాకిస్తాన్ కు సరైన బుద్ధి చెప్పేందుకు కేంద్ర సర్కార్ పక్కా ప్రణాళికలు రచిస్తోంది. సరిహద్దుల నుంచి ఉగ్రవాదులను పదుల సంఖ్యలో భారత్ కు పంపిస్తున్న పాకిస్తాన్.. ఇప్పటికే అంతర్జాతీయంగా వస్తున్న విమర్శలతో ఉక్కిరి బిక్కిరి అవుతుంది. 27 మంది భారత పౌరుల ప్రాణాలు తీసిన పాకిస్తాన్ విషయంలో మోడీ సర్కార్ ఇప్పుడు.. ఓ వ్యూహం ప్రకారం దాడి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్.. ఇప్పటికే గ్రౌండ్ వర్క్ ఫాస్ట్ గా కంప్లీట్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని గురిపెట్టే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మన సరిహద్దుల్లో వందల మంది ఉగ్రవాదులు ఉన్నారని గుర్తించిన భారత నిఘా వర్గాలు.. వారిని అంతం చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి. కేంద్ర రక్షణశాఖ తో కలిసి.. పనిచేస్తున్న దోవల్.. ఈ విషయంలో ఇజ్రాయిల్ సహకారం తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్.. ఇంటెలిజెన్స్ బ్యూరో.. వంటి సంస్థలు సరిహద్దుల్లో పెద్ద ఎత్తున నిఘా పెట్టాయి. ఇప్పుడు ఇజ్రాయిల్ నిఘా సంస్థ మోసాద్ ను సరిహద్దుల్లో రంగంలోకి దించేందుకు అజిత్ దోవల్ సిద్ధమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పెద్దల అనుమతితో.. మోసాద్ నుంచి మొత్తం 25 మంది అధికారులను భారత్ తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. వారి సహకారంతో సరిహద్దుల్లో ఎంతమంది ఉగ్రవాదులు ఉన్నారు.. వారికి స్థానికంగా సహకరించే వారెవరు.. వారికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి.. ఉగ్రవాదుల ప్రధానంగా భారత్ లోకి వచ్చే మార్గాలు ఏంటి.. వాళ్లు ఏ కాలంలో ఎక్కువగా భారత్ లో అడుగు పెడుతున్నారు.. అడుగుపెట్టిన తర్వాత వాళ్లను రిసీవ్ చేసుకునేది ఎవరు.. స్థానికంగా వారికి ఎవరైనా ఆయుధాలు సమకూరుస్తున్నారా.. వంటివి ఇప్పుడు తెలుసుకుని పాకిస్తాన్ కు దిమ్మ తిరిగిపోయే షాక్ ఇవ్వాలని అజిత్ దోవల్ ఓ ప్రణాళిక ప్రకారం వెళుతున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ముఖ్యంగా కాశ్మీర్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఉగ్రవాదులకు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది అనేది భారత్ అనుమానం. అందుకే ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలపై ఎక్కువగా ఫోకస్ పెడుతున్నారు నిఘావర్గాలు. అదేవిధంగా వాళ్లకు టెక్నాలజీ సపోర్ట్ ఎక్కడి నుంచి లభిస్తుంది అనే దానిపై కూడా భారత్ సమాచారం సేకరించినందుకు పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేస్తోంది.

కాశ్మీర్లో ఉన్న స్థానికుల నుంచి పాకిస్థాన్ ఉగ్రవాదులకు మద్దతు లభించడంతోనే ఈ స్థాయిలో దాడులు జరుగుతున్నాయి. అందుకే స్థానికులు పైనే ఎక్కువగా గురిపెట్టి.. ఉగ్రవాదాన్ని అంతం చేయాలని భారత్ ప్రణాళికలు రచిస్తోంది.

thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 49 | కరీంనగర్ బుధవారం, 30 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00


## త్వరలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు

న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ వేదికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా యాప్‌లు భారీ సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. వీటి నియంత్రణ ప్రభుత్వాలకు సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మీడియా కౌన్సిల్ అనివార్యమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి ఇటీవలే నివేదించింది. ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కొత్తగా మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం డిజిటల్ వేదికలు ఐటీ చట్టం, 2021 కింద ఉన్నాయి. ప్రింట్ మీడియాను ప్రెస్ కౌన్సిల్ నియంత్రిస్తున్నది. టీవీ చానళ్లు కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ మీడియా కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.

## కాళేశ్వరంపై నివేదిక ఎవరిస్తే ఏం?

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై రిపోర్టు ఎవరు ఇచ్చారనేది ముఖ్యం కాదు.. నిర్మాణంలో అవకతవకలు జరిగాయా లేదా అనేది ముఖ్యమని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఎన్‌డీఎస్‌ఏ అనేది చట్టబద్ధంగా ఏర్పాటైందని తెలిపారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూసుకోవాలన్నారు. భారాస అధినేత కేసీఆర్ తలాతోక లేని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణకు కేంద్రం నుంచి ఎన్నో ప్రాజెక్టులు వచ్చాయని తెలిపారు.



భారాస అధినేత కేసీఆర్ ప్రధాని కార్యక్రమాలను బహిష్కరించి రాష్ట్రాభివృద్ధిలో భాగం కాలేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఏడాదిన్నరగా అసెంబ్లీకి రాలేదు.. ప్రజల్లోకీ రాలేదన్నారు.

ఇందుకు ఆయన తెలంగాణ ప్రజల్ని క్షమాపణ కోరాలన్నారు. మావోయిస్టులు తుపాకులు వదిలిపెట్టి ప్రజల్లోకి వస్తే మంచిదని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి అన్నారు. తుపాకులు పట్టుకొని శాంతి చర్చలు అంటే ఎలా అని ప్రశ్నించారు.




ఉగ్రవాదాన్ని అణచివేయాలనేదే దేశ సంకల్పమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారత సాయుధ దళాల సామర్థ్యాలపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఇటీవల ఉగ్రదాడిపై ప్రతిస్పందించే విషయంలో.. అనుసరించాల్సిన పద్ధతులు, లక్ష్యాలు, సమయాన్ని నిర్ణయించే విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సహా త్రివిధ దళాల అధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలో అంతర్గత భద్రత, సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ తన నివాసంలో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ భేటీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠీ, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌లు పాల్గొన్నారు.

**ఊహకందని రీతిలో..** ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ప్రస్తావించిన ప్రధాని మోదీ.. ఉగ్రవాదులు, వారిని పెంచి పోషిస్తున్న వారిని పాతాళంలో తొక్కేస్తామని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అంతేకాదు, వారి ఊహకందని రీతిలో చర్యలు ఉంటాయని చెప్పినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రఘటనకు ప్రతీకార దాడులు తప్పవని ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ ప్రధాని మోదీ మాటలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

**వరుస భేటీలు..** మరోవైపు భద్రతారంగ కేబినెట్ కమిటీ బుధవారం సమావేశం కానుంది. వారం రోజుల వ్యవధిలో భేటీ కానుండటం రెండోసారి. అనంతరం మోదీ నేతృత్వంలో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం కానుందని సమాచారం. ఇందులో సీసీఎస్‌లోని ఐదుగురు సభ్యులతో పాటు రవాణా, ఆరోగ్య, వ్యవసాయ, రైల్వే మంత్రులు ఉన్నారు. ఇలా కీలక భేటీలు జరిగే ఒకరోజు ముందే త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇదిలా ఉంటే, 2016లో ఉరిలో ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి భారత సైన్యం మెరుపుదాడులు చేసింది. అనంతరం 2019లో సీఆర్పీఎఫ్ బలగాలే లక్ష్యంగా పుల్వామాలో జరిగిన దాడి అనంతరం భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ చేపట్టిన సంగతి తెలిసిందే.

## మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్‌ఏ నివేదికలో ఎక్కడా లేదు: హరీశ్‌రావు

హైదరాబాద్: కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక మీద నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రమంతటా బీఆర్ఎస్ రజతోత్సవ సభ, కేసీఆర్ ప్రసంగంపై చర్చ జరుగుతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

ఎన్డీఎస్ ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగామారిందని హరీశ్‌రావు ఆక్షేపించారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికపై మంత్రి



ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్‌రావు స్పందించారు. ఈ సందర్భంగా పలువురు నేతలతో కలిసి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. "జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు డీపీఆర్ ఉందా? డీపీఆర్ లేకుండానే కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోతే ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడలేదు? పోలవరానికి ఎందుకు పోలేదు? ఎందుకు నివేదిక ఇవ్వలేదు? ఎన్డీఎస్ఏ అనేది ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారింది. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయి" అని విమర్శించారు.

## కర్రెగుట్టలో కొనసాగుతున్న కూంబింగ్...స్పాట్ లో వేలాదిమంది మావోయిస్టులు

ఆపరేషన్ కగార్ లో భాగంగా కీలకమైన కర్రెగుట్టను స్వాధీనం చేసుకునేందుకు భద్రతా దళాలు ప్రయత్నిస్తున్నారు. ఇందు కోసం ఏడు రోజులుగా కూంబింగ్ జరుగుతోంది. ఈ గుట్టల్లో సుమారు 1000మంది మావోయిస్టులు ఉన్నట్లు బలగాలకు సమాచారం ఉండడంతో గాలింపు ముమ్మరం చేశారు. పదివేల మందితో కూడిన భద్రతా దళాలు ఈ కూంబింగ్లో పాల్గొంటున్నాయి. కర్రెగుట్టలో 100 కు పైగా సొరంగాలు, గుహలు ఉన్నట్లు భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ గుహలు బలగాలకు సవాల్గా మారాయి. గుట్ట చుట్టూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను నిర్వీర్యం చేసుకుంటూ బలగాలు ముందుకు సాగుతున్నాయి. ఇప్పటివరకు 112 ఎల్ఈడీ బాంబులను బలగాలు నిర్వీర్యం చేశాయి. మావోలు ప్రెషర్ కుక్కర్ బాంబులతో బలగాలకు సవాల్ విసురుతున్నారు. మరోవైపు విపరీతమైన ఎండలు దళాలకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. 3 బేస్ క్యాంపులతో భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి. మరోవైపు డ్రోన్లు, హెలికాప్టర్లతో సెర్చింగ్ ఆపరేషన్ను కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆపరేషన్ కగార్ నిలిపివేయాలంటూ మావోలు కోరుతున్నారు. శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి మరోసారి లేఖ విడుదల చేశారు. ఛత్తీస్గఢ్ -తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టల్లో భద్రతా దళాల కూంబింగ్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న కర్రెగుట్టల్లో వారి రహస్య స్థావరాల్లోకి భద్రతా



బలగాలు చొచ్చుకెళ్లాయి. గుట్టలో భారీ సొరంగాన్ని గుర్తించిన విషయం తెలిసిందే. ఒక్కొక్కరే వెళ్లగలిగేలా ఉన్న ఈ రాతి సొరంగం మార్గంలో దాదాపు 80 అడుగులు లోపలికి వెళ్లిన కోబ్రా, సీఆర్ఫీఎఫ్ బలగాలు విశాలంగా ఉన్న ప్రాంతాన్ని గుర్తించాయి. లోపల అనుబంధంగా మరో నాలుగు గుహలు ఉన్నట్లు నిర్ధారించాయి.ఇక్కడ దాదాపు వెయ్యి మంది ఆశ్రయం పొందవచ్చని ఆనవాళ్ల బట్టి అంచనా వేశారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆయా ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఆపరేషన్కు కొంత ఆటంకం ఎదురైంది. తరువాత వెంకటాపురం మండలంలోని తాపాల నిచ్చెన మీదుగా కర్రెగుట్టల్లోకి బలగాలు చొచ్చుకెళ్లాయి. చెలిమల, ముకునూరు అరణ్యంలో కూంబింగ్ను నిర్వహిస్తూ ముందుకు సాగాయి.




## డీజీపీ రేసులో ఆ ఎనిమిది మంది

హైదరాబాద్, ఏప్రిల్ 29: తెలంగాణ డీజీపీ డా. జితేందర్ మరికొన్ని నెలల్లో రిటైర్ అవనున్నారు. ఈ నేపథ్యం కొత్త పోలీస్ బాస్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. డీజీపీ రేసులో ఎనిమిది మంది సీనియర్ ఐపీఎస్‌లు ఉన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఎనిమిది మంది పేర్లను సర్కార్ పంపించింది. రాష్ట్ర ప్రభుత్వం అర్హతల ఆధారంగా జాబితా నుంచి ముగ్గురి పేర్లను సూచిస్తూ తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి యూపీఎస్సీ పంపించనుంది. ప్రస్తుతం డీజీపీగా కొనసాగుతున్న డా.జితేందర్ ఈ ఏడాది సెప్టెంబర్ 6న పదవీ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో ఎనిమిది మంది సీనీయర్ ఐపీఎస్‌ల పేర్లను యూపీఎస్సీకి సర్కార్ పంపించింది. రవి గుప్తా, సీవీ ఆనంద్, డా. జితేందర్ , ఆప్టే వినాయక్ ప్రభాకర్, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి. బి. శివధర్ రెడ్డి డా. సౌమ్య మిశ్రా శిఖా గోయల్ పేర్లను రాష్ట్ర ప్రభుత్వం పంపించింది. వీరిలో తెలంగాణ పోలీస్ శాఖ కొత్త బాస్ ఎవరో మరికొద్దిరోజుల్లో తెలియనుంది. ఈ ఎనిమిది మంది ఐపీఎస్ ఆఫీసర్లతో అర్హతల ఆధారంగా ముగ్గురి పేర్లను సూచిస్తూ సర్కార్‌కు తిరిగి పంపించనుంది యూపీఎస్సీ. వారిలో ఒకరిని ప్రభుత్వం డీజీపీగా నియమించనుంది.

# మావోయిస్టులు ఓకే చెబితే, బిజెపి సర్కార్ శాంతికి అంగీకరించాలి

## మావోయిస్టుల ప్రతిపాదనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి - ఆదివాసి ప్రాంతాల్లో వారి హక్కుల పై ప్రత్యేక చట్టాలు ఉన్నాయి



### భారత్ బచావో నాయకులతో మంత్రి సీతక్క

చురకలు ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్ కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ ఖగర్ కు వ్యతిరేకంగా సీతక్క గళం విప్పారు. గిరిజన ఆదివాసి బిడ్డగా ఆదివాసులపై కొనసాగుతున్న సైనిక దాడులను వ్యతిరేకిస్తున్నానని సీతక్క అన్నారు. గిరిజన మంత్రి ఛాంబర్ లో,ప్రజాభవన్లో మంత్రి సీతక్కతో భేటీ అయిన భారత్ బచావో సంస్థ ప్రతినిధులు గాదె ఇన్నయ్య, డాక్టర్ ఎమ్ ఎఫ్ గోపీనాథ్, జంజర్ల రమేష్ బాబు లు అనేక విషయాలు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి జానారెడ్డి ని కలిసిన బృందం కర్రెగుటలో జరిగిన అక్కగారు ఆపరేషన్ పరిణామాలను మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. శాంతి చర్చల కోసం తెలంగాణ నుండి ప్రయత్నాలు మొదలు పెట్టాలని వారు జానారెడ్డిని కోరారు. ఆపరేషన్ కగార్ ను నిలిపివేసేలా తన వంతు ప్రయత్నం చేయాలని మంత్రి సీతక్కను విజ్ఞప్తి చేసిన భారత్ బచావో ప్రతినిధులు.తెలంగాణ చత్తీస్గడ్ సరిహద్దు కర్రెగుటల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని నిలువరించేలా చొరవ చూపాలని మంత్రి సీతక్కను కోరిన ఆమె కగారి దాడులకు వ్యతిరేకంగా నిలుస్తానని తెలిపారు.వేల సంఖ్యలో కేంద్ర బలగాలు కర్రెగుట్ట ప్రాంతాల్లో సంచరిస్తున్నటంతో ఆదివాసీలు భయాందోళనకు గురవుతున్నారని మంత్రి దృష్టికి గోపీనాథ్ ఇన్నయ్యలు వివరించారు ఆపరేషన్ కగారును తక్షణం నిలిపివేయకపోతే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని పేర్కొన్న ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు.ఆపరేషన్ కగారు నివారణకు కృషి చేయాలని మంత్రి సీతక్కను విజ్ఞప్తి చేసిన ప్రతినిధుల వివరాలకు ఆమె సానుకూలంగా స్పందించారు.ఆదివాసీల ప్రయోజనాల దృష్టిలో ఆపరేషన్ కగార్ ను తక్షణం నిలిపివేయాలని మంత్రి సీతక్కకేంద్ర ప్రభుత్వాన్ని కోరారుశాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలని శీతక్క అన్నారు.తెలంగాణ చత్తీస్గడ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలిమధ్యభారతంలోని ఆదివాసి ప్రాంతాలు రాజ్యాంగం లోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయని మంత్రి పేర్కొన్నారు అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులుంటాయని ఆమె గుర్తు చేశారు.ఆదివాసి ప్రాంతాల్లో ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయిఅందుకే ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వారి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలిబల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలనీ ఆదివాసి బిడ్డగా కోరుకుంటున్నాను మరోసారి తెలిపారు.ఆదివాసీల హక్కులను ఎవరూ కాలరాయవద్దు, ఆ జాతి బిడ్డగా ఆది వాసులకు అండగా నిలుస్తాను..ఆపరేషన్ కగార్ తో ఆదివాసీలు తీవ్రభయాందోళనతో ఉన్నారని ఇది సరైన ధోరణి కాదన్నారు.మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలి.రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయి.. శాంతి ఒకటే మార్గమని చర్చలకు మావోయిస్టులు ఒప్పుకున్నప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా శాంతి చర్చలకు సానుకూల వాతావరణం కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు.



చురకలు

## సంపాదకీయం

# భారత్ పై ఎన్నాళ్లీ ద్వేషం.. ఈ బీబీసీకి బుద్ధి రావడం లేదా?

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఇటీవల జరిగిన ఉగ్రదాడి తీవ్ర విషాదాన్ని, అంతర్జాతీయంగా సంచలనాన్ని సృష్టించింది. ఈ దాడికి సంబంధించిన కవరేజీ విషయంలో బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ ప్రచురించిన ఒక వార్తా కథనంపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. ఇది భారత్, బీబీసీ మధ్య కొత్త వివాదానికి దారితీసింది. బీబీసీ ఉద్దేశపూర్వకంగా భారత్‌పై విషం కక్కుతోందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**–బీబీసీ కథనంపై అభ్యంతరాలు ఏమిటి?** పహల్గాం దాడి తర్వాత బీబీసీ ప్రచురించిన ఒక కథనంలో రెండు ప్రధాన అంశాలపై భారత్ అభ్యంతరం తెలిపింది. బీబీసీ తన కథనంలో ఉగ్రదాడిని 'మిలిటెంట్ దాడి'గా పేర్కొంది. 'ఉగ్రవాది' అనే పదాన్ని ఉపయోగించకుండా 'మిలిటెంట్' అని అనడం దాడి తీవ్రతను తగ్గించడమేనని, ఇది ఉగ్రవాదాన్ని తక్కువ చేసి చూపడమేనని భారత వర్గాలు తీవ్రంగా భావిస్తున్నాయి. ఈ దాడి నేపథ్యంలో పాకిస్థాన్ భారతీయుల వీసాలను రద్దు చేసిందని బీబీసీ తన కథనంలో పేర్కొంది. ఇది నిరాధారమైన, తప్పుడు సమాచారమని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కథనం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అనేకమంది భారతీయులు బీబీసీ తీరుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. భారత్‌పై బీబీసీకి ఎన్నాళ్లు ఈ ద్వేషం, ఎందుకు ఇలాంటి విష ప్రచారం చేస్తోందని ప్రశ్నించారు.

**–కేంద్ర ప్రభుత్వం లేఖ – నిశిత పర్యవేక్షణ...** ఈ నేపథ్యంలోనే, భారత విదేశీ వ్యవహారాల శాఖ బీబీసీకి సోమవారం ఒక అధికారిక లేఖ రాసింది. ఈ లేఖ ద్వారా పహల్గాం దాడి కవరేజీపై తమ తీవ్ర అభ్యంతరాలను స్పష్టం చేసింది. బీబీసీ హెడ్ జాకీ మార్టిన్‌కు తమ దేశ బలమైన వాదనను, వాస్తవ పరిస్థితిని వివరించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. భవిష్యత్తులో ఈ దాడికి సంబంధించిన బీబీసీ కవరేజీని నిశితంగా పర్యవేక్షిస్తామని కూడా ఈ లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఇది అంతర్జాతీయ మీడియా సంస్థల కవరేజీపై భారత్ తన వైఖరిని ఎంత గట్టిగా తెలియజేస్తుందో స్పష్టం చేస్తుంది.

**–ఉగ్రదాడి – భారత్ కఠిన వైఖరి...** ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఈ దాడిలో 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదాన్ని అణచివేసే వరకు పాకిస్థాన్‌పై కఠిన వైఖరి అవలంబించాలని భారత్ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే పలువురు పాకిస్థాన్ జాతీయులను వెనక్కి పంపించింది. తాజాగా పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న పలు యూట్యూబ్ ఛానెళ్లు, సోషల్ మీడియా ఖాతాలతో సహా మొత్తం 16 అకౌంట్లను భారతదేశంలో నిలిపివేసింది. ఇది ఉగ్రవాద ప్రచారాన్ని, తప్పుడు సమాచారాన్ని అడ్డుకోవడంలో భారత్ దృఢ సంకల్పానికి నిదర్శనం. బీబీసీ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలు ఉగ్రవాదాన్ని కేవలం 'మిలిటెంట్' చర్యగా చిత్రీకరించడం, నిరాధారమైన సమాచారాన్ని ప్రచురించడం తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. ఇది వాస్తవ పరిస్థితిని వక్రీకరించి, ఉగ్రవాదులకు పరోక్షంగా మద్దతునిస్తుందని భారత్ భావిస్తోంది. అందుకే, కవరేజీపై ఇంత తీవ్రంగా ప్రతిస్పందించింది. జాతీయ భద్రత, ఉగ్రవాదం వంటి సున్నితమైన అంశాలపై వార్తా సంస్థలు అత్యంత జాగ్రత్తగా, వాస్తవాలను మాత్రమే ప్రచురించాల్సిన అవసరం ఉంది. బీబీసీ కవరేజీపై భారత్ వ్యక్తం చేసిన అభ్యంతరాలు, ప్రభుత్వ లేఖ ఈ అంశంపై భారత వైఖరి ఎంత పటిష్టంగా ఉందో తెలియజేస్తున్నాయి. ఈ వివాదం అంతర్జాతీయ మీడియా కవరేజీపై భవిష్యత్తులో ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. భారత్‌పై బీబీసీకి పక్షపాత వైఖరి ఉందనే ఆరోపణలు ఈ ఘటనతో మరోసారి తెరపైకి వచ్చాయి.

# ప్రతిష్టాత్మకం.... దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం - ఏప్రిల్ 30... దాదా సాహెబ్ ఫాల్కే జయంతి

సమకాలీన సమాజంలో సినిమా ఒక అత్యంత ప్రాముఖ్యత గల అంశం. అనాదిగా ప్రదర్శిత మౌతున్న కళారూపాలు, నాటకాలు, నృత్యాలు, కథాకాల క్షేపాలు, బొమ్మలాటలు, కవితలు వంటి ఎన్నో కళలను ఒకటిగా మేళవించి, ఒకే సమయంలో ప్రేక్షకుల ముందుంచగల అపూర్వ సృష్టి సినిమా. ఇది పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానం వల్లనే సాధ్యమయ్యింది. భారత దేశంలో చలన చిత్ర చరిత్రతో దాదా సాహెబ్ కు విడదీయరాని బంధం, అను బంధం ఉన్నాయి. 1904లో మొట్ట మొదటిసారి భారతదేశంలో "విదేశాలనుండి తెచ్చిన 'The Life of Christ' (క్రీస్తు జీవితం) అనే చిత్రాన్ని ఒక చేతితో త్రిప్పే ప్రొజెక్టర్‌పై చూపించారు. ఆ సినిమాను మళ్ళీ మళ్ళీ చూసిన దాదాసాహెబ్ ఫాల్కేలో స్వయంగా సినిమా తీయాలనే కోరిక బలపడింది. 'ABCD of Cinematography' అనే పుస్తకాన్ని ఆయన క్షుణ్ణంగా అధ్యయనం చేశాక, 1912లో ఇంగ్లాండు వెళ్ళి దాదాసాహెబ్ ఒక కెమెరాను (Williamson Camera), ఇతర పరికారాలనూ కొని వాటిని ఉపయోగించడం నేర్చుకొన్నాడు. వాటితో ఆయన 1912లో తీసిన 'రాజా హరిశ్చంద్ర' భారతదేశపు మొదటి చలనచిత్రం. ఇది 1913 మే 17న విడుదల అయ్యింది. భారత దేశంలో చలన చిత్ర రంగం ఆవిష్కారానికి ఆయన చేసిన కృషి అనన్య సామాన్యం. అలా ఒక అంకిత స్వభావుడి అరుదైన కృషి, జిజ్ఞాసల ఫలితంగా భారత దేశంలో సినీ చరిత్ర ప్రారంభం అయింది. సంగీతం, చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ, మాజిక్, మౌల్డింగ్ వంటి అనేక రంగాలలో ఆరితేరిన ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే భారతీయ చలనచిత్ర పితా మహుడు కాగలిగాడు. దాదా సాహెబ్ ఫాల్కేగా గణుతికెక్కాడు. దాదాసాహెబ్ ఫాల్కే శతజయంతి సందర్భంగా 1969 లో దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భారతీయ సినిమా రంగంలో గణనీయమైన సేవ చేసిన వారికి ప్రతి సంవత్సరం ఇచ్చే ప్రతిష్టాత్మక పురస్కారం అది. భారతీయ చిత్ర వికాసంలో ఎనలేని కృషి చేసి, అద్భుత ప్రతిభా పాటవాలను కనబరిచే అతి కొద్ది మంది వ్యక్తులకు మాత్రమే లభించే గౌరవం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు. ఒక సంవత్సరానికి సంబంధించిన పురస్కారం మరుసటి ఏడాది చివర్లో ఇచ్చే జాతీయ సినిమా అవార్డుల తోపాటు ఇస్తారు. నటీనటులు, సంగీత దర్శకులు, ఛాయాగ్రాహకులు, నేపథ గాయకులు, పాటల రచయితలు, దర్శకులు, నిర్మాతలు అలా చలన చిత్రాభివృద్ధికై



విశిష్టంగా కృషి చేసిన ఎవరైనా ఈ అవార్డుకు అర్హులే. అంతటి విశిష్ట సేవ చేసిన చాలా అరుదైన వ్యక్తులు మాత్రమే పొందే బిరుదు ఈ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు. 1969లో మొట్టమొదటి సారిగా ప్రకటించిన ఈ పురస్కారాన్ని నటీమణి దేవికా రాణికి అంద చేశారు. ఆ తర్వాత కాలంలో పృథ్వీ రాజ్ కపూర్, రూబీ మేయర్స్, బి.యన్ సర్కార్ లాంటి వాళ్ళకు ఈ అవార్డ్ అందచేశారు. కానీ మొట్టమొదటగా ఈ అవార్డు అందుకొన్న తెలుగు వారు బియన్ రెడ్డిగా పిలవబడే బొమ్మిరెడ్డి నరసింహా రెడ్డి. తెలుగు వారే కాదు భారతదేశం గర్వించదగ్గ సినిమా లైన "మల్లీశ్వరి", "బంగారు పాప" లాంటి అత్యుత్తమ సినిమాలు రూపొందించిన బి.ఎన్.రెడ్డి సోదరుడైన మరో బి.ఎన్ రెడ్డి కూడా ఈ పురస్కారాన్ని పొందడం విశేషం. బిఎన్ రెడ్డి లతో పాటు ఈ అవార్డు అందుకొన్న తెలుగు వారిలో పైడి జైరాజ్, ఎల్వీ ప్రసాద్, అక్కినేని నాగేశ్వరరావు, డి.రామా నాయుడు, కె. విశ్వనాథ్ ఉన్నారు. సత్యజిత్ రే, అదూర్ గోపాల కృష్ణన్, మృణాళ్ సేన్, శ్యాం బెనగల్, తపన్ సిన్హా, శాంతారాం, హృషికేష్ ముఖర్జీ లాంటి దర్శకులు, శివాజీ గణేశన్, దిలీప్ కుమార్, రాజ్ కుమార్ లాంటి నటులు, మన్నాడే, లతా మంగేష్కర్, ఆశా భోంస్లే లాంటి నేపథ్య గాయకులు ఈ అవార్డు గ్రహీతలుగా ఉన్నారు. 1969లో నటి దేవికా రాణితో ప్రారంభించిబీ 1970లో బి.ఎన్.సర్కార్, నిర్మాతబీ 1971లో పృథ్వీరాజ్ కపూర్, నటుడుబీ1972లో పంకజ్ మల్లిక్, సంగీత దర్శకుడుబీ 1973లో సులోచనబీ1974లో బి.ఎన్.రెడ్డి, దర్శక నిర్మాతబీ1975లో ధీరేన్ గంగూలీ, నటుడుబీ1976లో కానన్ దేవి, నటిబీ1977లో నితిన్ బోస్, దర్శకుడుబీ1978లో ఆర్.సి.బోరల్, స్క్రీన్ ప్లేబీ1979లో సోహ్రాబ్ మోడి, దర్శకనిర్మాతబీ 1980లో పైడి జైరాజ్, దర్శకుడు, నటుడుబీ 1981లో నౌషాద్, సంగీత దర్శకుడుబీ 1982లో ఎల్.వి.ప్రసాద్, దర్శకుడు, నిర్మాత, నటుడుబీ 1983లో దుర్గా ఖోటే, నటిబీ 1984లో సత్యజిత్ రే, దర్శకుడుబీ 1985లో వి.శాంతారాం, దర్శకుడు, నిర్మాత, నటుడుబీ 1986లో – బి.నాగిరెడ్డి, నిర్మాతబీ1987లో రాజ్ కపూర్, నటుడు, దర్శకుడుబీ1988లో అశోక్ కుమార్, నటుడుబీ1989లో లతా మంగేష్కర్, గాయనిబీ 1990లో – అక్కినేనినాగేశ్వర రావు, నటుడుబీ 1991లో భాల్జీ ఫెండార్కర్, గాయకుడు, సంగీత దర్శకుడుబీ1992లో భూపేన్ హజారికా, గాయకుడు, సంగీత దర్శకుడుబీ 1993లో మజ్రూహ్ సుల్తాన్‌పురి, పాటల రచయితబీ1994లో దిలీప్ కుమార్, నటుడు, గాయకుడుబీ 1995లో రాజ్ కుమార్, నటుడు, గాయకుడుబీ1996లో శివాజీ గణేశన్, నటుడుబీ 1997లో ప్రదీప్, పాటల రచయితబీ1998లో బి.ఆర్.చోప్రా, దర్శకుడు, నిర్మాతబీ 1999లో హృషీకేష్ ముఖర్జీ, దర్శకుడుబీ 2000 లోఆషా భోంస్లే, గాయనిబీ2001లో యష్ చోప్రా, దర్శకుడు, నిర్మాతబీ2002లో దేవానంద్, నటుడు, దర్శకుడు, నిర్మాతబీ 2003లో మృణాల్ సేన్, దర్శకుడుబీ2004లో అదూర్ గోపాలక్రిష్ణన్, దర్శకుడుబీ 2005లో శ్యాం బెనగళ్, దర్శకుడుబీ 2006లో తపన్ సిన్హా, దర్శకుడుబీ 2007లో మన్నా డే, గాయకుడుబీ 2008లో వి.కె.మూర్తి, ఛాయా గ్రాహకుడుబీ 2009లో డి.రామానాయుడు, దర్శకుడు, నిర్మాత, నటుడుబీ 2010లో కైలాసం బాలచందర్, దర్శకుడుబీ 2011లో సౌమిత్ర చటర్జీ, నటుడుబీ 2012లో ప్రాణ్, నటుడుబీ 2013లో గుల్జార్, నటుడుబీ 2014లో శశికపూర్, నటుడుబీ 2015లో మనోజ్ కుమార్, నటుడు, దర్శకుడు, నిర్మాతబీ 2016లో కె.విశ్వనాథ్, నటుడు, దర్శకుడు, నిర్మాతబీ 2017లో వినోద్ ఖన్నాబీ2018లో అమితాబ్ బచ్చన్‌బీ 2019లో రజనీకాంత్, 2020లో ఆశా పరేఖ్, 2021లో రజనీకాంత్, 2022లో వహీదా రెహమాన్, 2023లో రేఖ, 2024లో షా రుఖ్ ఖాన్ లకు లభించాయి.


**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అభ్యుదయ కవి శ్రీ శ్రీ - ఏప్రిల్ 30... మహాకవి శ్రీ శ్రీ జయంతి



ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావుగా లబ్ద ప్రతిష్టులైన శ్రీశ్రీ (ఏప్రిల్ 30, 1910 – జూన్ 15, 1983). విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన వారిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షులుగా, సినిమా పాటల రచయితగా ఆయన సుప్రసిద్ధుడు. శ్రీశ్రీ హేతువాది, నాస్తికులు. మహాకవిగా శ్రీశ్రీ విస్తృతామోదం పొందారు. శ్రీశ్రీ పుట్టిన దినం గురించి, ఫిబ్రవరి 1, 1910 న జన్మించానని ఆయన విశ్వసించినా, పరిశోధకులు కొందరు 1910 ఏప్రిల్ 15న జన్మించారని పేర్కొన్నా, విశాఖపట్నం పురపాలక సంఘం వారు ఖరారు చేసిన తేదీనే 1910 ఏప్రిల్ 30 అని విరసం వారు స్పష్టీకరించారు. శ్రీరంగం సూర్యనారాయణకు దత్తుడగుట వలన ఇతను ఇంటిపేరు శ్రీరంగంగా మారింది. ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖపట్నంలో చేసారు. 1925లో ఎస్ ఎస్ ఎల్ సీ ఉత్తీర్ణుడు అయినారు. అదే సంవత్సరం వెంకట రమణమ్మను పెళ్ళి చేసుకున్నారు. 1931 లో మద్రాసు విశ్వ విద్యాలయంలో బియ్యే (జంతుశాస్త్రము) పూర్తి చేసారు. 1935లో విశాఖ లోని మిసెస్ ఎ వి ఎస్ కాలేజీలో డిమాన్స్ట్రేటరుగా చేరారు. 1938లో మద్రాసు ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తరువాత ఆకాశవాణి, ఢిల్లీ లోను, మిలిటరీ లోను, నిజాము నవాబు వద్ద, ఆంధ్ర వాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1933 నుండి 1940 వరకు ఆయన రాసిన మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, గర్జించు రష్యా వంటి గొప్ప కవితలను సంకలనం చేసి మహాప్రస్థానం అనే పుస్తకంగా ప్రచురించారు. తెలుగు సాహిత్యపు దశనూ, దిశనూ మార్చిన పుస్తకం అది. 1935లో విశాఖ లోని మిసెస్ ఎ వి ఎస్ కాలేజీలో డిమాన్స్ ట్రేటర్ గా చేరారు. 1938లో మద్రాసు ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తరువాత ఆకాశవాణి, ఢిల్లీ లోను, మిలిటరీ లోను, నిజాము నవాబు వద్ద, ఆంధ్ర వాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1947లో మద్రాసుకు తిరిగి వచ్చి అక్కడే స్థిరపడ్డారు. తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ మరిన్ని గొప్ప రచనలు చేసారు. ఎన్నో సినిమాలకు పాటలు, మాటలు రాసారు. 1949లో ఒక బాలికను దత్తత తీసుకున్నారు. 1956లో సరోజను రెండవ భార్యగా వివాహమాడారు. 1955 సార్వత్రిక ఎన్నికలలో కమ్యూనిస్టుల తరఫున శ్రీశ్రీ చురుగ్గా ప్రచారం నిర్వహించారు. హనుమాన్ జంక్షన్లో ఒక ప్రచార సభలో, ఆయన ఆరోగ్యం దెబ్బతిని, కొన్ని నెలల పాటు ఆసుపత్రిలో ఉండవలసి వచ్చింది. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో, శ్రీశ్రీ, వావిలాల గోపాలకృష్ణయ్యతో కలిసి, ఖమ్మంలో సమైక్య వాదాన్ని వినిపిస్తూ ప్రదర్శన జరిపారు. శ్రీ శ్రీ ఎన్నో పురస్కారాలు పొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, మొదటి "రాజా లక్ష్మీ ఫౌండేషను" అవార్డు తదితరాలు. అభ్యుదయ రచయితల సంఘానికి (అరసం) అధ్యక్షుడిగా పనిచేసారు. 1970లో ఆయన షష్టిపూర్తి ఉత్సవం సందర్భంగానే అధ్యక్షుడుగా విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది. 18 వ ఏట 1928 లో "ప్రభవ" అనే కావ్య సంపుటిని ప్రచురించారు. 1950 లో మహాప్రస్థానం కావ్యం మొదటిసారిగా ప్రచురితమైంది. మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, బాటసారి, భిక్షువర్షీయసి మొదలైన కవితల సంపుటి అది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీని మహాకవి చేసింది. తరువాత మరోప్రస్థానం, ఖడ్గ సృష్టి అనే కవితా సంకలనాలను, చరమరాత్రి అనే కథల సంపుటిని, రేడియో నాటికలు రచించారు. తెలుగు వారిని ఉర్రూతలూగించిన ఎన్నో గొప్ప సినిమా పాటలను అయన రచించారు. అల్లూరి సీతా రామ రాజు సినిమాకు రాసిన "తెలుగు వీర లేవరా.." అనేది శ్రీశ్రీ రాసిన ఆణిముత్యాల్లో ఒకటి. రెండవ భార్య సరోజతో కలిసి సినిమాలకు మాటలు రాసారు. తెలుగులో మొట్టమొదటి డబ్బింగ్ సినిమా ఆహుతికి శ్రీ శ్రీ మాటలు పాటలు వ్రాశారు. బి.విఠలాచార్యతో పరిచయం కలిగిగాక, అయన కన్నడలో తీసిన కన్యాదానం అనే సినిమాను తెలుగులో కూడా నిర్మించదలచి శ్రీశ్రీని రచయితగా నియమించుకున్నారు. శ్రీ శ్రీ మైసూరులో వుండి ఒక్కరోజులో 12 పాటలు వ్రాశారు. ఇది ప్రపంచ చలనచిత్ర లోకంలో ఒక రికార్డు! మనసున మనసై (డాక్టర్ చక్రవర్తి) హలో హలో ఓ అమ్మాయి (ఇద్దరు మిత్రులు) నా హృదయంలో నిదురించే చెలి (ఆరాధన) తెలుగువీర లేవరా (అల్లూరి సీతారామరాజు) పాడవోయి భారతీయుడా (వెలుగు నీడలు) శ్రీ శ్రీ గీతాలలో కలికి తురాయిలు. తెలుగే మన జాతీయ భాష కావాలనేది తన అభిమతం అన్నారు. ఇది భాషా దురభిమానంతో అంటున్న మాటకాదని, తెలుగు భారతదేశం అంతకీ జాతీయభాష కాగల అర్హత గలదని జె.బి.యస్.హాల్డేన్ అన్నారని, సంస్కృత పదాలను జీర్ణించుకున్న కారణంచేత, అటు ఉత్తరాదివారికీ, ద్రావిడ భాషా కుటుంబంలో ఒకటి కావడంవల్ల ఇటు దక్షిణాది వారికీ, తెలుగు నేర్చుకోవడం చాలా సులభమని హాల్డేన్ పండితుని వాదనతో శ్రీ శ్రీ ఏకీభవిస్తున్నా నన్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# భారతీయ సినిమా పితామహులు ఫాల్కే - ఏప్రిల్ 30... దాదాసాహెబ్ జయంతి



దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గురించి భారత దేశములో తెలియని వారు ఉండరేమో. . భారతీయ సినిమాకు గణనీయమైన సేవ చేసిన వారికి ప్రతి సంవత్సరం ఇచ్చే పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు. భారతీయ సినిమాకు పితా మహునిగా భావించబడే ఫాల్కే జన్మదిన సందర్భంగా 1969లో ఈ పురస్కారం ఏర్పాటు చేయబడింది. అయితే ఫాల్కే గురించి మాత్రం చాలా మందికి తెలియదంటే ఆశ్చర్యం కలుగ మానదు. భారతీయ సినిమా పరిశ్రమ ప్రపంచం లోనే అతిపెద్ద పరిశ్రమలలో ఒకటి. ఎన్నో వేల కుటుంబాలకు జీవనాధారంగా ఉంటూ, కోట్ల ప్రజానీకానికి వినోదాన్ని, ఆటవిడుపునూ అందిస్తున్న సాధనం సినిమా. భారత సినీ పరిశ్రమకు ఆద్యునిగా పేరు గాంచింది దాదాసాహెబ్ ఫాల్కే. ఆయన అసలు పేరు ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే. 1896లో ఆయన బొంబాయి లోని వాట్సన్ హొటల్‌లో ఏసుక్రీస్తు చరితం పై ప్రదర్శించ బడిన సినిమాను చూడటం జరిగింది. ఆ ప్రభావంతో ఆయన హైందవ దేవతలను చూపుతూ సినిమాలు తియ్యాలన్న సంకల్పానికి వచ్చారు. 1913లో అతను తీసిన రాజా హరిశ్చంద్ర సినిమాతో మొదలైన అయన సినీ జీవితం 19 సంవత్సరాలు సాగింది. సినీ నిర్మాతగా, దర్శకుడుగా, స్క్రీన్‌ప్లే – రచయితగా ఈ కాలంలో ఆయన 95 చిత్రాలను, 26 లఘు చిత్రాలను రూపొందించారు. 1870లో నాసిక్‌లోని త్రయం బకేశ్వర్‌లో 1870 ఏప్రిల్ 30 న ఫాల్కే జన్మించారు. బొంబాయిలోని జెజె కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో, బరోడాలోని కళాభవన్ విద్యార్థి. మంచి చిత్రకారుడు, నాటకాల్లో మేకప్ వేశారు. మంచి మెజీషియన్ కూడా... ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. ఆ కాలంలోనే ప్రింటింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం జర్మనీ వెళ్లాలనుకున్నారు. సినిమాకు సంబంధించిన వార్త ఒకటి పత్రికలో వచ్చింది. ఆయనను ఆ వార్త బాగా ఆలోచింప జేసింది. మన దేశంలో కూడా సినిమాను ఎందుకు తీయకూడదు అనే ఆలోచన ఆయనను కుదురుగా ఉండనివ్వలేదు. తన వద్ద ఉన్న డబ్బు, మిత్రుల నుంచి తీసుకున్న అప్పు, జీవిత బీమా డబ్బు మొత్తం తీసుకొని సినిమా నిర్మాణానికి సంబంధించిన పరికరాలు కొనడానికి 1912లో ఇంగ్లాండ్ వెళ్లారు. అయితే ఫాల్కేకు తాను చరిత్ర సృష్టించ బోతున్నానని తెలియదు, అదే తన జీవితాన్ని పేదరికం లోకి నెట్టివేస్తుందనీ ఊహించలేదు. ఫాల్కే 1913లో రాజా హరిశ్చంద్ర, ఆదే సంవత్సరం మోహినీ భస్మాసుర, సత్యవాన్ సావిత్రి (1914) శ్రీకృష్ణ జననం (1918) కాళీయ మర్దన్ (1919) నిర్మించారు. ఆ తరువాత సినిమా రంగంలో క్రమంగా వ్యాపార ధోరణి మొదలైంది. దాంతో ఫాల్కే పక్కకు తప్పుకున్నారు. సినిమా ప్రేమ ఆయన్ని నిలువనివ్వలేదు. తన పలుకుబడి, పరిచయాలు ఉపయోగించి నిధులు సమీకరించి 1937లో గంగావతరణ సినిమా తీశారు. నిండా మునిగి పోయారు. సినిమాను వ్యాపారంగా చూసి ఉంటే ఆయన పరిస్థితి బాగానే ఉండేది. సినిమాను విపరీతంగా ప్రేమించి దెబ్బతిన్నారు. తన వారసులను పేదరికంలోకి నెట్టేశారు. ఆయన దేశానికి తీసుకు వచ్చిన సినిమాతో సినీ వ్యాపారులు కోట్లు సంపాదించారు. పాపులారిటీని, రాజకీయాల్లో పదవులు సంపాదించారు, కానీ ఫాల్కే మాత్రం కఠిక దరిద్రంలో మరణించారు. ఆయన కుమారుడు ముంబై వీధుల్లో చిల్లర వ్యాపారిగా జీవితం గడిపారు. బాగున్న రోజుల్లో ఫాల్కే ఫోర్డ్ కారును ఉపయోగించే వారు. 1920 ప్రాంతంలో ఆ కారులోనే షూటింగ్‌కు వెళ్లేవారు. తిరిగి సినిమా తీయాలని నిర్ణయించుకున్న కాలంలో దాన్ని అమ్మేశారు. ఆ కారు పెళ్ళిళ్ల ఊరేగింపునకు ఉపయోగించారు. ఐదేళ్ల క్రితం ఆ కారు నాసిక్ డంప్ యార్డ్‌లో లభించింది. తొలి భారతీయ సినిమా కెమెరాను ఫాల్కే జర్మనీ నుంచి తెప్పించారు. అదేమైందో ఇప్పుడు ఎవరికీ తెలియదు. సినిమా నిర్మాణానికి ఎలాంటి ఏర్పాట్లు లేని కాలంలో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి ఫాల్కే తొలి సినిమా తీశారు. ఫాల్కే భార్య సరస్వతి భారతీయ తొలి సినిమా రాజా హరిశ్చంద్ర నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఆమెనే తొలి భారతీయ సినిమా టెక్నీషియన్. సరస్వతి, షూటింగ్ సమయంలో వెలుతురు కెమెరాపై పడకుండా బెడ్ షీట్‌ను అడ్డుగా పట్టుకుని ఉండేవారట. షూటింగ్‌కు కావలసినవన్నీ సమకూర్చేవారు. రాత్రి పూట క్యాండిల్ వెలుగులోనే ఈ సినిమాకు సంబంధించిన సాంకేతిక పనులు నిర్వహించే వారు. సినిమా బృందం 60–70 మందికి ఆమెనే వంట చేసి పెట్టేవారు. రాజా హరిశ్చంద్రలో హరిశ్చంద్రుని కుమారునిగా ఫాల్కే కుమారుడు బాలచంద్ర నటించారు. తొలి భారతీయ బాలనటుడు అతనే. శ్రీకృష్ణ జననం, కాళీయ మర్దన్‌లో బాల శ్రీకృష్ణునిగా మందాకిని నటించారు. ఆమె ఫాల్కే పెద్ద కూతురు. ఆమెనే తొలి భారతీయ బాలనటి. భారతీయ సినిమా రజతోత్సవ వేడుకల్లో దాదాసాహెబ్ ఫాల్కే ఒక అనామకుడిగా కూర్చోవడం చూసిన శాంతారాం ఆయన్ని గుర్తించి వేదికపైకి తీసుకు పోయి 1938లో అప్పటికప్పుడు వేదికపై ఐదువేల రూపాయల పర్స్ అంద జేశారు. ఆ డబ్బుతో ఫాల్కే తిరిగి సినిమా తీస్తాడేమోనని చాలా మంది భయపడ్డారు. ఎందుకంటే సినిమా అంటే ఆ మహనీయునికి అంత పిచ్చి. అందరూ ఒత్తిడి తెచ్చి ఆ డబ్బుతో నాసిక్‌లో ఒక ఇంటిని కొనిపించారు. అప్పటి వరకు ఫాల్కేకు సొంత ఇల్లు కూడా లేదు. ఆ ఇంటిలోనే తుది శ్వాస విడిచారు.. 90 సినిమాలను నిర్మించిన భారతీయ సినిమా పితామహుడు దరిద్రంతోనే కన్నుమూసినా, ఈ నాటికీ ఆయన జీవన మూల్యాలు ఆదర్శంగా, స్ఫూర్తి నిచ్చేవిగానే ఉన్నాయి. అయన పేరు మీద జాతీయ అవార్డుల సంరంభం ప్రతి యేటా జరుగుతున్నా, ఆయన జీవిత చరమాంకం ఎంతటి దైన్యావస్థలో గడిచిందో ఎవరూ తలచక పోవటం శోచనీయం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పైపుల లీకేజీలు.. వట్టిపోతున్న బోర్లు

రామగిరి : మండలం కల్వచెర్ల ఎస్సీ కాలనీలో రూ.5 లక్షలతో బోరుబావి తవ్వించి, మోటారు, ఇతర సామగ్రి కొనుగోలు చేసి బిగించారు. విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో వినియోగానికి దూరంగా ఉంది. ముత్తారం మండలం పారుపల్లి ప్రాథమిక పాఠశాల సమీపంలోని చేతిపంపు ఇది. ఇటీవల చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులతో దీని చుట్టూ ఇసుక చేరింది. అయిదు నెలలుగా మరమ్మతు చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. జిల్లాలో తాగునీటి ఎద్దడి ఘంటికలు మోగుతున్నాయి. పల్లెల్లో పైపులైన్ల లీకేజీ పరిపాటిగా మారగా పథకాల మోటార్లు కాలిపోతున్నాయి. చిన్నపాటి మరమ్మతుల కు నోచుకోక చేతిపంపులు మూలన పడుతున్నాయి. గత ఫిబ్రవరిలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పాడయిన చేతిపంపులను గుర్తించారు. మరమ్మతుపై ప్రభుత్వానికి నివేదించినా పైసా రాలేదు. పంచాయతీల్లో నిధుల కొరతతో ప్రతి చిన్న పనికీ దిక్కులు చూడాల్సి వస్తోంది. కార్యదర్శులు అప్పులు చేసి మరమ్మతు చేసుకోవాల్సి వస్తోంది.

**అటకెక్కిన ప్రతిపాదనలు**

మొత్తం 267 పంచాయతీల పరిధిలో 1,23,298 గృహాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. రెండు నెలల కిందట పది రోజుల పాటు పాడయిన తాగునీటి పథకాలను గుర్తించారు. 523 చేతిపంపులు పాడయినట్లు, 1,256 చోట్ల పైపులైన్ లీకేజీలున్నట్లు తేల్చి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. 33 బావుల్లో పూడిక తీయాల్సి ఉందని తేల్చారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోగా గతేడాది వేసవిలో



పనులు చేసిన రూ.1.83 కోట్ల బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి.

**మరమ్మతు భారం**

జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుకుపోవడంతో బోర్లు వట్టిపోతున్నాయి. చేతిపంపులు, పైపులైన్ల లీకేజీలు, గేట్‌వాల్వులు, బావుల్లో పూడికతీత, సింగిల్‌ఫేజ్ మోటార్లకు మరమ్మతు భారంగా మారింది. సంవత్సర కాలంగా ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడంతో కార్యదర్శులు అప్పుల పాలవుతున్నారు. మంథని, ముత్తారం, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లో చాలా చోట్ల నిర్వహణ భారంతో మూలనపడుతున్నాయి.గతంలో మానేరు, హుస్సేన్‌మియా వాగుల్లో తవ్విన బోరుబావులు పని చేయడం లేదు.

జిల్లాలో ..పంచాయతీలు:267రక్షిత నీటి పథకాలు: 667

బావులు: 307సింగిల్‌ఫేజ్ మోటార్లు: 609

చేతి పంపులు: 3,925 ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం: వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అవసరాలను గుర్తిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాలతో చేతిపంపులు, బోర్లు, ఇతర పథకాలకు మరమ్మతు చేయిస్తున్నాం. అవసరమైన చోట ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం.

ప్రభుత్వానికి నివేదించాం: శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ మిషన్ భగీరథ పథకం కింద గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలతో ఫిబ్రవరిలో పాడయిన తాగునీటి వనరులను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాం. లీకేజీలు, మరమ్మతు పనులను పంచాయతీ అధికారులు చేస్తున్నారు.

# సర్కారు వైద్యానికి మెరుగులు

గోదావరిఖని : ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలో రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దటంతో పాటు వైద్యసేవలను మరింత మెరుగు పరిచేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ప్రపంచబ్యాంకు నుంచి రూ.4,150 కోట్ల రుణం తీసుకుని ఆసుపత్రులకు అందంగా తీర్చిదిద్దుతున్నారు. లోపాలు సవరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ వైద్యసేవలపై ప్రజల్లో అపనమ్మకాన్ని తొలగించేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

**ప్రజలను ఆకట్టుకునేలా..**

భవనాలకు అందమైన రంగులు వేయనున్నారు. రాత్రి వేళల్లో దూర ప్రాంతాల నుంచి సైతం కనిపించేలా ఆసుపత్రుల బోర్డులను విద్యుత్తు దీపాలతో అలంకరించనున్నారు. ప్రస్తుతం అందిస్తున్న సేవలను మరింత మెరుగుపరచటంతో పాటు కొత్తగా మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ప్రజల ఇక్కట్లను తీర్చేలా ఇప్పటికే అసాంక్రమిక వ్యాధుల నివారణ(ఎన్.సి.డి.) విభాగాలను ఏర్పాటు చేశారు. ఇంటింటికీ తిరుగుతూ అసాంక్రమిక వ్యాధులపై ప్రజల్లో అవగాహన కలిగించటంతో పాటు వ్యాధిగ్రస్తులను గుర్తించి సేవలందిస్తున్నారు. ఇటీవల కాలంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో క్యాన్సర్ కేర్ పేరిట ఆసుపత్రుల్లో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు సమీపంలో ట్రామాకేర్ ఆసుపత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం పాలియేటివ్‌కేర్ సేవలను మరింత బలోపేతం చేయనుంది.

**గతంలోనే ప్రతిపాదనలు**సుమారు ఆయిదేళ్ల క్రితం గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్గత అలంకరణకు రూ.30 లక్షలతో ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సంబంధిత కన్సల్టెన్సీ ప్రతినిధులు సైతం ఆసుపత్రిని సందర్శించి అంచనాలు సిద్ధం చేశారు. సుమారు రూ.కోటికి చేరుకోవడంతో వెనుకంజ వేశారు. రామగుండం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఆసుపత్రి పై అంతస్తులో అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారు. ఆయా వార్డులకు సంబంధించిన చిత్రాలతో వార్డుల్లోని రోగులకు అవగాహన కల్పిస్తూ ఆకట్టుకునేలా పెయింటింగ్ వేశారు. నూతన బ్లాకులో ఎన్.సి.డి. విభాగాన్ని ఏర్పాటు చేశారు. 50 పడకల సామర్థ్యంతో చేపట్టిన క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. రూ.142 కోట్ల అంచనాలతో ఆరు అంతస్తుల్లో విశాలమైన భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రాంతీయ ఆసుపత్రిగాను నిత్యము రోజుకు 300 వరకు ఓపీలు రాగా.. బోధనాసుపత్రిగా అభివృద్ధి చేయడంతో ఇప్పుడు 1000కి చేరింది. ఇదే తరహాలో ఇన్‌పేషెంట్ల సంఖ్య సైతం పెరుగుతోంది.

# ప్రతి బొట్టు.. ఒడిసి పట్టు



పరిగి : భూగర్భ జలాలను పెంపొందించడంతోపాటు, వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంటింటా ఇంకుడు గుంతలు తవ్వించాలని ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. నీటి వృథాను అరికట్టడం ఇందులో భాగమే. ఈ క్రమంలోనే మున్సిపాలిటీల్లోనూ, ఇతర సామాజిక స్థలాల్లోనూ వీటిని తవ్వించాలని సూచించింది. ఐదేళ్ల కిందట పలు ప్రభుత్వ కార్యాలయాల్లో వీటిని ఏర్పాటు చేసింది. తద్వారా ప్రజలకు స్ఫూర్తిగా ఉంటుందని పేర్కొంది. అయితే నాటి నుంచి నేటి వరకు పనుల జాడే లేకుండా పోయింది. వర్షపు నీరంతా మురుగు కాల్వల్లో వృథాగా పోతోంది. ఇప్పటికైనా ఉన్నవాటిని బాగు చేస్తే కురిసే నీటి బొట్టును వృథా కాకుండా అరికట్టవచ్చు.

**స్థలమున్నా..:** ప్రభుత్వ కార్యాలయాల్లో విశాలమైన స్థలం ఉంది. ఆయా ప్రాంతాల్లో వీటిని తవ్విస్తే ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవకాశం కలుగుతుంది. మూడేళ్ల కిందట సర్కారు మున్సిపాలిటీల వారీగా లక్ష్యాలను విధించింది. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ.6 నుంచి రూ.8వేల దాకా ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రధానంగా ప్రభుత్వ స్థలాలు, బస్టాండ్, వ్యవసాయ విపణి, పాఠశాలలు, పార్కులు, నీటి ట్యాంకులు, విద్యాలయాలు ఇతర ప్రభుత్వ స్థలాల్లో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. నాలుగు పురపాలికలకు లక్ష్యం విధించినా, కనీసం పదిశాతం కూడా కార్యరూపం దాల్చలేదు. పరిగిలోని ఎంపీడీవో, పుర, పోలీసు స్టేషన్, రెవెన్యూ కార్యాలయాల ఆవరణలో నిర్మించిన ఇంకుడు గుంతలు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. తాండూరు, వికారాబాద్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**ఎద్దడితో సతమతం**ఎండలతో భూగర్భజలాలు మరింత లోతుకు పడిపోయాయి. గతంలో తవ్విన వాటిని సత్వరం బాగు చేసి వినియోగంలోకి తీసుకువస్తే జల వృద్ధికి మార్గం సుగమం అవుతుంది. ఆయా పురపాలికల్లో ఎద్దడి ఛాయలు కనిపిస్తున్నాయి. ట్యాంకర్లతోనూ పంపిణీ చేస్తున్నారు. వెయ్యి అడుగుల లోతు బోర్లు తవ్వినా చుక్కనీరు రావడం లేదు. దీంతో యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

**కొరవడిన భాగస్వామ్యం**

నీటికి నిలకడ నేర్పడంలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం కూడా ప్రధానం. వానాకాలంలో అన్నిచోట్లా వర్షపు నీరు ప్రధాన రహదారులు, ఇళ్లలోకి చేరి కునుకు లేకుండా చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో విరివిగా ఇంకుడు గుంతలను తవ్విస్తే ఎద్దడి సమస్యను అధిగమించడంతో పాటు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా ఉంటుంది. ఒకటిన్నర మీటర్ల లోతు, రెండున్నర మీటర్ల వెడల్పు, లేదా రెండు మీటర్ల లోతు మూడు మీటర్ల వెడల్పు ఉండేలా ఇంకుడు గుంతలకు ఆకృతిని రూపొందించారు. ఇందుకోసం వార్డుల వారీగా కమిటీలు కూడా పూర్తి చేయాలని సూచించినా అడుగు ముందుకు పడలేదు. ఇందులో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన అధికారులు స్థలాల ఎంపికను చేపట్టాల్సి ఉన్నా దృష్టి సారించడం లేదు.

**అవగాహన కల్పిస్తున్నాం**

ఇంకుడు గుంతల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నాం. పాత గృహాల్లోనూ, కొత్త ఇళ్ల నిర్మాణాల్లోనూ తవ్వించాలని సూచిస్తున్నాం. ఇప్పుడిప్పుడే ప్రజల్లో మార్పు కనిపిస్తోంది. కొందరు సుముఖత వ్యక్తం చేస్తున్నారు.– వెంకటయ్య, కమిషనర్, పరిగి.

# చారిత్రక కట్టడాలు.. నిధుల్లేక నీలినీడలు




హైదరాబాద్ : నగర చరిత్రను ప్రతిబింబించే వారసత్వ కట్టడాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆర్భాటంగా మొదలైన వారసత్వ కట్టడాల పునరుద్ధరణ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. నిధుల్లేవంటూ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పనులను అటకెక్కించాయి. సాంస్కృతిక కేంద్రంగా రూపుదిద్దుకోవాల్సిన సర్దార్ మహల్ అభివృద్ధి పనులు సగంలో నిలిచిపోగా.. ముర్గీచౌక్ పునర్ నిర్మాణం పునాదిలోనే చిక్కుకుపోయింది. మీరాలంమండీ, ఇతరత్రా కట్టడాల పనులదీ అదే దుస్థితి. ఏడాదిన్నరగా రూపాయి కూడా ఖర్చవలేదని ఇంజినీర్లు చెబుతున్నారు.

**నిర్లక్ష్యపు ఊబిలో..**

గత సర్కారు హయాంలో 2022 ఏప్రిల్ 9న చార్మినార్ సర్దార్ మహల్‌ను రూ.30కోట్లతో పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.36కోట్లతో ముర్గీచౌక్, రూ.10.5కోట్లతో మీరాలంమండీ, రూ.40కోట్లతో పత్తర్‌గట్టీ, రూ.12కోట్లతో ఖుర్షీద్ జా దేవ్డీ, పురానాపూల్ వద్దనున్న నిజాం కాలం నాటి రెండు పోలీస్ అవుట్ పోస్టుల పునరుద్ధరణ పనులు మొదలయ్యాయి. ఖుర్షీద్ జా దేవ్డీ, పోలీస్ అవుట్‌పోస్టులు, మీరాలం చెరువు అభివృద్ధి పనులను హెచ్ఎండీఏ, మిగిలిన నిర్మాణాలకు జీహెచ్ఎంసీ నిధులను సమకూర్చాలని, పనులు కులీకుతుబ్ షాహీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో జరగాలని సర్కారు నిర్ణయించింది. అనుకున్నట్లుగా.. సర్కారు రోజుల వ్యవధిలో ముర్గీచౌక్ భవనాన్ని కూల్చేసింది. కొన్ని నెలలకు పునాది కోసం తవ్వకాలు మొదలయ్యాయి. పనులు మొదలైనట్లే కనిపించగా.. కొన్ని రోజులకే నిలిచిపోయాయి. సర్దార్ మహల్‌ను సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు సైతం అర్ధంతరంగా ఆగాయి. ఇతర వారసత్వ కట్టడాల వద్ద కూడా పనులు పడకేశాయి. ఒక్క ఖుర్షీద్ జా దేవ్డీ పనులు పురోగతిలో ఉన్నాయి.

**సర్వే ఏమైంది?**

అలీ మంజిల్, హైకోర్టు, స్టేట్ ఆర్కియాలజికల్ మ్యూజియం, సిటీ కాలేజ్, సికింద్రాబాద్ క్లాక్ టవర్, రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్, ఫతేమైదాన్, మహబూబ్‌చౌక్ క్లాక్‌టవర్, స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, ఆంధ్రపత్రిక భవన్, అస్మాన్‌ఘర్ ప్యాలెస్, అమీన్ మంజిల్, అలియాబాద్ సరాయి, అఫ్జల్‌గంజ్ మసీదు ఇలా 142 వారసత్వ కట్టడాల జాబితాను గత సర్కారు జీహెచ్ఎంసీకి ఇచ్చి, వాటి యజమానులు, ప్రస్తుతం ఆయా కట్టడాలు ఎవరి ఆధీనంలో ఉన్నాయి, ఆక్రమణలు జరిగాయా, ఇతరత్రా వివరాలను సర్వే ద్వారా గుర్తించాలని ఆదేశించింది. ప్రణాళిక విభాగాన్ని సర్వే చేయాల్సిందిగా అప్పటి కమిషనర్ లోకేష్‌కుమార్ ఆదేశించగా.. అధికారులు మాత్రం తమకేమీ తెలియదంటున్నారు.

# ప్రవేశాలు లేక.. ప్రగతి కానరాక!



తాండూరు : యువతీయువకులు ఉచితంగా వృత్తి శిక్షణ పొందేందుకు ప్రభుత్వం ఐటీఐని మంజూరు చేసింది. అనువైన భవనాలు, సదుపాయాలు కల్పించారు. ఇందుకోసం రూ.కోట్లు ఖర్చు చేశారు. ఏళ్లు గడిచినా ప్రవేశాలు ప్రారంభించలేదు. తరగతులు మొదలుపెట్టలేదు. మరోవైపు వందల సంఖ్యలో యువత వృత్తి శిక్షణకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. జిల్లాలో వ్యాపార కేంద్రమైన తాండూరు మండలానికి కేంద్ర ప్రభుత్వం ఐటీఐని మంజూరు చేసింది. సొంత భవనం నిర్మించేందుకు రూ.4కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం జినగుర్తి శివారులో ఐదు ఎకరాల స్థలాన్ని అప్పగించింది. అయినా భవన నిర్మాణ పనులు చేపట్టలేదు. దీంతో తాత్కాలికంగా తరగతులు నిర్వహించేందుకు అదే ప్రాంతంలో రూ.2కోట్లు రూర్బన్ నిధులతో నిర్మించిన నూతన భవనాలను అప్పగించారు. అప్పటి కలెక్టర్ పౌసుమిబసు రూ.82 లక్షలు విడుదల చేశారు. వీటితో విద్యుత్తు, నీటి సౌకర్యం, చుట్టూ ప్రహరీ నిర్మించాలని రక్షణ చర్యలు పూర్తి చేయించారు. ప్రభుత్వం ఇతర వసతులను కల్పించింది. ప్రిన్సిపల్, సహాయ ప్రిన్సిపల్, ఇద్దరు జూనియర్ సహాయకులు, కాపలాదారు, అటెండర్లను నియమించి నెలకు రూ.5లక్షల దాకా జీతాలు చెల్లిస్తున్నారు. వీటిని సమకూర్చి రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు విద్యార్థులకు వృత్తి శిక్షణ పాఠాలు అందడం లేదు. **త్వరలో పది ఫలితాలు..**

వచ్చే వారంలో ప్రభుత్వం పది ఫలితాలను ప్రకటించేందుకు సమాయత్తమవుతోంది. పది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఐటీఐలో చేరేందుకు ఆస్కారముంది. వీరి ఆసక్తికి అనుగుణంగా ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రవేశాలు కల్పిస్తామని మాటిచ్చినా వాయిదా వేస్తున్నారు. కనీసం ఈసారైనా చేరిక ప్రక్రియ ప్రారంభించి వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇది అందుబాటులోకి వస్తే వందల సంఖ్యలో విద్యార్థులు ప్రైవేట్ ఐటీఐకి వెళ్లే బాధ తప్పడంతోపాటు రూ.60వేల రుసుం భారం నుంచి ఊరట కలగనుంది.

**ఐటీఐకి అనుబంధంగా..** తాండూరు మండల ఐటీఐకి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రం(ఏటీసీ)ని మంజూరు చేసింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర పరికరాలతో దీన్ని అందుబాటులోకి తెచ్చేందుకు హైదరాబాద్ రహదారి మార్గంలో రూ.25కోట్లకుపైగా వెచ్చించి శరవేగంగా భవన పనులు కొనసాగుతున్నాయి. అయితే జినగుర్తి వద్ద ఐటీఐని అందుబాటులోకి తెస్తేనే అనుబంధంగా ఏటీసీ కేంద్రాన్ని నిర్వహించేందుకు దోహదపడనుంది. అందుకు టాటా సంస్థ భాగస్వామ్యంతో విద్యార్థులకు వృత్తి విద్య అందించేందుకు తోడ్పడనుంది.

# పని దినాల్లో కోత.. కూలీల్లో ఆందోళన

సిరిసిల్ల : పట్టణాలకు వలసలు తగ్గిస్తూ స్థానికంగా పని కల్పనే లక్ష్యంగా ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. వ్యవసాయ పనులు లేని వేసవిలో వేల సంఖ్యలో నిరుపేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోంది. గతేడాది నిర్దేశిత లక్ష్యం మించి నాలుగురెట్లు అధికంగా పని దినాలు కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం పనిదినాలు అధికంగా కేటాయించాలని కోరగా.. పలు ఆరోపణల నేపథ్యంలో భారీగా కోత విధించడంతో ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాకు కేటాయించిన పని నాలుకు గండి పడింది. **ఇదీ పరిస్థితి**

జిల్లాలోని పన్నెండు మండలాల పరిధిలోని 98133 జాబ్‌కార్డుల్లో 1,99,721 మంది కూలీలు నమోదయ్యారు. గతేడాది 21.79 లక్షల పనిదినాలు కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. 48 వేల కుటుంబాల పరిధిలోని 67 వేల మంది కూలీలు 22.59 లక్షల పనిదినాలు పూర్తి చేయడంతో లక్ష్యాన్ని మించి 4 శాతం అదనంగా పని కల్పించారు. దీనికోసం రూ.5149.54 లక్షలు కూలీలకు, 3334.46 లక్షలు సామగ్రికి ఖర్చు చేశారు.

ఈ ఏడాది సైతం 22 లక్షల పనిదినాలు కల్పించాలని అధికారులు ప్రతిపాదనలు పంపించగా కేంద్రం కోత విధించడంతో అందులో




54 శాతం మాత్రమే పని దినాలు ఖరారు చేశారు. దీంతో ఉపాధి కూలీల్లో ఆందోళన నెలకొంది. మెట్టప్రాంతమైన జిల్లాలో యాసంగి సీజన్‌లో వ్యవసాయ పనులు అంతగా ఉండవు. వేసవి ప్రారంభానికి ముందే ఉపాధి హామీ పనులకు డిమాండ్ ఉంటుంది. ఉపాధి హామీలో భాగంగా జిల్లాలో భూగర్భ జలాల పెంపునకు పెద్దపీట పనులు చేపట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించడంతో కేంద్రం ప్రత్యేక బృందాలను పంపి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయించింది. పలుచోట్ల నిబంధనలు పాటించకుండా పనులు జరిగినట్లు గుర్తించి, ఈ ఏడాది మాత్రం పనిదినాలను 12.43 లక్షలకే పరిమితం చేయడంతోపాటు నిర్దేశించిన పనులే చేయాలని ఆంక్షలు విధించింది. దీంతో జిల్లాలోని కూలీలు చాలా వరకు నష్టపోనున్నారు. జిల్లాలో ఇప్పటికే 2,07,092 పని దినాలు పూర్తయ్యాయి. దీనికితోడు శిఖం భూముల్లో చేపల కొలనులు తవ్వించాలని ప్రభుత్వం భావిస్తోంది. రహదారులు, పంచాయతీ భవనాలు ఇతర అభివృద్ధి పనులకు ఉపాధి హామీ నిధులు వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం భూమిలేని నిరుపేద కూలీలకు ఆత్మీయ భరోసాకు ఉపాధి పనిదినాలే ప్రామాణికంగా తీసుకుంటుంది. పని దినాల్లో కోత విధించిన నేపథ్యంలో జిల్లాలో చేపట్టే ప్రకృతి వనాలు, వన మహోత్సవం, మహిళా శక్తి ఉపాధి భరోసా, పొలం బాటలు, గ్రామీణ పారిశుద్ధ్యం తదితర పనులపై ప్రతికూల ప్రభావం చూపనుంది.

# 'సన్న'గిల్లుతున్న ఆశలు..!

సన్నధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రహసనంగా మారింది. తేమ..తాలు..తూకం పేరిట నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 4.80 లక్షల ఎకరాల్లో సన్నాలు సాగు చేశారు. ఒక్కో రైతు వడ్లు తెచ్చి 20 రోజులైనా కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. వాతావరణం చల్లబడటం, ఈదురుగాలులు, చిరుజల్లుల మూలంగా ధాన్యంలో తేమశాతం తరచూ మారుతుందని రైతులు భయాందోళన చెందుతున్నారు.

గుర్రంపోడు మండలం చామలేడులో కొనుగోలు కేంద్రంలో రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. రైతు చింతలింగయ్య 739 బస్తాలు కాంటాకు ఇవ్వగా 729 ఉన్నాయని అక్కడి నిర్వాహకులు లెక్కలు రాశారు. అనుమానం వచ్చిన రైతు లారీ వెంట వెళ్లి రైస్‌మిల్లు వద్ద మరోసారి లెక్కించగా అన్ని బస్తాలున్నాయి. మళ్లీ లెక్క రాయించుకుని కేంద్రం నిర్వాహకులను నిలదీయగా.. నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నట్లు వాపోయారు.

కనగల్‌లో 24 ఐకేపీ కేంద్రాల ఆధ్వర్యంలో దొడ్డు, ఒకటి సన్నధాన్యం, మూడు పీఏసీఎస్ ఆధ్వర్యంలో దొడ్డురకం కేంద్రాలను ఏర్పాటు చేశారు. సన్నధాన్యం కొనుగోళ్లు ముందుకు సాగడం లేదు. కనగల్ మండలకేంద్రంలో సన్నధాన్యం కేంద్రాన్ని ఈ నెల 3న ప్రారంభించినా.. నేటికీ ఒక రైతువి మాత్రమే కాంటా వేశారు. వాటినీ మిల్లుకు తరలిస్తే తాలు పేరిట క్వింటాకు మూడు కిలోల చొప్పున తరుగుకు ఒప్పుకొంటేనే దించుకుంటామంటూ కొర్రీలు పెట్టడంతో వారం రోజులుగా లారీ దిగుమతి కాకుండా ఉంది. కొనుగోలు కేంద్రం వద్ద దాదాపు 70, 80 మంది రైతుల ధాన్యం కాంటా వేయాల్సి ఉంది. 20 రోజులు



దాటినా కాంటా వేయటం లేదని అన్నదాతలు వాపోయారు.

నల్గొండ ఆర్జాలబావి ఆర్ఎంపీల సంక్షేమ భవనం వద్ద సన్నధాన్యం కేంద్రంలో తొరగల్, కొత్తపల్లి, ఖాజీ రామారం, అప్పాజీపేట తదితర గ్రామాల నుంచి రైతులు 20 రోజుల క్రితం సుమారు 1000 క్వింటాళ్ల సన్నవడ్లు తెచ్చి పోశారు. తేమశాతం 17 కంటే తక్కువగా ఉండాలని సాకులు చెప్తూ ఇప్పటివరకు కిలో ధాన్యం కూడా కొనలేదని రైతులు చెబుతున్నారు.నకిరేకల్‌లోని కేంద్రాల్లో నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వసతులు కల్పించడం లేదు. కేంద్రాలకు టార్పాలిన్లు వచ్చినా రైతులకు పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. కట్టంగూరు మండలంలోని ఈదులూరు కేంద్రంలో బస్తాకు మూడు కిలోలు అదనంగా తూకం వేస్తున్నారని, ఎలక్ట్రానిక్ కాంటాలోనే మార్పులు చేసి ఎక్కువగా తీసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

20 రోజుల నుంచి పడిగాపులే..

ఎర్ర మధుసూదన్‌రెడ్డి, రైతు, తొరగల్

సన్నధాన్యం 17శాతం కంటే తేమ ఎక్కువ ఉందని 20 రోజుల నుంచి ఆరబోయడం, తాలు తీయడమే సరిపోతుంది. ఇన్ని చేసినా క్వింటాలుకు మూడు కిలోల కోత విధిస్తున్నారు. గతంలోనూ ఇక్కడ ఇదే పరిస్థితి.

చురకలు



# ఇక వైద్యులు డుమ్మా కొట్టలేరు

కరీంనగర్ : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులంటే వైద్యులు సమయానికి రారు పట్టించుకోరు అనే భావన చాలామందికి ఉంటుంది. ఉన్నతాధికారులు డాక్టర్ల హాజరుకు ఎలాంటి ప్రయత్నాలు చేపట్టినా అంతకుమించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విధులకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు జాతీయ వైద్యమండలికి వచ్చాయి. వైద్యులపై ఎలాంటి ఆరోపణలు లేకుండా తప్పనిసరిగా 100 శాతం హాజరును మెరుగుపరిచేందుకు జాతీయ వైద్యమండలి కొత్త నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రతి బోధన ఆసుపత్రితోపాటు చికిత్స అందించే అనుబంధ ఆసుపత్రుల్లో ముఖ గుర్తింపు చిత్రంతో హాజరును (ఫేస్ రికగ్నిషన్ బయోమెట్రిక్) ఉపయోగించాలని ఆదేశించింది. మే 1వ తేదీ నుంచి తప్పనిసరిగా అమలుకు శ్రీకారం



చుట్టింది. ఆ దిశగా ఇక్కడి అధికారులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

**గతంలో హాజరు పుస్తకం..** ఆసుపత్రులలో గతంలో హాజరు పుస్తకం ఉండేది. వైద్యులు ఒకేసారి వచ్చి సంతకాలు చేస్తున్నారు. విధులకు సరిగా హాజరుకావడంలేదనే ఆరోపణల మేరకు బయోమెట్రిక్ ఏర్పాటు చేశారు. సిలికాన్ గ్రాఫ్తో హాజరు వేస్తున్నారనే సమాచారంతో ముఖచిత్రంతో హాజరు ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. దేశవ్యాప్తంగా మొత్తం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలో ఈ విధానం అమలుకానుంది. విధులకు వచ్చిన వారు కూడా సమయం ముగిసే వరకు సేవలందించేలా కొన్ని వార్డులలో మినహా మిగతా వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే రోగులకు మెరుగైన సేవలందనున్నాయి. ఎన్ఎంసీ ఆదేశాల మేరకు వచ్చే నెల 1వ తేదీ నుంచి ముఖ గుర్తింపు చిత్రం హాజరును అమలు చేస్తామని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు.


# ఆయుష్.. బాధితుల ఉషస్సు

హుజూరాబాద్ : ఆయుర్వేద ఆసుపత్రి అంటే మొదట్లో అంతపెద్దగా పట్టించుకునే వారుకాదు. ఒకరిద్దరు ఆసుపత్రులకు వచ్చి వెళ్తుండేవారు కానీ.. ఇప్పుడు రోజుకు ముప్పై మందికిపైగా సేవల కోసం వస్తున్నారు. ఆయుర్వేద మందులను వాడుతూ ఆరోగ్యాలను రక్షించుకుంటున్నారు.

**81 ఆసుపత్రులు** ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 81 ఆసుపత్రులున్నాయి. ఆయుర్వేద, హోమియో, యునాని, నేచురోపతి పేర్లతో పలు ప్రాంతాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేశారు. ఒక్కో ఆసుపత్రిలో రెండు గదులు, హాల్ ఉన్నాయి. వైద్యుడు, ఫార్మసిస్ట్, ఎస్ఎన్వోను నియమించారు. 32 సొంత భవనాలు ఉండగా, మిగిలిన 41 వివిధ ఆసుపత్రుల్లో కొనసాగుతున్నాయి. కావాల్సిన మందులు 'ఈ ఔషధ్' అనే సైట్లో నమోదు చేయగానే వారం రోజుల్లో ఆసుపత్రికి చేరుకుంటున్నాయి.

**అందుతున్న సేవలు**

ఆయుష్ ఆసుపత్రుల సేవలపై వైద్యులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులతో



కలిసి ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరాలను నిర్వహించి విద్యార్థులకు ఉచితంగా మందులను అందిస్తున్నారు. ఒక్కో ఆసుపత్రికి రోజూ సుమారు సగటున 35 మంది వస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

జ్వరం, నడుం, మోకాళ్లు, కీళ్లనొప్పి, డయాబెటిక్, ఎసిడిటీ, శ్వాసకోశ, మూత్ర సంబంధిత, పైల్స్, కండరాల బలహీనత, చర్మ, సైనసైటీస్, సీజనల్ వ్యాధులు, స్త్రీ సంబంధిత సమస్యల బాధితులు వస్తున్నట్లు రికార్డులు నమోదవుతున్నాయి.

పరీక్షిస్తున్న వైద్యులు వారికి కావాల్సిన మందులను అందిస్తున్నారు. ధ్యానం, యోగాసనాలపై అవగాహన కల్పిస్తున్నారు. రోజూ యోగా, ధ్యానం చేయాలని సూచిస్తున్నారు. గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది కృషి చేస్తున్నారని ఆర్డీడీ డాక్టర్ బి.ప్రమీలాదేవి పేర్కొన్నారు. సుమారు 80 రకాలకుపైగా మందులు సరఫరా అవుతున్నాయని పేర్కొన్నారు.

**నడుం నొప్పి తగ్గింది: ఎం.రాంమోహన్, చెల్పూరు**

పదేళ్ల క్రితం నుంచి నడుంనొప్పితో బాధపడుతూ కనీసం నడవలేకపోయాను. చెల్పూరు ఆయుష్ ఆసుపత్రిలో వైద్యుడిని సంప్రదించి ఆయుర్వేద మందులు వాడాను. ఇప్పుడు అవలీలగా నడుస్తున్నా.

# అనుమతి పేరిట అక్రమం

బొంరాస్‌పేట: నూతనంగా ఏర్పాటైన దుద్యాల మండలంలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఇసుక తరలించాలని అధికారులు నిర్ణయించారు. బొంరాస్‌పేట మండలంలోని కాకరవాణి చెక్‌డ్యాం నుంచి 20 ట్రాక్టర్ల చొప్పున ఇసుకను తరలించాలని ఈ నెల 17, 21, 25వ తేదీల్లో తహసీల్దార్ అనుమతి ఇచ్చారు. అయితే అధికారులు పర్యవేక్షించకపోవడంతో, అనుమతి ఇచ్చిన దానికంటే అధికంగా తరలిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు తరలింపు కొనసాగుతున్నా అడిగేవారు లేకుండా పోయారు. మైదాన ప్రాంతాలకు తరలించిన వెంటనే టిప్పర్లలో ఇతర చోట్లకు తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా ఇదేతంతు నడుస్తున్నా అధికారుల్లో కదలిక లేకుండాపోయింది. ఇసుక అక్రమ రవాణా వల్ల బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని, పంటల సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాగు పరీవాహక ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **విచారించి చర్యలు తీసుకుంటాం**

దుద్యాల మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఇసుక తరలించేందుకు అనుమతి ఇచ్చాం. పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించాం.

# రక్షణశాఖ ఆస్తుల లెక్క.. తేలాలి పక్కా!



సికింద్రాబాద్ : నగరంలో సికింద్రాబాద్ ప్యారడైజ్ సర్కిల్ నుంచి నిర్మిస్తున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి రహదారులకు ఇరువైపులా ఉన్న రక్షణశాఖ ఆస్తుల లెక్కలు కొలిక్కి రాలేదు. రక్షణశాఖ విషయంలో అధికారులు ఆచితూచి ముందుకు వెళుతున్నారు. ఈ రెండు కారిడార్లలో కంటోన్మెంట్ ఏరియాలో పలు నిర్మాణాలను తొలగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా తాగునీటి రిజర్వాయర్లు, ప్రహరీలు, రక్షణశాఖకు సంబంధించి కార్యాలయాలను తొలగించి..వారు సూచించిన స్థానంలో నిర్మించాలి. ఇప్పటికే ఈ పనుల కోసం హెచ్ఎండీఏ ప్రతిపాదనలు సిద్ధం చేసి కంటోన్మెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. కొన్ని ప్రాంతాల్లో కంటోన్మెంట్ రికార్డుల్లో ఉన్న ఆస్తులకు.. హెచ్ఎండీఏ లెక్కించిన వాటికి పొంతన కుదరకపోవడంతో తిరిగి మరోసారి లెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు కారిడార్లలో అటు ఇటు 200 మీటర్ల పరిధిలో మొత్తం 1730 నిర్మాణాలు గుర్తించారు. ఇందులో రక్షణ శాఖకు సంబంధించి నిర్మాణాలు ఉన్నాయి. ప్రైవేటు ఆస్తులకు సంబంధించి అంతస్తులను బట్టి పరిహారాన్ని ఆయా యజమానులకు చెల్లించనున్నారు. కొన్నింటికి ఆయా కలెక్టర్లు నోటిఫికేషన్ జారీ చేశారు. దాదాపు రూ.120-150 కోట్లు పరిహారానికి అవసరం అవుతుందని భావిస్తున్నారు.

**టెండర్లు తెరవడం వాయిదా..**

ప్యారడైజ్ నుంచి ఎన్‌హెచ్-44లోని డెయిరీఫాం వరకు నిర్మించదలచిన కారిడార్‌కు సంబంధించి ఈ నెల 15న టెండర్లు తెరవాల్సి ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, కమిషనర్ విదేశీ పర్యటనలో ఉండటంతో ఈ ప్రక్రియ వాయిదా పడింది. 4 కంపెనీలు ఈ రహదారి నిర్మాణానికి టెండర్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఈ వారంలోనే ఈ రహదారికి సంబంధించి టెండర్లు తెరిచే అవకాశం ఉంది. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ కారిడార్‌కు సంబంధించి ఆస్తుల గుర్తింపు, రక్షణ భూముల బదలాయింపు తర్వాత టెండర్లు చేపట్టే అవకాశం ఉంది. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ కోసం రూ.3619 కోట్లు వెచ్చించనున్నారు. ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం (ఎన్‌హెచ్44) వరకు రూ.1487 కోట్లు వ్యయం చేయనున్నారు. నిధుల కోసం ఇప్పటికే పలు మార్గాలను హెచ్ఎండీఏ అన్వేషిస్తోంది. పనులు ప్రారంభించేందుకు 2-3 నెలల సమయం పట్టనుంది. ఈలోపు నిధుల సర్దుబాటు కొలిక్కి వస్తుందని ఓ అధికారి తెలిపారు. **రెండు చోట్లా భారీగా..**

ప్యారడైజ్ జంక్షన్ నుంచి వెస్ట్ మారేడుపల్లి, కారా?నా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట్, తూముకుంట మీదుగా శామీర్‌పేట ఓఆర్ఆర్ జంక్షన్ వరకు 18.124 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ దారిలో మొత్తం 1278 వరకు వ్యక్తిగత, రక్షణశాఖ ఆస్తులు ఉన్నట్లు తేలింది.

ప్యారడైజ్ నుంచి ఎన్‌హెచ్-44లోని డెయిరీఫాం వరకు 5.320 కిలోమీటర్ల మేరకు మరో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. ఈ మార్గంలో 452 ఆస్తులు గుర్తించారు. రక్షణశాఖ ప్రైవేటు భూములు ఉన్నాయి. రక్షణశాఖకు సంబంధించి భూముల బదలాయింపు ఇంకా కొలిక్కి రాలేదు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అరుదైన గుర్తింపు





హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. సివిల్స్ సర్వీస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం 'మిషన్ కర్మయోగి' పేరుతో శిక్షణ ఇస్తున్న తరహాలో దక్షిణాది రాష్ట్రాల్లోని పురపాలకశాఖ, గ్రూప్-1, 2, 3, 4 అధికారులకు పట్టణాభివృద్ధి, పర్యావరణం అంశాలపై ఉస్మానియా వర్సిటీలోని పట్టణ ప్రాంతీయ అధ్యయన కేంద్రం శిక్షణ ఇవ్వనుంది. కేంద్ర ప్రభుత్వ అధికారులు కొద్దిరోజుల క్రితం వర్సిటీలోని పట్టణ, ప్రాంతీయ అధ్యయన కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ఇకపై కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌గా వ్యవహరించనుందని తెలిపారు. పట్టణాలు, సబర్బన్ ప్రాంతాల్లో అభివృద్ధి, కాలుష్య నియంత్రణ, మాస్టర్ ప్లాన్ అంశాలపై ప్రభుత్వ అధికారులకు పట్టణ, పర్యావరణ ప్రాంతీయ అధ్యయన కేంద్రం శిక్షణ ఇవ్వనుంది. అనంతరం అధికారులకు శిక్షణ పొందినట్టు ధ్రువపత్రాలను అందజేయనుంది. మే, జూన్ నెలల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ అధికారులు శిక్షణ పొందేందుకు వచ్చే అవకాశాలున్నాయి.

**భవిష్యత్తు అంచనాలు అందుకునేలా...** పట్టణాల్లో ప్రజల అవసరాలకు సరిపడా మౌలిక వసతులు లేకపోవడం, శివారులో మురుగు వ్యవస్థ అభివృద్ధి చెందకముందే కాలనీలు పుట్టుకురావడంతో కాలుష్యం తారాస్థాయికి చేరుతోంది. తెలంగాణలో 70 శాతం మున్సిపాలిటీల్లో మురుగు వ్యవస్థే లేదు. పట్టణాలు, మున్సిపాలిటీల్లో పెరుగుతున్న జనాభాను ఊహించి భవిష్యత్తు అంచనాలు అందుకునేలా కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులకు అవగాహన కల్పించనున్నారు. ప్రయోగాత్మకంగా శిక్షణ ఇవ్వనున్నారు.

**టూ స్టార్ రేటింగ్‌తో బాధ్యత పెరిగింది..**


ప్రొ. కుమార్ మొలుగరం, వీసీ, ఓయూ

ఓయూలోని పట్టణ, పర్యావరణ అధ్యయన కేంద్రం కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ (సీబీసీ)గా మారినందుకు సంతోషంగా ఉంది. ఈ కేంద్రానికి టూ స్టార్ రేటింగ్ రావడం బాధ్యతను పెంచింది. ఈ కేంద్రానికి సంచాలకుడిగా విధులు నిర్వహించినప్పుడు సీబీసీ కోసం కృషి చేశాం. రెండుసార్లు దిల్లీకి వెళ్లి అధికారులను కలిశాం. ప్రస్తుత సంచాలకుడు ప్రొఫెసర్ శ్రీనగేష్ సమర్పించిన నివేదికలు, భవిష్యత్తు ప్రణాళికలను కేంద్ర ప్రభుత్వ అధికారులు అభినందించారు.

# పరిశ్రమల నురుగు.. వానొస్తే పరుగు

హైదరాబాద్: అకాల వర్షాలను కొందరు పరిశ్రమల నిర్వాహకులు అనుకూలంగా మార్చుకుంటున్నారు. అప్పటి వరకు డ్రమ్ములు, ట్యాంకుల్లో భద్రపరిచిన రసాయన వ్యర్థ జలాలను నాలాలు, డ్రైనేజీల్లోకి వదిలి చేతులు దులుపుకొంటున్నారు. వరదతో వచ్చే కాలుష్య నురుగు కాలనీలను కమ్మేస్తోంది. జీడిమెట్ల పారిశ్రామికవాడ నుంచి వదులుతున్న వ్యర్థాలు ఆల్విన్‌కాలనీలోకి, మీర్‌పేట్, జిల్లెలగూడ నుంచి వస్తున్న వ్యర్థాలు సరూర్‌నగర్ చెరువులోకి, బల్క్‌డ్రగ్ కంపెనీల్లోంచి వచ్చే హానికర వ్యర్థాలు మూసీలోకి వదులుతున్నారు. పారిశ్రామిక, గృహ వ్యర్థాలు సరూర్‌నగర్ చెరువులోకి చేరుతున్నాయి. మీర్‌పేట్, జిల్లెలగూడ ప్రాంతాల్లోని పరిశ్రమల్లో ఉత్పన్నమవుతున్న వ్యర్థాలతో సమస్య తీవ్రమవుతోంది.

ఆల్విన్‌కాలనీ ప్రాంతంలోని పరికి చెరువులోకి జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం నుంచి రసాయన వ్యర్థాలు వెళ్తున్నాయి. అక్కడి నుంచి నాలాల ద్వారా హుస్సేన్‌సాగర్ వరకు వరద పారుతోంది. ట్యాంక్‌బండ్‌కు వెళ్లే మార్గంలో నాలా పక్కనే ఉన్న ధరణినగర్ కాలనీ మీదుగా వరద నిలిచి మురుగు పారి నురుగలు కక్కుతోంది. ఘాటువాసనలతో పాటు చర్మ సంబంధ వ్యాధులు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పారిశ్రామికవాడ వ్యర్థాలను శుద్ధి చేయడానికి జేఈటీపీఎల్ (జీడిమెట్ల ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్), పీఈటీఎల్ (పటాన్‌చెరు ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్), మన ఈటీపీ - మల్లాపూర్‌లో ఏర్పాటు చేశారు. రాజధాని పరిధిలో మూడు వేలకు పైగా రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమలు ఉండగా సుమారు రెండు వేల పరిశ్రమల నుంచి వ్యర్థాలు తరలిస్తుండటం గమనార్హం. మిగిలిన పరిశ్రమల





వ్యర్థాలు శుద్ధిపై లెక్కాపత్రం లేదు.


**16 పరిశ్రమలపై చర్యలు..**

నాచారం-మల్లాపూర్ ప్రాంతంలో ఇంజినీరింగ్, ప్లాస్టిక్, కెమికల్ పరిశ్రమలున్నాయి. 750 పరిశ్రమలు 'మన ఈటీపీ'లో నమోదవ్వగా.. 300 పరిశ్రమల నుంచి మాత్రమే వ్యర్థజలాల ట్యాంకర్లు తరలిస్తున్నారు. వ్యర్థాల శుద్ధి అంతంతమాత్రంగానే సాగుతుండడంతో హెచ్ఎంటీ, నల్లచెరువుల్లో కాలుష్యం పెరుగుతోంది. రాజేంద్రనగర్ సమీపంలోని మూసీలో వ్యర్థాలు పారబోస్తున్న ఓ ట్యాంకర్‌ను ఇటీవలే స్థానికులు పట్టుకోగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బొల్లారం పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమ వ్యర్థాలను నకిలీ రసీదులతో ట్యాంకర్‌ను తరలించినట్టు పీసీబీ అధికారులు గుర్తించారు. గతేడాదికాలంగా 16 పరిశ్రమలపై చర్యలు తీసుకున్నారు. వ్యర్థాల పారబోతకు అడ్డుకట్ట వేయాలంటే రాత్రిపూట గస్తీ పెంచాలి.

# నీటిని ఎత్తిపోసేదెప్పుడో?

మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్రంలో శాశ్వత నీటి ఎద్దడి నివారణ కోసం దాదాపు రెండేళ్ల కిందట ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోయాయి. మల్యాల మండలం ముత్యంపేట శివారులోని వరద కాలువ నుంచి కొండగట్టుపైకి నీటి సరఫరాకు అప్పటి ప్రభుత్వం రూ.13.43 కోట్లతో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. నాలుగు నెలల్లోనే పనులు పూర్తి చేయించి పథకం ద్వారా కొండపైకి నీటిని సరఫరా చేస్తామని అధికారులు నాయకులకు హామీ ఇచ్చినప్పటికీ ఇంత వరకు 10 శాతం పనులు కూడా పూర్తికాలేదు. వరద కాలువ పక్కన ఇంటేక్ వెల్ అసంపూర్తిగా నిలిచిపోయింది. కొన్ని నెలలుగా ఎలాంటి పనులు జరగడంలేదు.

ఇంటేక్ వెల్ నుంచి 1.7 కి.మీ దూరంలోని ఆలయానికి చెందిన సంతొల్ల లొద్ది చెక్‌డ్యాం వరకు పైపులైన్ నిర్మించాల్సి ఉంది. చెక్‌డ్యాం నుంచి కొండపైకి నీటిని పంపింగ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం సంతొల్లలొద్ది చెక్‌డ్యాంలో 13.85 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటి నిలువ సామర్థ్యం మాత్రమే ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అందుకు తగ్గట్లు నీటి పథకం నిర్మాణం చేపట్టాల్సి ఉ



ండగా పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. ఇంటేక్‌వెల్ నిర్మాణం పూర్తి చేసి పంప్‌హౌజ్, పైపులైన్, సంతొల్ల లొద్ది చెక్ డ్యాంలో నీటిని నిలువ చేసేందుకు పనులు చేపట్టాల్సి ఉంది. వరద కాలువ నుంచి సంతొల్లలొద్ది చెక్‌డ్యాంలోకి నీటిని నింపిన తర్వాత అక్కడి నుంచి ఆలయ అధికారులే కొండపైకి నీటిని క్లోరినేషన్, పంపింగ్ చేసుకోవాల్సి ఉంటుందని ఐబీశాఖ అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వానికి పెంచిన అంచనా నివేదిక: తిరుపతి, ఏడీఈ ఇరిగేషన్ శాఖ వరద కాలువ నుంచి కొండగట్టుపైకి నీటి సరఫరాకు ప్రారంభించిన పథకం పూర్తికి అంచనా వ్యయాన్ని రూ.13.43 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెంచుతూ ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నాం. ఇందుకోసం పూర్తిస్థాయిలో ప్రణాళిక, పత్రాలను రూపొందించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కొత్త అంచనా వ్యయం ప్రకారం పనులు చేపట్టి పూర్తి చేస్తాం.

# అనుమతి ఒక్కటి.. తరలించేది ఆరు


రాయికల్: వేసవి కావడంతో గ్రామాల్లోని వాగులు, గోదావరిలో నీటి శాతం తగ్గడంతో ఇసుక అక్రమార్కులకు వరంగా మారింది. నిత్యం వాగుల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. రాయికల్ మండలంలోని ఇటిక్యాల, మూటపల్లి, కొత్తపేట గ్రామాల శివారులోని పెద్దవాగు తీరాలు, బోర్నపల్లి, జగన్నాథపూర్ గోదావరి తీరం నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాక్టర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామాలకు ఇసుక రవాణా చేయడం పలువురికి ఉపాధిగా మారింది. ఒక్కో ట్రాక్టరు ఇసుక రూ.2 వేల నుంచి 3 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం రాత్రి పగలు తేడా



లేకుండా ఇసుక రవాణా చేయడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సామాన్యులు నిర్మాణాల కోసం తహసీల్దార్ అనుమతి పత్రాలతో ఇసుక రవాణా చేసుకునే అవకాశం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుంది. ఒక్క ట్రాక్టరుకు నగదు చెల్లించి అనుమతి తీసుకుని కొందరు అదే పత్రాన్ని చూపి నిత్యం ఆరు నుంచి ఏడు ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అనధికారికంగా నిర్వహించే ఇసుక వేలం దక్కించుకున్న గుత్తేదారులకు రూ.500 చెల్లించి రాత్రి, పగలు తేడా లేకుండా రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాతో గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయే అవకాశం ఉంది. అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలని, అనుమతి ఉన ఇసుక రీచ్‌ల వద్ద అధికారులు నిఘా ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అత్యవసర పంపింగ్‌కు వేళాయె!

హైదరాబాద్: మహానగరానికి తాగునీటిని అందించే కృష్ణాజలాల అత్యవసర ఎత్తిపోతలకు జలమండలి ఏర్పాట్లు పూర్తి చేసింది. మే మొదటివారం నుంచి పంపింగ్ ద్వారా నాగార్జునసాగర్ డెడ్‌స్టోరేజీ నుంచి నీటిని తీసుకునేందుకు సిద్ధమైంది. నాగార్జునసాగర్‌లో నీటి మట్టం 510 అడుగులకు తగ్గితే విధిగా పంపింగ్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం శుక్రవారం నాటికి 514.5 అడుగులు కాగా 139.43



టీఎంసీల నీరు నిల్వ ఉంది. మరో నాలుగు అడుగుల నీటిమట్టం తగ్గితే డెడ్ స్టోరేజీ నుంచి నీటిని పంపింగ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు అధికారులు మార్చిలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి అదనపు పంపులు ఏర్పాటు చేశారు. సాగర్ నుంచి నగరానికి రోజుకు 270 ఎంజీడీల జలాలు సరఫరా అవుతాయి. ఈ మేరకు డెడ్ స్టోరేజీ నుంచి రోజుకు 900 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేయాల్సి ఉంటుంది. పంపుల ఏర్పాటుకు జలమండలి సుమారు రూ.5 కోట్లు వ్యయం చేసింది. సాగర్‌లోకి ఇన్‌ఫ్లో 510 అడుగులకంటే ఎక్కువ నీటి మట్టం వచ్చేవరకు పంపింగ్ చేయనున్నారు.

చురకలు



# భారత జలాంతర్గాముల అసమాన సేవలు

## - ఏప్రిల్ 30...సింధు ఘోష్ నౌకా దళంలో చేరిన రోజు



భారతీయ నౌకా దళం భారత సాయుధ బలగాలలో ఒక శాఖ. దేశ రాష్ట్రపతి దీనికి అధిపతిగా వ్యవహరిస్తారు. 5000 మంది నౌకా వైమానిక దళ సభ్యులు, 2000 మంది నౌకా దళ కమెండోలతో సహా యుద్ధ సన్నద్ధంగా ఉండే 55,000 మంది సభ్యులు గలిగి ప్రపంచంలో 5వ పెద్ద నౌకాదళంగా వుంది. భారత నౌకా దళం 155 నౌకల్ని కలిగి ఉంది. ఆసియాలో జెట్ యుద్ధ విమానాల్ని కలిగి ఉన్న విమాన వాహక నౌకని, నడిపే ఏకైక నావికా దళం. ఐ.ఎన్.ఎస్. సింధుఘోష్...30 ఏప్రిల్ 1986న నౌకా దళంలో చేరిన రోజు... భారత నౌకా దళంలోని సింధు ఘోష్ 30 ఏప్రిల్ 1986న రిగా, లాట్వియాలో కమాండర్ కె . సి. వర్గీన్ ఆధ్వర్యంలో ప్రారంభించబడింది. డీజిల్‌తో నడిచే ఈ జలాంతర్గామి మొత్తం ఆరు మోటార్లను కలిగి ఉంటుంది. సింధుఘోష్ భారత నావికా దళంలో క్లబ్ ZM-54E SS-N-27 యాంటీషిప్ క్రూయిజ్ క్షిపణులతో 220 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉన్న మొదటి జలాంతర్గామి. జలాంతర్గామి మునిగి పోయినప్పుడు దాదాపు 3,100 టన్నుల స్థానభ్రంశం కలిగి ఉంటుంది. గరిష్టంగా 300 మీటర్లు, గరిష్టంగా 17 నాట్లు (31 కిమీ/గం) వేగంతో డైవింగ్ చేయగలదు. సిబ్బందితో 45 రోజుల పాటు ఒంటరిగా పనిచేయగలదు. భారత రక్షణ వ్యవస్థలో భాగమయిన భారత నావికా దళం (ఇండియన్ నేవీ) కేవలం దేశరక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుంది. ఇండియన్ నేవీలో 16 సబ్‌మెరైన్‌లు (జలాంతర్గాములు) ఉన్నాయి. ఇందులో ఎక్కువ రష్యా, జర్మనీలనుండి కొనుగోలు చేసినవి. ఇందులో ప్రధాన మయినవి సింధుఘోష్ తరగతికి చెందినవి. ఈ తరగతిలో మొత్తం 10 సబ్‌మెరైన్‌లు ఉన్నాయి. వీటి బరువు 3,000 టన్నులు. ప్రతి సబ్‌మెరైన్‌లో 220 కిమీ దూరంలోపు ఉన్న నౌకల పైన ప్రయోగించ గలిగే మిస్సైళ్ళు ఉన్నాయి. ఈ సబ్‌మెరైన్‌లు సముద్రంలో 300 మీటర్ల లోతువరకు వెళ్లగలగి, 18 నాట్ల వేగంతో 45 రోజుల పాటు సముద్ర ఉపరితలాన్ని చేరుకోకుండా ప్రయాణించ గలవు. 1985 నుండి అణు సబ్‌మెరైన్‌లను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవీ కృషి చేస్తున్నది. 2010 నాటికి 6,000 టన్నులు బరువు కలిగి, పూర్తి అణు సామర్థ్యం కలిగిన సబ్‌మెరైన్‌ను, 2010-2025 నాటికి ఇలాంటివి మరో నాలుగు నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరిగింది. భారత నౌకాదళం లోని అన్ని యుద్ధ నౌకలకు ముందు 'ఇండియన్ నేవల్ షిప్' (ఐ.ఎన్.ఎస్), జలాంతర్గాములకు ముందు 'ఇండియన్ నేవల్ సబ్ మెరైన్ (ఐ.ఎన్.ఎస్.)' అని చేరుస్తారు. నీటిలో మునిగి ప్రయాణం చెయ్యగల వాహనం. వివిధ దేశాల నావికా రక్షణ దళాల్లో జలాంతర్గామి ఒక ముఖ్య భాగం. జలాంతర్గామిని మొదటగా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో విస్తృతంగా ఉపయోగించారు. జలాంతర్గాములు అనేక రకాలైన మిషన్లను చేపట్ట గలవు. యాంటీ-సర్ఫేస్ వార్‌ఫేర్, యాంటీ- సబ్‌మెరైన్ వార్‌ఫేర్, ఇంటెలిజెన్స్ సేకరణ, మైన్ లేయింగ్, తీర ప్రాంతాల్లో నిఘా తదితర మిషన్లు చేపట్టవచ్చు. భారత నౌకాదళంలో చేరిన కొన్ని జలాంతర్గాములు - వాటి తేదీల వివరాలు ఇలా ఉన్నాయి... ఐ.ఎన్.ఎస్.సింధుధ్వజ్... 12 జనవరి,1987, ఐ.ఎన్.ఎస్. షల్కి ...07 ఫిబ్రవరి 1992, ఐ.ఎన్.ఎస్. సింధుఘోష్ ...30 ఏప్రిల్ 1986, ఐ.ఎన్.ఎస్. షంకుల్ ....28 మే 1994, ఐ.ఎన్.ఎస్. సింధువీర్...11 జూన్ 1988, ఐ.ఎన్.ఎస్. సింధుశస్త్ర...19 జూలై 2000, ఐ.ఎన్.ఎస్. వగ్లి ....10 ఆగష్టు 1974, ఐ.ఎన్.ఎస్ వేల ....31 ఆగష్టు 1973, ఐ.ఎన్.ఎన్. శాతవాహన... 21 డిసెంబర్1974, ఐ.ఎన్.ఎస్. షిషుమార్...22 సెప్టెంబరు1986, ఐ.ఎన్.ఎస్. సింధురాజ్ ...20 అక్టోబరు 1987, ఐ.ఎన్.ఎస్. సింధురత్న...19 నవంబరు 1988, ఐ.ఎన్.ఎస్. షంకుష్ ...20 నవంబరు1986, ఐ.ఎన్.ఎస్. సింధుకీర్తి ...09 డిసెంబరు1989, ఐ.ఎన్.ఎస్. సింధు విజయ్...17డిసెంబర్1990, ఐ.ఎన్.ఎస్.సింధు కేసరి... 19డిసెంబర్1988, ఐ.ఎన్.ఎస్.సింధు రక్షక్ ...24 డిసెంబర్1997, ఐ.ఎన్.ఎస్ విరాట్...27 సంవత్సరాలా సేవ తరువాత 2016 లో ఈ నౌకను నౌకాదళం నుండి విరమింప జేసారు. 2013 లో ఐ.ఎన్.ఎస్ విక్రమాదిత్య కమిషను కాకముందు, విరాట్‌యే భారత నౌకాదళపు ఫ్లాగ్‌షిప్ నౌక. పని విరమించే ముందు వరకూ ఇది ప్రపంచంలోనే అత్యంత పాత విమాన వాహక నౌక. 1959 లో బ్రిటిషు నౌకాదళంలో హెచ్ ఎం ఎస్ హెర్మెస్‌గా చేరిన ఈ నౌకను 1987లో భారత్ కొని, 1987 మే 12 న ఐ ఎన్ ఎస్ విరాట్‌గా పేరు పెట్టింది. ఐ.ఎన్.ఎస్వి విక్రమాదిత్య...విక్రమాదిత్య భారత్ రష్యా నుండి కొనుగోలు చేసిన విమాన వాహక నౌక. కీయెవ్ తరగతికి చెందిన అడ్మిరల్ గోర్ష్‌కోవ్ విమాన వాహక నౌకను విక్రమాదిత్యగా పునర్నిర్మించారు. ఇది 2013 లో భారతీయ నౌకాదళం లోకి ప్రవేశించింది.ఐ.ఎన్.ఎస్. విక్రాంత్ (2013)...భారత్‌లో నిర్మించిన మొదటి విమాన వాహక నౌక. 2013 లో దీన్ని నిర్మించారు. ఇది తేలిక పాటి విమాన వాహక నౌక. ఐ.ఎన్.ఎస్ చక్ర...అణు జలాంతర్గామి...ఐఎన్ఎస్ అరిహంత్ ...న్యూక్లియర్ సబ్‌మెరైన్. న్యూక్లియర్ మిస్సైల్స్‌ను ప్రయోగించే సబ్‌మెరైన్ల కోసం ఇక్కడ సముద్ర గర్భంలో అధునాతన బెర్తులు రూపుదిద్దు కుంటున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా స్వదేశీ పరిజ్ఞానంతో తొలి న్యూక్లియర్ సబ్‌మెరైన్ అరిహంత్ నిర్మాణం జరిగింది. సముద్రంపైన, భూమిపైన యుద్ధం చేయగల ఐఎన్ఎస్ జలాశ్వతో పాటు అణు ఇంధనంతో పనిచేసే సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ చక్ర ఇక్కడి నుంచే సేవలు అందిస్తోంది. చైనా వద్ద 56 సబ్‌మెరైన్లు ఉండగా మన దగ్గర 14 మాత్రమే వున్నాయి. చైనా ఇప్పటికే ఐదు న్యూక్లియర్ సబ్‌మెరైన్లను సమకూర్చు కోగా మనం తొలి న్యూక్లియర్ జలాంతర్గామి (అరిహంత్) నిర్మాణంలో ఉన్నాయి. ఫ్రెంచ్ నావికాదళ రక్షణ, ఇంధన సంస్థ డీసీఎన్ఎస్ రూపొందించిన జలంతార్గములను భారత నేవీ ఫోర్స్ ప్రాజెక్ట్ 75లో భాగంగా ముంబైలోని మజగాన్ డాక్ లిమిటెడ్ (ఎండీఎల్) నిర్మిస్తోంది. ఆరు స్కార్పీన్ క్లాస్ జలాంతర్గాము ల్లోని మొదటిదైన ఐఎన్ఎస్ కల్వరిని 2017 డిసెంబర్‌లో భారత నావికాదళం లోకి ప్రవేశ పెట్టారు. ఇది డీజిల్ ఎలక్ట్రిక్ అటాక్ జలాంతర్గామి. 2017లో ప్రవేశపెట్టిన ఐఎన్ఎస్ ఖండేరి రెండవది కాగా.. మూడోది ఐఎన్ఎస్ కరంజ్ 2018 నేవీ దళంలో చేరింది. ఇక, నాల్గోది ఐఎన్ఎస్ వెలా 2019 నుంచి సేవలందిస్తుంది. శత్రు దేశాల క్షిపణులు, జలాంతర్గాముల కళ్లుగప్పే స్టెల్త్ సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రాజెక్ట్ 75లో భాగంగా రూపొందించిన ఐదో స్కార్పీన్ తరగతి జలాంతర్గామి ఇటీవలే మజగావ్ డాక్ వద్ద అరేబియా సముద్ర జలాల్లో జల ప్రవేశం చేసింది. ప్రస్తుతం సబ్‌మెరైన్ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు చర్యలు జరుగు తున్నాయి. ఇందులో భాగంగా రాబోవు 30 సంవత్సరాలలో 24 సబ్‌మెరైన్‌లు నేవీ అమ్ముల పొదిలో చేరబోతున్నాయి. ప్రస్తుత మార్పులను బట్టి హిందూ మహాసముద్ర ప్రాంతంలోని అన్ని దేశలలో భారత నావికా దళం అత్యంత బలమయినదిగా తయారవుతున్నదని చెప్పవచ్చు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అక్షయ ఫలాన్ని ఇచ్చేది తృతీయ



హిందువుల పండుగలలో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నది అక్షయ తృతీయ. వైశాఖ శుద్ధ తృతీయ నాడు చేసే దానాలు దేవతల, పితృదేవతల గురించి చేసే పూజలు, అక్షయ ఫలాన్ని ఇస్తాయని, ప్రాచీన గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. తీర్థ స్నానం, తిలలతో పితృ తర్పణం, ఘట దానం, దైవ పూజలు, ఈ దినాన దానం చేయడం అనాదిగా ఆచరణలో ఉంది. నదీస్నానం దానం, తపం, శ్రాద్ధం, హోమం చేయాలని వ్రత గ్రంథాలలో ఉంది. అక్షయ తృతీయనాడు పెరుగు అన్నం, విసనకర్రలు, గొడుగులు, పాదుకలు, చెప్పులు, ఉద కుంభం, మున్నగు వాటిని దానం చేయాలని చెప్పబడింది. ఎండలు మెండుగా ఉండే వైశాఖ మాసంలో కుండలలో, జాగ్రత్తగా పెట్టిన నీటిని త్రాగితే, దాహ శాంతి కరంగా ఉండగలదని, మతపెద్దల నిర్ణయానుసారం, నీటితో నిండిన పాత్రలను, కుండలను ( ఉదకుంభ) దానం చేయడం ఆచారంగా మారింది. ఈ రోజున, విష్ణుపూజ లక్ష్మీ నారాయణ రూపంలో చేయాలని, పురుషార్థ చింతామణి యందు పేర్కొనబడింది. గౌరీ పూజ గౌరీ వ్రతం పేరున పూజ చేయడం కొన్ని ప్రాంతాలలో, ఆలయాలలో ఆచారంగా ఉంది. ఆహవనీయ, గార్హపత్య, దక్షిణములు అనబడే త్రేతాగ్నులు పూజింపబడిన కాల మగు 196 వేల మానవ సంవత్సరాల క్రితం త్రేతా యుగానికి, ఇది తొలి రోజుగా, యుగాదిగా భావించబడుతున్నది. వైశాఖ శుక్లపక్ష తదియ బలరామ జయంతిగా పంచాంగాలు పేర్కొంటున్నాయి. తాటిచెట్టును కేతనం మీద నిలుపుకొని, తమకు సాధనమైన, నాగలిని ఆయుధంగా కలిగి, తమను హర్ష కులుగా చేసిన, బలరాముని జయంతి దినమైన, అక్షయ తదియ తెలుగునాట కర్షకుల కార్యకలాపాలకు, ముఖ్య కేంద్రంగా మారింది. అందుకే ఈ ప్రాంతం కర్షకులు, తమ పొలాలలో గృహస్తులు తమ పెరళ్ళలో, ఏ రోజున కూర పాదులు కట్టడం కూడా సనాతన ఆచారంగా మారింది. మహాలక్ష్మికి ప్రీతిపాత్రమైన, అక్షయ తృతీయ నాడు బంగారం కొనుగోలు చేసి, దాచి ఉంచితే, సంపద ఇతోధికంగా వృద్ధి కాగలదనే విశ్వాసంతో, అక్షయ తృతీయ రోజున, బంగారం కొనడం సాంప్రదాయంగా ఆచరించ బడుతున్నది. "వైశాఖే మాసి రాజేంద్ర, శుక్ల పక్ష తృతీయ కా: అక్షయాసా తిథి: ప్రోక్తా కృత్తికా రోహిణీ యుతా: అక్షయ తృతీయ సోమ లేదా బుధవారాల్లో అయితే విశిష్టమని, కృత్తిక రోహిణీ నక్షత్రముతో కూడి ఉన్నది అయితే, పర్వం అతి ప్రశస్తం అని భావన. ఈ పర్వం పూర్వాహ్న వ్యాపిని అనీ, వ్రత రాజము చెపు తున్నది. ఇది ఒక గొప్ప పుణ్య దినంగా భావించ బడుతున్నది. ఈనాడు నదీస్నానం, సకల పాప విమోచన కరమని, ఒక పూట భోజనం చేయాలని భక్తుల విశ్వాసం. లక్ష్మి సహిత నారాయణుని, గౌరీ సహిత త్రిలోచనుని, పూజించడం శ్రేష్ఠం తరంగా చెప్పబడింది. పూజ సమయంలో విసనకర్రలు, లడ్డూలు పంచితే వైకుంఠాన్ని, శివ లోకాన్ని పొందగలరని శాస్త్ర వచనం.

**:: అక్షయ తృతీయ విశిష్టతలు ::** మన పురాణాలు, పండితులు చెబుతున్న అక్షయ తృతీయ విశిష్టతలు ఎన్నో ఉన్నాయి. ఈ రోజే మహా విష్ణువు ఆరవ అవతారమైన పరశురాముని జననం. ఈ పవిత్ర దినానే త్రేతాయుగం ప్రారంభమైనదని పండితుల మాట. గంగమ్మ భువిపై ఉద్భవించిన రోజు ఈ రోజే. అక్షయ తృతీయ నాడే వ్యాస మహర్షి "మహా భారతం" పవిత్ర గ్రంధాన్ని రచన పారంభించిన రోజు. ఈ రోజే అమ్మ "అన్నపూర్ణ దేవి" అవతరించిన రోజు. అక్షయ తృతీయ పవిత్ర దినాన్నే కుబేరుడు శివానుగ్రహాన్ని పొంది మహాలక్ష్మి ద్వారా అనంత సంపదను పొంది సంరక్షకుడిగా నియమింప బడ్డాడు. శ్రీకృష్ణుడు ద్రౌపదిని దుశ్చాసన దుశ్చర్య నుండి కాపాడిన దినం. శ్రీకృష్ణుడు తన బాల్యమిత్రుడైన కుచేలుడు తెచ్చిన అటుకులను ఆరగించి అపార సంపదను అనుగ్రహించిన రోజు. సూర్య భగవానుడు అజ్ఞాత వాసంలో పాండవులకు "అక్షయపాత్ర"ను ఇచ్చినరోజు. ఆదిశంకరుల వారు ఓ పేద వృద్ధ జంట లబ్ది కోసం సృష్టిలో తొలిసారి "కనకధారాస్థవం" స్తుతించిన రోజు. ఈ పవిత్ర దినానే, దివ్య క్షేత్రం "బద్రీనాథ్" ఆలయ ద్వారాలు 4 నెలల దర్శన విరామం తర్వాత, పునః దర్శనార్థమై తెరుచుకో బడతాయి. ఏ ఏటికా ఏడు ఒడిషా పూరి రథయాత్ర సంబరాల కొరకు నిర్మించే రథ నిర్మాణం ప్రారంభించే రోజు. ఈరోజే సింహాచలం దివ్యక్షేత్రంలో సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం మరియు చందనోత్సవం ప్రారంభపు రోజు. బృందావనం లోని బంకే బిహారి ఆలయంలో, శ్రీకృష్ణుని పాదాలను దర్శించుకొనే అవకాశం ఒక్క అక్షయ తృతీయ రోజునే దక్కుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సామాజిక సంస్కర్త పరశు రాముడు - అక్షయ తృతీయ పరశు రాముని జయంతి



భృగు వంశోద్భవుడు, జమదగ్ని మహర్షి కుమారుడు, సహస్ర బాహు డైన కార్త వీర్యార్జునుని సంహరించిన, మహా వీరుడు పరశు రాముడు. తండ్రి ఆజ్ఞానువర్తియై, కన్నతల్లిని హతమార్చి, తిరిగి తండ్రి ఆశీస్సులతో, పునరుజ్జీవితు రాలిగా చేసిన ధర్మవీరుడు. భూ భారాన్ని తగ్గింప, భార్గవ రాముని రూపంలో ఉదయించాడు శ్రీహరి. అనులోమ సంజాతుడు అయి, బ్రాహ్మణుడగు జమదగ్నికి, క్షత్రియురాలగు రేణుకకు జన్మించి బ్రాహ్మణ, క్షత్రియ వివాదాలను గొడ్డలితో తీర్చి, ఆటవికులకు యజ్ఞోపవీత ధారణ గావించి, బ్రాహ్మణులుగా మార్చిన అసామాన్య సామాజిక సంస్కర్త పరశు రాముడు. అంతేకాదు బ్రాహ్మణ పక్షపాతియై, క్షత్రియులను అనేకులను సహకరించిన పరశు రాముడు, "మీరెన్ని దానములు పట్టినను, ఎంతగా కష్టపడినను, విద్య వచ్చును గాని, ధనము రాదని, వచ్చినను అది నిలువ ఉండదని", బ్రాహ్మణ కులానికి శాపమిచ్చినట్లుగా కథనం ఉంది. ఆజన్మాంతం క్షత్రియ కులాన్ని నిర్మూలించిన పరశు రాముడు, క్షత్రియుడు అయిన శ్రీరాముని చేతిలో ఓడిపోవడం, శివ ధనుస్సు విరిచి, వివాహితుడై వస్తున్న దశరథ రాముని, ఎదిరించి, భంగ పడడం, విష్ణువు యొక్క ఒక అంశ అవతారం చేత, మరొక అవతారం ఓడింప బడిన సందర్భం ప్రత్యేకం. పరశు రామా! దశరథ రాముడి సందర్భంగా అయ్యాక, నీవు శస్త్రం పట్టవద్దు. ఎందుకంటే నీ వైష్ణవ తేజస్సు అతనిలో ప్రవేశిస్తుంది. అది సురకార్యం నిర్వహిస్తుంది. అని శంకరుడు పరశు రామునికి లోగడ చెప్పడమే దీనికి కారణం అని పురాణ కథనం. విష్ణువు దశావతారాలలో ఆరవది పరశు రామావతారం. పురుషార్థ చంద్రిక, నిర్ణయ సింధు, గ్రంథాలు అక్షయ తృతీయ "పరశు రామ జయంతి" పేర్కొంటున్నాయి. శ్రీకృష్ణుని, శ్రీరాముని జయంతులు, జరుపుకుంటున్న విధంగా, పరశు రామ జయంతిని కూడా జరపాలని శాస్త్ర వచనం. పరశు రాముడు చిన్నతనంలో తన తండ్రి పితామహుడైన భృగు మహర్షి ఆశ్రమానికి వెళ్లగా, ఆ బాలకుని తేజస్సుకు తాళలేక, భృగు మహర్షి కళ్ళు మూసుకొని, ఆ బాలకుని హిమాలయాలకు వెళ్లి తపమాచరించమని సూచించాడు. బాలకుని తపస్సుకు, శివుడు ప్రత్యక్షమై, "నీవు ఇంకా చిన్నవాడివి, రౌద్రాస్త్రాలు, భరించే శక్తి నీకు లేదని కొంతకాలం తీర్థయాత్రలు చేయాలని", హితవు పలికాడు. తీర్థయాత్రలను పూర్తిచేసుకుని, తిరిగి తపస్సు ప్రారంభించగా, ఆ సమయంలో రాక్షస బాధలు తాళలేక, ఇంద్రాది దేవతలు శివుని శరణు వేడగా, భార్గవ రామునికి, పరమ శివుడు, "పరశువు" అనే గండ్రగొడ్డలి ఇచ్చి రాక్షసుల పైకి పంపడం చేత పరశు రామ నామాంకితుడైనాడు. అలా స్వర్గంలో రాక్షసులను లేకుండా చేశాడు. ఓ సందర్భంలో పరశు రాముడు, శివుని దర్శించబోగా ద్వారం వద్ద వినాయకుడు అడ్డగించాడు. కోపంతో పరశు రాముడు తన పరశువును విసిరేశాడు. తన తండ్రి శివుని ప్రసాదమైన పరశువుపై గౌరవంతో వినాయకుడు ఆ పరశువుతో తన దంతం విరిగేలా సమర్పించు కొన్నాడు. ఒకనాడు తల్లి రేణుక, నీళ్ళు తేవడానికి ఏటికి వెళ్లి అక్కడ చిత్రరథుడనే, గంధర్వ రాజు కుమారుడు, తన భార్యతో జలవిహారం చేయడాన్ని చూసి, తనకు అలాంటి అదృష్టం లేదని చింతిస్తూ, ఆశ్రమానికి ఆలస్యంగా వెళ్ళింది. ఆమె ఆలస్యానికి కారణం తెలుసుకున్న జమదగ్ని, కళంకితయైన, తల్లిని ఖండించాలి అని కుమారులను కోరాడు. ముగ్గురు మొదటివారు ఒప్పుకోని స్థితిలో, నాలుగవ వాడైన పరశురాముడు తండ్రి ఆజ్ఞను శిరసా వహించి, ఆమెను ఖండించాడు. అప్పుడు తండ్రి, పరశురాముని ఏదైనా వరం కోరుకొమ్మనగా, తనకు మాతృ భిక్ష పెట్టమని ప్రార్థించాడు. అలా రేణుక పునరుజ్జీవితురాలు అయింది. తండ్రి ఆశ్రమంలో లేని సమయాన కార్తవీర్యార్జునుడు అనే రాజు కామధేనువు "సురభి" ని బలవంతంగా తీసుకు పోగా, పరశురాముడు, ఆ రాజును హతమార్చి, తిరిగి తెచ్చాడు. అందుకు పగబట్టిన కార్తవీర్యార్జునుని కుమారులు, జమదగ్నిని హత మార్చగా, తిరిగివచ్చిన పరశు రాముడు, విషయం తెలుసుకుని, వారి మీదికి దండెత్తి, గర్భస్థ పిండాలను కూడా వదలక చంపాడు. వారి నెత్తుటితో పితృ తర్పణం గావించాడు. పరశు రాముడు యావత్ క్షత్రియ జాతిపై ఆగ్రహించి వారిపై 21 మార్లు దండెత్తి క్షత్రియ వంశాలను నాశనం చేశాడు. శ్యమంతక పంచకమనే 5 సరస్సులను క్షత్రియుల రక్తంతో నింపి పరశు రాముడు తల్లి దండ్రులకు శ్రాద్ధ తర్పణం అర్పించాడు. ఇలా అందరినీ హతమార్చడం చేత భూమి అంతా పరశురాముని వశం అయింది. యజ్ఞం చేసి భూమి అంతయు బ్రాహ్మణులకు దానం చేశాడు. అశ్వమేధయాగం చేసి ఆ భూమిని కశ్యపుడికి దానంగా ఇచ్చాడు. అప్పటి నుండి భూమికి 'కశ్యపి' అనే పేరు వచ్చింది. దానం ఇచ్చిన నేలపై ఉండ కూడదని, బ్రాహ్మణులు అనగా... పరశు రాముడు సముద్రం వద్దకు వెళ్లి, తన స్థావరము, సముద్రం లోనికి విసిరి వేయగా, రెండు యోజనాల దూరంలో పడగా, సముద్రుడు ఆ ప్రదేశం నుండి ఉపసంహరించు కున్నాడు. దానినే కొత్తగా ఏర్పడిన "మలబారు" ప్రాంతంగా చెబుతారు. అక్కడే పరశు రాముడు నివసించగా, ఆయన ఉన్న చోట కరువు ఉండదని, వజ్రోత్సవ చంద్రికలో పేర్కొన బడింది. "అబ్రహ్మణ్యే తథా దేశే కైవర్తాన్ ప్రేక్ష్య భార్గవ: స్వామయత్యా స్వకీయే స్వక్షేత్రే విప్రాన్ ప్రకల్పితాన్"...స్కంధ పురాణం ఆధారంగా, కశ్యప బ్రాహ్మణునిచే వెడల కొట్టబడిన వాడైన పరశు రాముడు, సహ్యాద్రి పర్వత ప్రాంతమందు నివసించి, అక్కడి ఆటవికమైన కొండ జాతి వారికి జంధ్యములు వేసి బ్రాహ్మణులుగా మార్చినట్లు వివరించ బడింది. పరశు రాముడు 'కైవర్తా' ఆటవికులను బ్రాహ్మణులుగా గుర్తించడం వల్లనే కాబోలు - కొన్ని జాతుల వారికి 'రేఖాపదేవి' యులవేల్వాయనిది

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# లింగాయత మత స్థాపకుడు.....బసవేశ్వరుడు - వైశాఖ శుక్ల తృతీయ బసవేశ్వరుని జయంతి



సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది బసవేశ్వరుడు. హైందవ మతాన్ని సంస్కరించి, లింగాయత ధర్మాన్ని ఆయన స్థాపించారు. బసవేశ్వరున్ని (1134%-%1196) బసవన్న, బసవుడు అని, విశ్వగురు అని పిలుస్తారు. వైదిక కర్మలంటే చిన్నతనం నుంచే ఆయనకు నచ్చేది కాదు. కర్ణాటకలోని బాగేవాడి జన్మస్థలం. తండ్రి మాదిరాజు, తల్లి మాదాంబ. చిన్న వయసులోనే శైవ పురాణ గాథలను అవగతం చేసుకున్న బసవనికి కర్మకాండపై విశ్వాసం పోయింది. బసవనకు - ఎనిమిదవ యేటనే తండ్రి ఉపనయనము చేయ నిర్ణయించగా, తాను కర్మ బంధనములను త్రెంచుటకై జన్మించానని, ఉపనయనము చేయుట వలదని వారించి, తల్లిదండ్రులను వదలి, కూడల సంగమ అనే పుణ్యక్షేత్రం చేరి, బసవుడు అక్కడ వేంచేసియున్న సంగమేశ్వరుణ్ణి నిష్టతో ధ్యానించారు. దేవుడు కలలో కనిపించి బసవనికి అభయ మిచ్చాడని, దేవుని ఆనతి మేరకు, మంగళవాడ (కళ్యాణ పురం) చేరుకున్నారని చెపుతారు. ఆయన 12వ శతాబ్దంలో కర్ణాటక దేశాన్ని పాలించిన, బిజ్జలుని కొలువులో చిన్న ఉద్యోగిగా చేరి, రాజు భాండాగారానికి ప్రధాన అధికారియై, భండారీ బసవడుగ ఖ్యాతినొందారు. సామర్థ్యం, నిజాయితీతో, ఆయన బిజ్జలుని ప్రధానామాత్యుడిగా ఉన్నత పదవి పొందారు. ఒక వైపు రాజ్యపాలనలో ప్రధాన భూమిక నిర్వహిస్తూనే, బసవన్న వచన సాహిత్యంతో, ప్రజలందరినీ కులమతాలకతీతంగా ఏకం చేసారు. ఆయన బోధనల లోని సమదృష్టి ఎందరినో ఆకర్షించింది. వీరశైవ మతానికి తిరిగి పట్టం కట్టిన బసవని ఖ్యాతి కర్ణాటక ఎల్లలు దాటి, ఆంధ్రదేశం లోను వ్యాపించింది. ప్రతిరోజు లక్షా తొంభై ఆరువేల మంది జంగములకు, మృష్టాన్నములతో అర్చించి, అనంతరం తాను భుజించేవాడని చెపుతారు. బసవడు తన ఉపదేశాలు ప్రజలకు అందు బాటులో ఉండే రీతిగా వచనాలు రాశారు. వీటిలో సూక్ష్మమైన తత్త్వం సులువుగా బోధపడేది. సాహిత్య పరంగా కూడా బసవేశ్వరుని వచనాలకు చక్కని గౌరవం లభించింది. ఆయన మొత్తం 64 లక్షల వచనాలు కూర్చినట్లు ప్రతీతి. కానీ, ఈనాడు కొన్ని వేలు మాత్రమే మనకు లభ్య మవుతున్నాయి. బసవేశ్వరుడు స్థాపించిన 'అనుభవ మండపం' ఇప్పటి పార్లమెంటు తరహాలో వుండేది. అక్కడ అన్ని రకాల కులాలు, జాతులు తమ సమస్యలు వినిపించేవారు. ఆయన తన చేతుల మీదుగా ఒక వర్ణాంతర వివాహం జరిపించగా, అది ఆనాటి సంప్రదాయ వాదులకు నచ్చక, తీవ్ర వ్యతిరేకతకు దారి తీసింది. నూతన దంపతులు హత్యకు గురైనారు. ఈ సంఘటన బసవని హృదయాన్ని కలిచివేసింది. తన అమాత్య పదవిని వదలి, బసవేశ్వరుడు కూడలి సంగమేశ్వరుని సన్నిధికి చేరి, కొంతకాలానికి ఆయనలో లీనమైపోయారు. బసవేశ్వరుడు బోధించిన సంప్రదాయమే అనంతర కాలంలో "లింగాయత ధర్మం"గా స్థిరపడింది. పాల్కురికి సోమనాథుడు తెలుగులో "బసవపురాణం" రాశారు. హైందవ మతాన్ని సంస్కరించిన ముఖ్యులతో ఆయన ప్రముఖులు. సర్వేశ్వరుడు, శివుడిని మించిన వాడులేడన్న విశ్వాసంతో, శివతత్వ ప్రచారానికి పూనుకున్నారు. అలా లింగాయత మతానికి బీజాలు వేశారు. శివుడంటే ఒక కనిపించని శక్తి అని విగ్రహారాధనను వ్యతిరేకించారు.

**"బసవని ఉపదేశాలు":**... మనుషులందరూ ఒక్కటే. కులాలు, ఉపకులాలు లేవు. ఆహారం, ఇల్లు, బట్ట, జ్ఞానం, వైద్యం ఇవి మానవుని కనీస హక్కులు. శివుడే సత్యం, నిత్యం. శివునికి రూపం లేదు. శివుని పేరిట పురాణాలు అసత్యం. విగ్రహారాధన కూడదు. దేహమే దేవాలయం. వాస్తు, జ్యోతిష్యం అసత్యాలు. స్త్రీ పురుష భేదం లేదు. శ్రమను మించిన సౌందర్యం లేదు. భక్తి కన్నా సత్ప్రవర్తనే ముఖ్యం. దేవుడికి ప్రజలకు మధ్య పూజారులు అవసరం లేదు.వేదాలు, పురాణాల తిరస్కరణ, యజ్ఞ యాగాలు, పూజలు, మూఢనమ్మకాలు. స్వర్గ నరకాలు అబద్ధం. దొంగలింపకు, హత్యలు చేయకు...అబద్ధాలాడకు, కోపగింపకు, ఆత్మస్తుతి పరనిందల విడువు. అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మేంద్ర స్వామి భావాల్లో విప్లవాత్మక మార్పులు రావడానికి పరోక్షంగా బసవేశ్వరుడే కారణం అంటారు. కాయమే (శరీరం) కైలాసమని చాటి, శ్రమ జీవులకు అత్యంత గౌరవం తీసుకు వచ్చారు. బసవేశ్వరుని దివ్య జీవిత గాథను పాల్కురికి సోమనాథుడు రచించిన 'బసవ పురాణం' తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధమయింది. బసవన్న సిద్ధాంతాలను తప్పుగా ప్రచారం చేసి కొంతమంది వీరశైవ మఠాధిపతులు లింగాయతులను మళ్లీ గుడిగుండారాల వైపు, మూఢ నమ్మకాల వైపు నడిపించారు. ఎం.ఎం.కలబుర్గి బసవన్న మీద ఎంతో పరిశోధన గావించి, ఆయన సిద్ధాంతాలను మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆయన రచించిన ఐదు సంపుటాల "మార్గ" అనే కావ్యం సంచలనం సృష్టించింది. హిందూ సంప్రదాయ వాదుల నుంచి విమర్శలు ఎదుర్కొంది. ఆ తర్వాత లింగాయత ధర్మాన్ని, ప్రత్యేక మతంగా గుర్తించాలని పోరాటం పెరిగింది. కర్ణాకలో ప్రస్తుతం ఇది సాకారం అయింది. బసవన్న కార్ల్ మార్క్స్ కన్నా ముందే సమానత్వం, సోషలిజం కోసం పోరాటం చేసారు. రాజ్యాంగ రచనా సమయంలో, అప్పటి కర్ణాటక ముఖ్యమంత్రి నిజలింగప్ప, బసవన్న గురించి, అంబేద్కర్ కు చెప్పినప్పుడు.. అంబేద్కర్ ఆశ్చర్య పోయారట. ఇంత గొప్ప ఆలోచనలు వున్న వ్యక్తి కర్ణాటకకే, ఎందుకు పరిమితం అయిపోయారా అని. ఆయన వచనాలను ప్రపంచానికి పరిచయం చేయకుండా కన్నడిగులు ఈ దేశానికి అన్యాయం చేసారని బాధ పడ్డారట. బిజ్జలుడు బసవనను సకల నియోగాధ్యక్షునిగా చేసినట్లు సోమనాథుడు పేర్కొన్నాడు. రాజకీయముగా ఈ ఉద్యోగము బసవనకు వీరశైవ మత వ్యాప్తికి చాలా తోడ్పడింది. బసవన క్రీ.శ.1168లో హత్య గావించబడే నని కొందరు చరిత్రకారులు రాశారు. అయితే ఆయన క్రీ.శ.1196 వరకు జీవించెనని, పలు శాసనములు ఆధారములుగా కలవు. క్రీ.శ.1168లో బిజ్జలుడు వేయించిన శికారిపురి శాసనమున, ఆయన తన కుమారుడైన రాయ మురారి సోనిదేవుని గద్దెనెక్కించి తాను రాజపదవిని త్యజించినట్లు, తాను రచించిన రాజ్యతంత్రము నందు కలదు. పలువురు ఆంధ్ర కవులు బసవనను ప్రశంసించారు. పోతన "వీరభద్ర విజయమున" బసవుని స్తుతించుటయేగాక, ఆయన వచనములను కూడా అనుసరించినట్లు సాహితీ పరిశోధకుల అభిప్రాయం. "కలియుగంబున కల్యాణ కటక నగరి నాదు భక్తుండు బసవర నాథుడొకండు". అని శ్రీనాథుడు బసవుని ప్రశంసించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సింహాచలేశుని చందనోత్సవం.... అప్పన్న అపురూప నిజ దర్శనం



విశాఖ పరిసర ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంత భక్తులంతా సింహాద్రి అప్పన్నగా పిలుచుకునే శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి కొలువై వున్న ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రం సింహాచలం... దీనిని షిమాద్రి ఆలయం అని కూడా పిలుస్తారు. సింహాచలం... సింహం కొండ అని అర్థం. ఇది పద్దెనిమిది "నరసింహ క్షేత్రాలలో" ఒకటి. చందన రూపుడు, సింహాచలేశుడు దేశం లోని అన్ని నారసింహ క్షేత్రాల్లో విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం క్షేత్రం అతి ప్రాచీనమైనది. విశాఖపట్నానికి 11 కిలోమీటర్ల దూరంలో తూర్పు కనుమలలో, సముద్ర మట్టానికి 244 మీటర్ల ఎత్తున వున్న 'సింహగిరి' అనే పర్వతం మీద కొలువై వున్న సింహాచలం తెలుగు రాష్ట్రాల్లోనే సుప్రసిద్ధ నారసింహ క్షేత్రం. ఈ క్షేత్రంలో భక్తులందరూ 'సింహాద్రి అప్పన్న'గా పిలుచుకునే వరాహ లక్ష్మీ నరసింహ స్వామి కొలువై వున్నాడు. సింహాచలం క్షేత్రంలో రెండు విష్ణు అవతారాలు కలసిన మూర్తిని పూజిస్తారు. రెండు అవతారాలు ఒకదాని కొకటి సంబంధించి ఉన్నాయిని అర్థం. ఒకటి భూదేవి భర్తయైన వరహావతారం. రెండవది లక్ష్మీదేవి భర్తయైన నరసింహావతారం. వేదాలు అపహరించిన హిరణ్యాక్షుడిని సంహరించిన వరాహ అవతారం, ఆ తర్వాత యుగంలో హరి ద్వేషంతో.. భక్తులను హింసించిన హిరణ్యకశిపుని వధించిన నృసింహావతారాల కలయికగా.. స్వామి ఇక్కడ వరాహ నృసింహ స్వామిగా స్వయం వ్యక్తమయ్యారు. హిరణ్య కశిపుని వధానంతరం భక్తశ్రేష్టుడైన ప్రహ్లాదునిచేత ప్రతిష్ఠితమైనదిగా చెప్పుకుంటారు. చంద్రవంశానికి చెందిన పురూరవుడు అనే యాదవ రాజు గగన యానం చేస్తూ విమానం మీద వెళ్ళుతుండగా ఈ స్థలానికి ఉన్న అత్యంత ప్రశస్తమైన శక్తి ప్రభావం వల్ల పురూరవుడి విమానం క్రిందకు ఆకర్షించబడింది. ఆరాజుకు భూమిలో కప్పబడి ఉన్న నరసింహస్వామి కనిపించాడు. విగ్రహాన్ని సంవత్సరకాలం పాటు చందనంతో కప్పి ఉంచి వైశాఖ శుద్ధ తదియ రోజు మాత్రమే చందనం లేకుండా నిజరూప దర్శనం కలిగే టట్లు చేయమని ఆకాశవాణి పురూరవుడికి వచించి నట్లు కథనం. మూలవిరాట్టు లింగము ఆకారంలో కనిపిస్తుంది. అసలు విగ్రహానికి మంచి గంధం పూత పూయటం వలన ఆ విధంగా కనిపిస్తుంది. విగ్రహం వేడిగా వుంటుందని, ఆ వేడిని ఉపశమింప జేయడానికి నిరంతరం చందనం లేపనంగా పూస్తూ వుంటారని చెబుతారు. దేవాలయపు గర్భగుడికి ఎదురుగా ఉన్న ప్రాకారములో కప్ప స్తంభం ఉంది. ఈ స్తంభం సంతాన గోపాల యంత్రం ప్రతిష్టితమై ఉంది. ఇది అత్యంత శక్తివంతమైనది అని భక్తుల నమ్మకం. సంతానం లేనివారు ఈ కప్ప స్తంభమును కౌగిలించుకొంటే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. స్వామి వారికి భక్తులు ఇక్కడే కప్పాలు (కప్పం/పన్ను) చెల్లించేవారు కనుక దీనిని కప్పపు స్తంభం అనేవారు. కాలక్రమేణా అది కప్ప స్తంభం అయింది. సింహాచల క్షేత్రానికి సంబంధించి చందనోత్సవం చాలా ముఖ్యమైన ఆధ్యాత్మిక ఉత్సవం.ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ తదియ రోజున ఈ గంధం పూతను తొలగించి, స్వామి నిజరూపాన్ని దర్శించే అవకాశం కలిపిస్తారు. కేవలం 12 గంటల సమయం మాత్రమే స్వామివారి నిజస్వరూపాన్ని చూసే అవకాశాన్ని భక్తులకు కలిగిస్తారు. దీనిని చందనోత్సవం లేదా చందనయాత్ర అని పిలుస్తారు. నిజరూపంలో స్వామివారు వరాహ ముఖం, మానవాకారం, సింహపు తోక కలిగి ఉంటారు. మళ్లీ వెంటనే చందనపు పూతవేసి నిజరూపాన్ని మరుగు పరుస్తారు. చందనోత్సవానికి కొద్ది రోజుల ముందే ఈ ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ దేవాలయంలోని పూజారులు స్వామివారికి కొత్త చందనపు లేపనం కోసం గంధపు చెక్కలను అరగదీయడం ప్రారంభిస్తారు. ఇలా అరగదీసిన చందనాన్నే 12 గంటల నిజరూప దర్శనం ముగిసిన తర్వాత స్వామివారికి లేపనంగా పూస్తారు. చందనోత్సవం రోజున స్వామివారి నిజరూప దర్శనం చేసేందుకు వేలాదిమంది భక్తులు ఆలయానికి వస్తారు. స్వామి వారి నుంచి తొలగించిన గంధాన్ని చందన ప్రసాదంగా భక్తులకు అందజేస్తారు. ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బంగా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షల మంది భక్తులతో మరింత రద్దీగా మారుతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# కౌండిన్యలో తాగునీటి కష్టాలకు చెక్

పలమనేరు : కౌండిన్య అటవీప్రాంతంలో వన్యప్రాణులకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. సరైన వర్షాల్లేక వేసవిలో అటవీ ప్రాంతంలోని కుంటలు, చెరువులు, చలమలు ఎండిపోయాయి. దీంతో ఏనుగులతో పాటు వివిధ వన్యప్రాణులకు తాగునీరు లభించక జనావాసాలు, జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. ఫలితంగా కొన్ని జంతువులు ప్రమాదాల బారిన పడుతున్నాయి. వీటిని నివారించేందుకు కృత్రిమ పద్ధతుల్లో బోర్లు వేసి నీటి వసతి కల్పించాలని సంకల్పించి ఆచరణలో పెట్టింది. మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో విస్తరించిన అభయారణ్యంలో ఏనుగులు అధికంగా ఉన్నాయి. వేసవిలో సరైన నీరు, ఆహారం లభించక ఏనుగుల మందలు సమీపంలో పంటపొలాలు, గ్రామాల్లోకి వస్తున్నాయి. ఈ సమయంలో విద్యుదాఘాతం, రహదారి ప్రమాదాలు చోటుచేసుకుని అవి మరణిస్తున్నాయి.

**రూ.90 లక్షలతో ఆరు బోర్లు**

పలమనేరు అటవీ పరిధిలో దాదాపు 20 కుంటలున్నాయి. అవన్నీ దాదాపు ఎండిపోయాయి. వీటికి నిరంతరం నీటి వసతి కల్పించేందుకు బోర్లు వేయాలని ప్రణాళిక రూపొందించారు. అడవిలో భూగర్భ



జలాలున్న అధికంగా ఉన్న ఆరు ప్రాంతాలను గుర్తించారు. అక్కడ బోర్లు వేసి.. కుంటలకు పైపులతో నీటి వసతి అందిస్తారు. దీని కోసం ప్రభుత్వం రూ.90 లక్షలు కేటాయించింది. రెండు చోట్ల ప్రయోగాత్మకంగా ఈ పనులు చేపట్టగా విజయవంతమయ్యాయి. త్వరలో మరో నాలుగు చోట్ల ఇదే మాదిరిగా నీటి వసతి కల్పించనున్నట్లు పలమనేరు అటవీ శాఖాధికారి నారాయణ తెలిపారు.

**పైపులు, బోర్ల రక్షణకు చర్యలు** ఏనుగులు సాధారణంగా పైపులు, బోర్లు, ప్యానళ్లు కనిపిస్తే నీటి కోసం వాటిని ధ్వంసం చేస్తాయి. దీన్ని నివారించేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నారు. నీరు కొండల నుంచి సహజంగానే జాలువారుతున్నట్లు ఎత్తైన ప్రాంతాల్లో పైపులు ఏర్పాటు చేస్తారు. అవి కనపడకుండా భూగర్భంలో వేస్తారు. కొండల నుంచి వచ్చిన నీరు గొలుసుకట్టు పద్ధతిలో 4-5 కుంటలకు వెళ్లేలా కాల్వలు ఏర్పాటు చేస్తారు. అలాగే సౌర ప్యానళ్ల కోసం 20 అడుగుల ఎత్తులో సిమెంట్ దిమ్మెలు నిర్మిస్తున్నారు.

# ఎలక్ట్రికల్ హబ్‌గా పుంగనూరు

పుంగనూరు : పుంగనూరులో వైకాపా హయాంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు స్థలం గుర్తించి వదిలేశారు. కొన్ని సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నట్లు హడావుడి చేసినా ఏర్పాటుకు అడుగులు పడలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పుంగనూరులో భారీ పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తోంది. ఫలితంగా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన పుంగనూరు ఎలక్ట్రికల్ హబ్‌గా మారనుంది. మెట్ట భూములున్న ప్రాంతంలో పరిశ్రమలు వస్తే ఉపాధికి అవకాశం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పుంగనూరు మండలం ఆరడిగుంట సమీపంలో రెండువేల ఎకరాలు గుర్తించారు. ఇక్కడ పరిశ్రమలు స్థాపించేందుకు పలు సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. అందులో ఓ పైపుల తయారీ పరిశ్రమల ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించింది. 140 దేశాలకు డీఐ పైపులు సరఫరా చేసే ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ సంస్థ, డక్టైల్ ఐరన్ పైపుల తయారీని ఫిబ్రవరిలో ప్రారంభించింది. రూ.165 కోట్లతో 60 ఎకరాల్లో స్థాపించిన ఈ పరిశ్రమలో 300 మందికి ఉపాధి లభించింది. భవిష్యత్తులో వెయ్యిమందికి ఉపాధి కల్పించేలా విస్తరిస్తామని యాజమాన్యం పేర్కొంది.

**అనుబంధ పరిశ్రమలు సైతం**



విద్యుత్తు బస్సుల తయారీ పరిశ్రమకు అనుబంధంగా క్యాంగ్‌సంగ్, టీసంగ్ ఎలక్ట్రానిక్స్ ఇండియా, హెయర్‌సంగ్ పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. ఆయా కంపెనీల ప్రతినిధులు ప్రభుత అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ఈ పరిశ్రమల స్థాపన సాకారమైతే 20 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.


**వసతులూ ఉన్నాయి**

పరిశ్రమల కోసం 133 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం ఏర్పాటు చేశారు. సమీపంలోనే హంద్రీనీవా కాలువ సాగుతోంది. బైరెడ్డిపల్లె ఎక్స్‌ప్రెస్ హైవేకు ఇక్కడి నుంచి రహదారి నిర్మించనున్నారు. చెన్నై, బెంగళూరు నగరాలకు అత్యంత సమీపంలో ఉంటుంది. రవాణాకు ఇబ్బంది ఉండదు.

**విద్యుత్ బస్సుల తయారీ సంస్థ ఆసక్తి**

జర్మన్‌కు చెందిన అతిపెద్ద ఆటోమొబైల్ సంస్థ పెప్పర్ మోషన్ తమ విద్యుత్తు బస్సుల తయారీ యూనిట్ పుంగనూరులో ఏర్పాటు చేయనుంది. వైకాపా హయాంలో ఒప్పందం చేసుకున్న పలు పరిశ్రమలు తర్వాత స్తబ్ధుగా ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వ చొరవతో వారు ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఇటీవల పరిశ్రమ యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.50 కోట్లు చెల్లించింది. సంస్థ సీఈవో, ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్నతో కలిసి చర్చలు జరిపారు. 900 ఎకరాల్లో నెలకొల్పే ఈ పరిశ్రమ 300 ఎకరాల్లో ట్రాక్, 600 ఎకరాల్లో విద్యుత్తు బస్సుల తయారీ యూనిట్లు రానున్నాయి. ఫలితంగా 8 వేలమందికి ప్రత్యక్షంగా, 10 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

# రుసుం దందా



హిందూపురం పురపాలక సంఘం
NJR హిందూపురం
లారీ
మునిసిపల్ గేట్ పాస్ మరియు పట్టణములో
రోజువారి రూ॥ 400-00
(అక్షరాలా నాలుగు వందల రూపాయలు మాత్రమే)
తేది 17/04/25 న ముట్టినది.
AP02 [illegible] 9592 చెల్లించు వారి సంతకము.

అనంతపురం : ఉమ్మడి జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో దినసరి మార్కెట్ వేలం దక్కించుకున్న కొందరు గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చిరువ్యాపారుల నుంచి అధిక మొత్తంలో రుసుం వసూలు చేస్తున్నారు. కూరగాయల మార్కెట్లతోపాటు దుకాణాలకు సరకు తీసుకొస్తున్న లారీలు, ఆటోలు, ఎడ్లబండ్లు, తోపుడుబండ్లు నుంచి గేట్ పాస్ పేరిట నిర్ణీత ధర కంటే రెండు నుంచి మూడింతలు లాగుతున్నారు. హిందూపురం, అనంతపురం, ధర్మవరం, తాడిపత్రి మున్సిపాలిటీల్లో ఈ దందా సాగుతోంది. మరోవైపు పశువుల సంతలు, జంతువధశాలలకు వచ్చే వాహనాల నుంచి అధిక మొత్తం వసూలు చేస్తున్నారు.

**సూచిక బోర్డులు ఎక్కడ?**

దినసరి మార్కెట్, పశువుల సంతలకు వచ్చే వాహనాల నుంచి గెజిట్‌లో పేర్కొన్న ధరలు వసూలు చేయాలి. దీనికి సంబంధించి ఎక్కడికక్కడ బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా... కనిపించడం లేదు. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రం అధికారులు గుత్తేదారులను పిలిచి మందలించకుండానే మమ అనిపిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. హిందూపురం దినసరి మార్కెట్‌లో రూ.64 లక్షలకు రుసుం వసూలు కాంట్రాక్టు దక్కించుకున్నారు. లారీ నుంచి రూ.80కు బదులు రూ.400, ఐచర్‌కు రూ.50 గాను రూ.300, తోపుడు బండ్లకు రూ.7కు రూ.60, పూల గంపలకు రూ.7 గాను రూ.30 వసూలు చేస్తున్నారు. రశీదులు సైతం అధిక ధరలతోనే అందిస్తుండటం గమనార్హం. సంతలో ఒక్కో మేక, గొర్రెకు రూ.15 వసూలు చేయాల్సి ఉండగా ఏకంగా రూ.100 తీసుకుంటున్నారు.

అనంతపురం కూరగాయల మార్కెట్‌కు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ద్వారా సరకు వస్తుంది. ఐచర్‌కు రూ.100 గాను రూ.200 నుంచి రూ.300, లారీకి రూ.150కి గాను రూ.300 వసూలు చేస్తున్నారు. ఆటోలు, తోపుడుబండ్లకు మూడు నుంచి నాలుగింతలు రాబడుతున్నారు.

తాడిపత్రిలో ఐచర్‌కు రూ.100 గాను రూ.200, లారీకి రూ.150కి గాను రూ.300 వసూలు చేస్తున్నారు.రశీదులు ఇవ్వకుండానే డబ్బులు వసూలు చేస్తున్నట్లు డ్రైవర్లు వాపోతున్నారు.

ధర్మవరంలో తోపుడుబండ్లకు రూ.20కి బదులు రూ.60, మార్కెట్ బయట విక్రయించేవారికి రూ.20కిగాను రూ.100 వసూలు చేస్తున్నారు. ఐచర్‌కు రూ.150 గాను రూ.250, లారీకి రూ.180కి రూ.400 నుంచి రూ.450 లాగుతున్నారు. రశీదుల్లో మాత్రం గెజిట్‌లోని ధరలు వేస్తున్నారు.

# విలీనం.. అసంబద్ధం!




చిత్తూరు : రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమూలంగా మార్పు చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి ఒప్పించి పాఠశాలల విలీన ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.. అయితే తల్లిదండ్రులను ఒప్పించడంలో మండల విద్యాశాఖాధికారులు సఫలీకృతులు కాలేదు.. కొన్నిచోట్ల అసంబద్ధంగానే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించారు.. దీంతో విలీనం ఆపేయాలని కొన్నిచోట్ల స్థానికులు అక్కడి ప్రజాప్రతినిధులను ఆశ్రయించడం గమనార్హం.. మరీ విచిత్రమేమంటే మూడు కిమీ పరిధిలోపే విలీనం చేయాలని ప్రభుత్వం చెప్పినా ఇష్టానుసారంగా ఐదు కిమీ మేర పెంచేసి ప్రతిపాదనలు పంపడం వెనుక ఆంతర్యమేమిటనేది ఎంఈవోలకే ఎరుక.వెదురుకుప్పం మండలం బలిజమొండి వెంగన్నపల్లెలో ప్రాథమికోన్నత పాఠశాలను.. వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. ఆ గ్రామం నుంచి 4 కి.మీ. దూరంలోని పాఠశాలకు చేరుకునేందుకు విద్యార్థులు చెరువు కట్టపై నడవాల్సి రావడంతో తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు.

పుత్తూరు కాపువీధి బాలికోన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 6, 7, 8 తరగతుల వారు 69 మంది. ఈ పాఠశాలను తల్లిదండ్రులు అప్‌గ్రేడ్ చేయాలని కోరుతున్నారు. ఆదర్శ పాఠశాలగా మార్చాలని అధికారులు పంపిన ప్రతిపాదనలపై వారు మండిపడుతున్నారు.

శాంతిపురం మండలంలో పది పాఠశాలలను విలీనం చేస్తున్నారు. ఐదు పాఠశాలల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే అంగీకరించారు. శాంతిపురం మండలం కరిగానేపూరు విద్యార్థులను పెద్ద బొమ్మనపల్లి పాఠశాలలో విలీనం చేశారు. వీరు పలమనేరు-కుప్పం హైవే దాటి వెళ్లేందుకు తల్లిదండ్రులు అంగీకరించడం లేదు.

**ప్రభుత్వ ఆశయమిదీ..**

1, 2 తరగతులు, అంగన్‌వాడీ కేంద్రాలను ఫౌండేషన్ పాఠశాలలుగాబీ 1 నుంచి 5 వరకు 60 మంది పిల్లల కన్నా తక్కువ కాకుండా ఉన్న పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా, 1 నుంచి 5 తరగతులకు సంబంధించి 30లోగా విద్యార్థులు ఉంటే బేసిక్ స్కూళ్లుగా ఏర్పాటు చేయాలని, కొత్తగా అవసరమైన చోట్ల ఉన్నత పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆదర్శ పాఠశాలల్లో ప్రతి తరగతికి ఓ ఉపాధ్యాయుడిని నియమించనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. బేసిక్ స్కూళ్లలో కనీసం ఇద్దరు, ఫౌండేషన్ స్కూళ్లలో ఓ ఉపాధ్యాయుడు, అంగన్‌వాడీ టీచర్ ఉంటారు. హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్య బట్టి ఉపాధ్యాయులను నియమిస్తారు.

**తర్జన భర్జన..**

జిల్లాలో పాఠశాలల విలీనానికి సంబంధించి ఎంఈవోలు, ఉపాధ్యాయులు తర్జన భర్జన పడుతున్నారు. కొన్ని చోట్ల పాఠశాలలను విలీనం చేసేందుకు తల్లిదండ్రులు, స్థానికులు ఒప్పుకోవడం లేదు. పైగా స్థానిక ఎమ్మెల్యేలను కలిసి మరీ విన్నవిస్తున్నారు. విలీనాన్ని ఆపేసి తమ పిల్లలు ఇబ్బంది పడకుండా చూడాలని కోరుతున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక విద్యాశాఖాధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికీ జిల్లాలో ఈ ప్రక్రియ ఓ కొలిక్కి రాలేదని విద్యాశాఖ అధికారులు పేర్కొనడం గమనార్హం.

# బంగాళ దుంప.. అన్నదాతకు బెంగ..!



కుప్పం : కుప్పం, పలమనేరు, పుంగనూరులో 20 వేల ఎకరాల్లో బంగాళదుంప సాగైంది. జనవరిలో పంట వేయగా.. వాతావరణం అనుకూలించడంతో మార్చిలో మంచి దిగుబడి చేతికందింది. ఎకరాకు 12 టన్నుల సరకు వచ్చింది. మార్కెట్టులో ధరలు పడిపోవడంతో వ్యాపారులు ముందుకు రాలేదు. ఫలితంగా పొలాల్లోనే నిల్వ చేయాల్సిన దుస్థితి.

శాంతిపురం మండలం చిన్నగాండ్లపల్లెకు చెందిన మునివెంకటరెడ్డి ఐదెకరాల్లో బంగాళ దుంప సాగుకు రూ. 4 లక్షలు ఖర్చు చేశారు. ఆశించిన దిగబడి (60 టన్నులు) చేతికందినా.. గిట్టుబాటు ధరలు లేనందున కొన్నాళ్ల పాటు పొలంలోనే షామియానా నీడన దుంపలు నిల్వ చేశాడు. ఫలితం లేకపోవడంతో తమిళనాడులోని మేటుపాళ్యం శీతల గిడ్డంగిలో నిల్వ చేసేందుకు తీసుకెళ్లాడు. రవాణా, గిడ్డంగి అద్దె దాదాపు రూ. 2 లక్షల వరకు అవుతోందని రైతు వాపోయారు.

**కిలో రూ.10లే**

అప్పు చేసి సాగు చేసిన రైతులు దిగుబడి వచ్చిన వెంటనే గత్యంతరం లేక వ్యాపారులు నిర్ణయించిన ధరకే తెగనమ్ముకున్నారు. స్థానికంగా కిలో రూ.10 మాత్రమే పలికింది. దూర ప్రాంతాల్లోని గిడ్డంగుల్లో దుంపల నిల్వకు వ్యయప్రయాసలు భరించలేని సామాన్య రైతులు పొలంలోనే విక్రయించేశారు.

**శీతల గిడ్డంగులతో ప్రయోజనం**

ఏటా వేలాది టన్నుల బంగాళ దుంపలు పండించే పశ్చిమ ప్రాంత రైతులు అందుబాటులో శీతల గిడ్డంగులు లేనందున నష్టపోతున్నారు. ఆరేళ్ల కిందట తెదేపా పాలనలో మంజూరు చేసిన శీతల గిడ్డంగులు అందుబాటులోకి రాకపోవడంతో కొన్ని చోట్ల ప్రైవేటు గిడ్డంగులపై ఆధారపడుతున్నారు. బైరెడ్డిపల్లె, పలమనేరు, రామకుప్పం మండలాల్లోని ఉద్యాన రైతు సంఘాల ఆధ్వర్యంలో గిడ్డంగులు నిర్వహించుకునేలా రూ.9 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టినా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు.

**తమిళనాడే దిక్కు**రైతులు దుంపల నిల్వకు తమిళనాడు శీతల గిడ్డంగులు ఆశ్రయిస్తున్నారు. మేటుపాళ్యంలోని ప్రైవేటు గిడ్డంగుల్లో వందలాది టన్నులు నిల్వ చేస్తున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించే వరకు నెలల తరబడి ఉంచడంతో అద్దె భారమవు తోంది. గిడ్డంగులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతామని ఉద్యానశాఖ ఏడీ కోటేశ్వరరావు తెలిపారు.

# ఆదాయమే చూస్తాం.. వసతులు విస్మరిస్తాం

పుత్తూరు : మార్కెట్ కమిటీలు ఆదాయంపై ఉన్న శ్రద్ధను వసతుల కల్పనలో చూపడం లేదు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 22 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటిలో పుత్తూరు, చిత్తూరు, తిరుచానూరు, బంగారుపాళ్యం, దామలచెరువులో ఏటా మామిడి వ్యాపారం జోరుగా సాగుతుంది. తద్వారా మార్కెట్ కమిటీలకు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా వసతులు కల్పించడం లేదు. దీంతో రైతులు, వ్యాపారులు, కూలీలు అవస్థలు పడుతున్నారు. కొద్దిరోజుల్లో మామిడి సీజన్ ప్రారంభమవుతున్నా కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.

ఉమ్మడి జిల్లాలో 96 వేల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. మామిడి గుజ్జు తయారు చేసే పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలో 70 ఉన్నాయి. మామిడి క్రయవిక్రయాలు జరిగే మండీల్లో వసతులు లేకపోవడం విస్మయం కలిగించే అంశం. పుత్తూరు, చిత్తూరు, తిరుచానూరు, బంగారుపాళ్యం, దామలచెరువు యార్డుల్లో వ్యాపారం ముమ్మరంగా జరుగుతుంది. పుత్తూరు, చిత్తూరు, బంగారు పాళ్యం, తిరుచానూరు యార్డులు ప్రభుత్వ స్థలాల్లో ఉన్నాయి. దామలచెరువులో మాత్రం ప్రైవేటు స్థలంలో వ్యాపారులు అద్దె ప్రాతిపదికన వ్యాపారాలు సాగిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ సెస్సు వసూలు చేస్తున్నందున వసతులు కల్పించాలని కోరితే ప్రైవేటు స్థలంలో తామెలా చేస్తామని తప్పుకొంటున్నారు. దీంతో ప్రైవేటు వ్యాపారులే సీజన్ సమయంలో వసతులు ఏర్పాటు చేసుకుంటున్నారు. బంగారుపాళ్యంలో 110 మండీలు, చిత్తూరులో 42 మండీలు, తిరుచానూరులో 30, పుత్తూరులో



22 మండీల ద్వారా అద్దెలు కూడా వసూలు చేస్తున్నారు.

**తాగునీటికి కటకటే..**

బంగారుపాళ్యం, చిత్తూరు, తిరుచానూరు మినహా పుత్తూరు యార్డులో తాగునీటికి ఇబ్బందులున్నాయి. మిగిలిన యార్డుల్లో రైతు విశ్రాంత భవనాలున్నా పుత్తూరులో లేవు. వైకాపా హయాంలో రైతుల కోసం విశ్రాంత భవనాలు ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పినా నెరవేరలేదు. మూడేళ్ల కిందట భారీ వర్షాలకు పుత్తూరులో ప్రహరీ పడిపోయినా నేటికీ నిర్మించక పోవడంతో భద్రత కరవైంది.

యార్డుల్లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు లేవు. మామిడి సీజన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వందల మంది కూలీలు ఇక్కడ ఉపాధి పొందుతుంటారు. వీరందరికీ స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకోవడానికి గానీ సౌకర్యాలు లేవు. పుత్తూరులో నీటి వసతి లేదు. వర్షాలు పడినపుడు ఈ యార్డుల్లో ముక్కు మూసుకోవాల్సిందే. తిరుచానూరు యార్డు పూర్తిగా అపరిశుభ్రంగా ఉంది. పట్టించుకునే దిక్కులేదు.

# ప్రారంభించారు.. వెంటనే మూసేశారు

వాకాడు: ఇది వాకాడులోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం. రెండు నెలల కిందట స్థానిక ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ప్రారంభించారు. వెంటనే అధికారులు దాన్ని మూసేశారు. ఇకపై కొత్త భవనంలో వైద్యసేవలు అందుతాయని ఆశించిన మండల ప్రజలకు నిరాశే ఎదురైంది. కొత్త భవనం తలుపులు ఎప్పుడు తెరుచుకుంటాయా.. ఎప్పుడు వైద్యసేవలు అందిస్తారా అని ప్రజలు నిరీక్షిస్తున్నారు. పాత భవనం పైకప్పు పెచ్చులు ఉండటం, తక్కువ ఎత్తు ఉండటంతో ఆరు అడుగుల ఎత్తున్న వ్యక్తులు తలదించుకొని




నడవాల్సిన పరిస్థితి నెలకొనడంతో నాబార్డు నిధులు రూ.5.13 కోట్లతో కొత్త భవనాన్ని నిర్మించారు. అంచనాలను పక్కన పెట్టి గుత్తేదారు ఇష్టానుసారంగా నిర్మించారన్న ఆరోపణలున్నా, అందుకు నిధులు కొరతనే వాదనను ఇంజినీర్లు వినిపిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రారంభించినా.. నేటికీ తలుపులు తెరుచుకోకపోవడాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు. ఇంకా కొన్ని పనులు పూర్తి కాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై డాక్టర్ రోహిత్‌ను వివరణ కోరగా వారం రోజుల్లో భవనం తెరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కర్షకుల కష్టం బూడిదపాలు

పాణ్యం : పచ్చని పంట బూడిదపాలవుతోంది. కాలుష్యం బారిన పడి దిగుబడి 'నేల' చూపులు చూస్తోంది. పెట్టుబడులు రాక అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. న్యాయం చేయండంటూ రైతులు ఆందోళన చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గడివేముల మండలం బిలకలగూడూరు, బూజునూరు గ్రామాల పరిధిలో పంటలు జిందాల్ పరిశ్రమ నుంచి వెలువడే బూడిదతో దెబ్బతింటున్నాయి. ఆయా గ్రామాల్లో ఖరీఫ్‌లో సోయాబీన్, రబీలో జొన్న సాగు చేస్తుంటారు. పరిశ్రమ నుంచి వెలువడే బూడిదతో ఏటా రెండు గ్రామాల పరిధిలో 70 ఎకరాల మేర పంట నష్టపోతోంది. ఈసారి రబీలో పెద్ద ఎత్తున జొన్న సాగు చేశారు. పరిశ్రమ నుంచి వెలువడే బూడిద మొక్కలపై పడుతోంది.. పత్రాలన్నీ నల్లగా మారుతున్నాయి.. ఎకరాలకు రూ.35 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. పరిశ్రమలకు దూరంగా ఉన్న పొలాల్లోని దిగుబడితో పోల్చితే ఎకరాకు 5 నుంచి 7 సంచులు తగ్గినట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. క్వింటాకు రూ.3,370 చొప్పున ప్రభుత్వం సేకరిస్తోంది.. రంగుమారిన జొన్నలను కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు.. వారు కేవలం రూ.1,800 చెల్లిస్తున్నారు. **పరిశీలించిన అధికారుల బృందం**కాలుష్యంతో పాడైన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు ఏటా పోరాడుతున్నారు. గతేడాది రైతుల పోరాటం ఫలితంగా ఎకరాకు రూ.20 వేల నష్ట పరిహారం ఇచ్చారు. ఈఏడాదీ పరిహారం ఇప్పించాలని రైతులు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి విన్నవించారు. ఆమె కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లారు. నష్టం అంచనాలు గుర్తించేందుకు ఐదుశాఖల అధికారుల బృందాన్ని నియమించారు. వారు క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించారు.పదేళ్లుగా పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యం వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. పదేళ్లుగా పరిహారానికి పోరాడుతున్నా పట్టించుకోలేదు. గతేడాది ఎకరాకు రూ.20 వేలు ఇచ్చారు. ఈ ఏడాది జాప్యం చేస్తున్నారు

## ఎన్జీటీ ఆదేశాలా.. లెక్కలేదంతే!

కాకినాడ: గత వైకాపా ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో అతిక్రమణలకు లెక్కేలేదు. జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) వంటి కీలక వ్యవస్థల ఆదేశాలను సైతం నాటి పాలకులు పట్టించుకోలేదు. నేటికీ ఆ అక్రమాల జాడలు తారసపడుతున్నాయి.

**తవ్వేస్తుంటే.. చూస్తుంటారు..**

"సఖినేటిపల్లి, మలికిపురం, మామిడికుదురు మండలాల్లో వందల ఎకరాల్లో అనుమతుల్లేకుండా ఆక్వా చెరువులు తవ్వేశారు. పర్యావరణానికి హాని కలుగుతోందని ఎన్ఆర్ఐ వెంకటపతిరాజా ఎన్జీటీని 2020లో ఆశ్రయించారు. ఎన్జీటీ బృందం ఆ అక్రమాలు నిజమేనని తేల్చింది. ఆ చెరువులు తొలగించాలని 2022 జులైలో ఆదేశించినా ప్రక్రియ పూర్తికాలేదు."కోనసీమ జిల్లాలో అనధికారిక ఆక్వా సాగుపై ఎన్జీటీ (చెన్నై) 2024 సెప్టెంబర్ 4న మరో తుది ఆదేశాన్ని జారీచేస్తూ.. సెప్టెంబర్ 30లోపు చర్యల నివేదిక సమర్పించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. 438 అనధికారిక ఆక్వా చెరువులు ఉన్నట్లు తేలింది. మామిడికుదురు 80, మలికిపురం 30, సఖినేటిపల్లి మండలంలో 19 చెరువులు తొలగించి మమ అనిపించారు. మిగిలినవి రాజకీయ కనుసన్నల్లో ఉండడంతో వాటి జోలికి వెళ్లలేదు.

**ఆ తప్పు సరిదిద్దరా..**



కాకినాడ శివారులోని 58 ఎకరాల్లో మడ వనాలు వైకాపా ప్రభుత్వం ధ్వంసం చేసింది. ఇళ్ల స్థలాల కోసం ఈ పనికి పాల్పడింది. 2020 మార్చిలో ఎన్జీటీ దృష్టికి వెళ్లింది. నాటి ప్రభుత్వ చర్యలను ఎన్జీటీ తప్పుపట్టి రూ.5 కోట్ల పరిహారం చెల్లించాలని.. మడ వనాలు పునరుద్ధరించాలని 2022లో ఆదేశించింది. పరిహారం చెల్లించినా.. మడ పునరుద్ధరణ లేదు. ఈ భూమి ఆక్రమించి లారీ స్టాండ్‌గా మార్చే ప్రయత్నాలు వైకాపా నేత కనుసన్నల్లో సాగాయి. మట్టి తొలగించడానికి టెండర్ల పేరుతో కాలయాపన చేస్తున్నారు.

## విద్యార్థినులపై ఎలుకల దాడి

అనంతపురం : కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వసతి గృహంలో మూషికాలు దాడిలో విద్యార్థినులు గాయపడిన ఘటన కలవరం రేపుతోంది. వసతి గృహంలో విద్యార్థినులు నిద్రిస్తుండగా ఎలుకలు కొరికాయని, ఈ ఘటనలో 10 మంది విద్యార్థినులకు గాయాలయ్యాయి. వారందరికీ ప్రభుత్వ ఆసుపత్రిలో టీకాలు వేయించగా.. విషయం వెలుగులోకి వచ్చింది. ఆ కళాశాల వసతి గృహంలో గత నెలలో అన్నంలో పురుగులు, మజ్జిగలో బొద్దింకలు వచ్చాయి. ఈ ఆహారం తీసుకొని అప్పట్లో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఆ సంఘటన మరచిపోక ముందే విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన జరగడం పర్యవేక్షణ లోపాలను ఎత్తిచూపుతోంది. కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల అనంతపురం జిల్లాలో ఉన్న ఏకైన ప్రభుత్వ మహిళా కళాశాల. ఇందులో అన్ని సదుపాయాలున్నాయి. 1200 మంది విద్యార్థినులు అక్కడ చదువుతున్నారు. న్యాక్ గుర్తింపు కూడా లభించింది. రెండేళ్ల క్రితం స్వయం ప్రతిపత్తిహోదా కూడా దక్కింది. కానీ వసతి గృహం మాత్రం అధ్వానంగా ఉంది. ఒకే భవనంలో 400 మంది విద్యార్థినులు ఉంటున్నారు. నిర్వహణలో లోపాలున్నాయి. పారిశుద్ధ్యం సక్రమంగా లేదు. ఇందులో ఉంటున్నది ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులే. అందరూ దూర



ప్రాంతాల నుంచి వచ్చిన వారే. సరైన భోజనం, వసతి అందక ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున మరో వసతి గృహం నిర్మిస్తున్నారు. అదనపు వసతిగృహ భవనం నిధులు లేక అర్ధాంతరంగా ఆగిపోయింది. నిర్మాణంలో ఉన్న భవనంలోనే వంటశాల, భోజనశాల ఉండటంతో అధ్వానంగా మారింది. దీనికితోడు సరైన పర్యవేక్షణ లేక అవస్థలు తప్పడం లేదు.

**చిరుతిళ్లు ఉన్నందునే..**

చిరుతిళ్లు గదుల్లో ఉండటంతో ఎలుకలు వస్తున్నట్లు గుర్తించాం.. విద్యార్థులు నిద్రిస్తున్నపుడు ఎలుకలు కొరికాయి. బాధితులందరికీ వాక్సిన్లు వేయించాం. పరిసరాలు శుభ్రం చేయించాం. ఎలుకలు రాకుండా చర్యలు తీసుకున్నాం..సత్యలత, ప్రిన్సిపల్

## ఏటా ఇంతేనా.. కల్వర్టుల నిర్మాణం కలేనా..!

మండపేట: కోనసీమలో కీలకమైన మండపేట-ద్వారపూడి రహదారి నిర్మాణం పూర్తయి రెండేళ్లు గడిచినా కల్వర్టుల నిర్మాణంలో మాత్రం అధికారులు తాత్సారం చేస్తున్నారు. రూ.25 కోట్లతో ద్వారపూడి నుంచి తాపేశ్వరం, మండపేట, రామచంద్రపురం, ద్రాక్షారామ మీదుగా వేగాయంపేట వరకు ఈ పనులను 2022లో గుత్తేదారుకు అప్పగించారు. నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగినా 2024 ఎన్నికల ముందు పూర్తి చేశారు. అయితే మధ్యలో 6 ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణం వదిలేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ముందు ఆదరాబాదరాగా రహదారికి ప్రారంభోత్సవం చేశారు. కల్వర్టులు నిర్మాణం చేయడానికి క్లోజరు సమయం అనుకూలం. ఇవి లేకపోవడం వల్ల ఇప్పటికీ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే రెండు క్లోజరు సమయాలు దాటిపోగా ప్రస్తుతం పంట కాలువలు కట్టేసి 10 రోజులు దాటింది. ఈపాటికే సరంజామా తెచ్చి పనులు చేపట్టాల్సి ఉండగా అటువంటి సన్నాహాలు మాత్రం కనపడటంలేదు. జూన్ 1వ తేదీ కల్లా పంట కాలువలు వదిలే అవకాశం ఉన్నందున ఈ క్లోజరు సమయానికైనా పూర్తవుతుందో లేదోనని ప్రజలు విమర్శిస్తున్నారు.

బకాయిలు చెల్లించాలి: గుత్తేదారుకు గతంలో చేసిన పనికి సంబంధించి రూ.9 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. కనీసం రూ.కోటి చెల్లిస్తే కల్వర్టు పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
కె.సూర్యనారాయణ, డీఈ, ర.భ శాఖ, మండపేట

# మెరక చూడలేదు.. మరక తేల్చలేదు



అనకాపల్లి : పేదల ఇళ్లస్థలాల పేరుచెప్పి గత వైకాపా ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో మెరక ముసుగులో కొందరు నేతలు నిధులు మేసేశారు. కొండ దిగువన, లోతట్టు ప్రాంతాల్లో స్థలాలు ఇవ్వడంతో వాటిని చదును చేసే క్రమంలో రూ. లక్షలు చక్కబెట్టేశారు. ఈ అక్రమాలను వెలికి తీయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించినా అధికారుల్లో మాత్రం చలనం ఉండడం లేదు. కాలనీల్లో చేసిన మెరక తొలగింపు, చదును పనుల్లో నాణ్యత నిగ్గుతేల్చాలని రెండు నెలల క్రితమే కలెక్టర్ చెప్పినా సంబంధిత శాఖలు ఆ వంక కన్నెత్తి కూడా చూడలేదు.

అనకాపల్లి జిల్లాలో 347, విశాఖ జిల్లాలో 23 లేఅవుట్లలో ఉపాధిహామీ నిధులతో పనులు చేశారు. సుమారు రూ .7 కోట్ల అంచనా విలువతో ఈ పనులు చేయగా అందులో రూ. 1.87 కోట్ల బిల్లులు చెల్లించేశారు. ఎం-బుక్‌ల ప్రకారం ఇంకా రూ. కోటి పైనా చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లులు చేయించుకునేందుకు వైకాపా నేతలు ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే చెల్లించిన మొత్తమే ఎక్కువగా భావించిన ప్రభుత్వం.. గ్రామీణ నీటి సరఫరా, గృహనిర్మాణ సంస్థ, ఉపాధి హామీ నాణ్యత విభాగం అధికారుల బృందాలతో విచారణకు ఆదేశించింది. వీరు ప్రతి లేఅవుట్‌కు వెళ్లి నిజంగా గ్రావెల్‌తో చదును చేశారా.? ఎం-బుక్‌లో రికార్డు మేరకు పని జరిగిందా.? ఈ గ్రావెల్‌ను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు.? నిబంధనల ప్రకారం బిల్లులు చెల్లించారా.? అనే అంశాలను పరిశీలించాలి. గుత్తేదారులకు చెల్లించాల్సిన ఉన్నా.. అవకతవకలు జరిగినట్లు గుర్తించినా వాటిపై తుది నివేదికను ప్రభుత్వానికి అప్పగించాలి. మిగతా జిల్లాల్లో ఈ ప్రక్రియ తుదిదశకు చేరుకుంటే అనకాపల్లి, విశాఖ జిల్లాలో ఈ బృందాలు ఇంకా కాలనీల్లో అడుగు పెట్టకపోవడం గమనార్హం.

**కాలనీల పనుల్లో కనికట్టు ...** ఉపాధి పథకం నిధులతో కొన్నిచోట్ల పనులు చేయకుండా చేసినట్లు, ఇంకొన్ని చోట్ల చేసిన తక్కువ పనిని ఎక్కువగా చూపించి ఎం-బుక్‌ల్లో కొలతలు నమోదు చేయించి కనికట్టుకు పాల్పడ్డారు. ఎన్నికల ముందు హడావుడి పనులు చేసి సొమ్ము చేసుకుందామనుకున్నా అప్పట్లో బిల్లులు అవ్వలేదు. మరలా వైకాపా సర్కారు రాకపోతుందా బిల్లులు చేసుకోలేకపోతామా అన్న ధీమాతో ఉండేవారు. కూటమి సర్కారు వచ్చాక బకాయిలు పేరుతో కోర్టులను ఆశ్రయించగా ప్రభుత్వమే ఈ పనుల తీరుపై విచారణకు ఆదేశించడంతో నాటి అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని వైకాపా నేతలు ఆందోళన చెందుతున్నారు.

**ఇదీ శాఖల తీరు..**

జగనన్న కాలనీల్లో పనుల నాణ్యతను పరిశీలించే బృందంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఉన్నారు కదా.. తనిఖీలు ఎంతవరకు వచ్చాయని ఆ శాఖ ఈఈ రామస్వామిని అడిగితే అబ్బే వేసవి కార్యాచరణ ప్రణాళికలో మా వాళ్లంతా బిజీగా ఉన్నారు. అందుకే కాలనీలకు వెళ్లలేదు. తర్వాత చూస్తాం అని చెప్పారు.

గృహనిర్మాణ సంస్థ జిల్లా హెడ్ శ్రీనివాసరావు వద్ద కాలనీల్లో తనిఖీల గురించి ప్రస్తావిస్తే వాటిపై మాకు ఎలాంటి సమాచారం లేదు. ఒకవేళ మండలస్థాయిలో కమిటీలు వేశారేమో కనుక్కుంటాననడం గమనార్హం.

ఉపాధిహామీ పథకం సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి (ఎస్‌సీక్యూఓ) శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా కమిటీలు వేశారు గాని ఇంకా క్షేత్రస్థాయికి వెళ్లలేదు త్వరలో వెళ్తామని చెప్పారు.

డ్వామా పీడీ పూర్ణిమాదేవి వద్ద ప్రస్తావించగా మరోసారి సంబంధిత శాఖలతో మాట్లాడి త్వరితగతిన ఈ తనిఖీలు పూర్తి చేయిస్తామని చెప్పారు. ప్రభుత్వం ఆదేశించిన విచారణ విషయంలో ఒక్కోశాఖ తీరు ఒక్కోలా ఉంటే వీరు అక్రమాలను ఎలా వెలికితీస్తారో చూడాలి మరి.

# ఆయకట్టు.. నీరందితే ఒట్టు



అనంతపురం : హెచ్చెల్సీ ఆయకట్టు భూములకు సాగునీరు అందించే బ్రాంచి కాలువల్లో డ్రాపులు, తూములు దెబ్బతిన్నాయి. కంపచెట్లు నిండిపోవడంతో నీరు పారడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హెచ్చెల్సీ పరిధిలో 35,700 ఎకరాల ఆయకట్టు ఉంది. 15 బ్రాంచి కాలువలు ఉన్నాయి. సాగునీరు అందక ఆలస్యంగా వరి నాట్లు వేయడంతో పంటలు దెబ్బతింటున్నాయి.

**గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం**

ఆయకట్టుకు సాగునీరు అందించే బ్రాంచి కాలువలను గత ప్రభుత్వం మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఫలితంగా బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, విడపనకల్లు మండలాల్లోని బ్రాంచి కాలువల దుస్థితి దయనీయంగా మారింది. డ్రాపులు, తూములు కూలినా మరమ్మతులు జరగలేదు.

కణేకల్లు సబ్‌డివిజన్ పరిధిలోని 1, 9, 1ఆర్, 2ఆర్, 2ఏ, 2 బ్రాంచి కాలువలు దెబ్బతిన్నాయి. 1, 1ఆర్, 2ఆర్ బ్రాంచి కాలువల పరిధిలో 10 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. పూడిక నిండటం, కంపచెట్లు పెరిగిపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు.

హరేసముద్రం, ఉద్దేహాళ్, బండూరు గ్రామాల పరిధిలోని ఆయకట్టుకు ఆలస్యంగా నీరు అందుతుంది. దేవగిరి, హరేసముద్రం, బొమ్మనహాళ్ గ్రామాల్లో వేల ఎకరాలకు సకాలంలో నీరందక అవస్థలు పడుతున్నారు. 9వ బ్రాంచి కాలువ పరిధిలోని దర్గాహొన్నూరు, గోవిందవాడ, కల్‌హొళ, కల్లుదేవనహళ్లి, బొల్లనగుడ్డం, తారకాపురం గ్రామాల పరిధిలోని 9,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇక్కడ కూడా పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారులు ఏమన్నారంటే..: పూడికతో నిండిన బ్రాంచి, పంట కాలువలు, కంపచెట్లను తొలగించడానికి ఉపాధి హామీ పథకం కింద ప్రతిపాదనలు పంపుతామని ఎస్ఈ రాజశేఖర్, డీఈఈ మద్దిలేటి తెలిపారు.

**అర్ధాంతరంగా ఆగిన పనులు**

2009లో హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులకు రూ.450 కోట్లు మంజూరు చేశారు. ఆరు ప్యాకేజీల్లో పనులు ప్రారంభించగా అర్ధాంతరంగా ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒకటో బ్రాంచి తూము వద్ద దెబ్బతిన్న కాలువకు మరమ్మతులు చేశారు. రూ.37 కోట్లతో హెచ్‌ఎల్‌ఎంసీ పరిధిలో కూలిన వంతెనలు, దెబ్బతిన్న అక్విడెక్టులు, లైనింగ్ పనులు చేయడానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు.

# మామిడి తియ్యన.. మార్కెట్టే పుల్లన!


కదిరి : జిల్లాలో మామిడిపండ్ల మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంలేదు. దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. కనీస మద్దతు ధర మాత్రం దక్కకపోవడంతో నష్టపోతున్నారు. జిల్లాలో అత్యధికంగా తలుపులలో 2800, బుక్కపట్నంలో 2500 హెక్టార్లలో సాగులో ఉంది. పండిన కాయలను విక్రయించేందుకు అందుబాటులో మార్కెట్ లేకపోవడంతో బెంగళూరుకు తీసుకెళున్నారు. ప్రస్తుతం అక్కడి మార్కెట్‌లో బేనీషా టన్నుకు రూ.50 వేలు, మల్లిక రూ.70 వేలు, బాదామి, కేసరి రకాలు రూ.90 వేలు, హిమయత్ రూ.1.20 లక్షలు ధర ఉంది.

**అద్దె.. తరుగు.. కమీషన్**

బెంగళూరుకు తీసుకెళ్లాలంటే టన్నుకు రూ.4 వేలు వాహన అద్దె, మార్కెట్ తరుగు కింద వంద కిలోలు, వ్యాపారి కమీషన్ రూ.5 వేలు, కాయలు కోసేందుకు రూ.1800, లోడింగ్, అన్‌లోడింగ్‌లకు రూ.4 వేలు చెల్లించాల్సి ఉంది.

బొలెరో వాహనంలో రెండున్నర టన్నుల బేనీషా తీసుకెళితే రైతుకు మొత్తం రూ.37,250 ఖర్చు వస్తుంది. అదనంగా 250 కిలోలు తరుగు కింద తీసేస్తారు. బెంగళూరు మార్కెట్ ధర ప్రకారం ఖర్చు పోను రూ.87,750 వస్తుంది. దీంతో గిట్టుబాటు కావడం లేదు.

జిల్లా : శ్రీసత్యసాయి
మామిడి సాగు : 19 వేల హెక్టార్లు
దిగుబడి : 1.50 లక్షల టన్నులు
ఎకరాకు రూ.80 వేల ఖర్చు
ఈశ్వరప్ప, రైతు



మూడెకరాల్లో బేనీషా, బాదామి, హిమయత్ రకం సాగు చేశాను. ఎకరాకు రూ.80 వేల ఖర్చు చేస్తున్నాను. రవాణా, కమీషన్ ఖర్చులతో నష్టపోవాల్సి వస్తోంది. స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పిస్తే 2.5 టన్నులకు రూ.20 వేలు మిగులుతుంది.

**ప్రయత్నాలు చేస్తున్నాం..**నరసింహమూర్తి, మార్కెటింగ్ ఏడీ

దిగుబడిని దృష్టిలో పెట్టుకుని మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. రైతుల సమస్య, సరకు నిల్వ కోసం శీతల గిడ్డంగుల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

## చెల్లింపుల్లో చేతివాటానికి అడ్డుకట్ట

రాజమహేంద్రవరం: స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ)లోని సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి వంటి రుణాలతో వారి ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం చేయూత అందిస్తోంది. ఎస్‌హెచ్‌జీ సభ్యులు పొందిన రుణాలకు సంబంధించి తిరిగి వాయిదాలు చెల్లింపు సమయంలో అవకతవకలు, మోసాలు జరుగుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. స్త్రీ నిధి రుణాలు పొందిన లబ్ధిదారులు ప్రతినెలా ఎవరికివారే నగదు రహితంగా వాయిదా చెల్లింపులు జరిపేలా త్వరలో ప్రత్యేక పేమెంట్ యాప్ అందుబాటులోకి తీసుకురానుంది.

జిల్లాలోని ఎస్‌హెచ్‌సీ సభ్యులకు స్త్రీనిధి రుణాలు గత ఆర్థిక సంవత్సరంలో కంటే ఈసారి ఎక్కువ మొత్తంలో మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రూ.212 కోట్లు స్త్రీనిధి రుణ లక్ష్యంగా నిర్ణయించగా ప్రస్తుత నెలకు సంబంధించి గత నాలుగు రోజుల్లోనే రూ.కోటి రుణాలు మంజూరు చేసినట్లు స్త్రీనిధి జిల్లా అసిస్టెంట్ మేనేజర్(ఏజీఎం) ధర్మేంద్ర చెబుతున్నారు. ఆయా ఎస్‌హెచ్‌జీలోని సభ్యుల అవసరాన్ని బట్టి ఒక్కొక్క సభ్యురాలికి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు స్త్రీనిధి రుణాలు అందిస్తున్నారు. ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంట్, ఇతర ఛార్జీలు ఏమీ లేకుండా అందిస్తున్న ఈ



రుణాలు రూ.50 వేల వరకు అయితే 24 వాయిదాల్లో, దాటితే 36 వాయిదాల్లో తిరిగి బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది.

**ఇదీ ప్రయోజనం**

స్త్రీనిధి ప్రత్యేక పేమెంట్ యాప్‌తో ఎస్‌హెచ్‌జీ సభ్యులు నెలవారీ వాయిదాలు నగదు రహితంగా ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చు. చెల్లింపు జరిపిన తర్వాత చరవాణికి వెంటనే సంక్షిప్త సందేశం వస్తుంది. వాయిదా సొమ్ము మధ్యలో ఎవరూ స్వాహా చేసే పరిస్థితి ఉండదు. ప్రస్తుతం జిల్లాలో స్త్రీనిధి రుణ వాయిదాల చెల్లింపులు పేటీఎం ద్వారా జరుగుతున్నాయని, ప్రభుత్వం త్వరలోనే యాప్‌ను అందుబాటులోకి తీసుకురానుందని స్త్రీనిధి ఏజీఎం ధర్మేంద్ర చెబుతున్నారు.

## నల్లమల చూసొద్దాం రండి

ఆత్మకూరు : తూర్పు కనుమల్లో నల్లమల కొండలు విస్తరించి ఉన్నాయి. మొత్తం విస్తీర్ణం 5,947 చ.కి.మీలు కాగా ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల్లో 3,040.74 చ.కి.మీల మేర రాజీవ్ గాంధీ పులుల అభయారణ్యం విస్తరించి ఉంది. దీనికి నాగార్జున సాగర్ శ్రీశైలం పులుల అభయారణ్యం అని మరో పేరు కూడా ఉంది. పిల్లలకు వేసవి సెలవులు మొదలయ్యాయి. విహార యాత్రతో పాటు విజ్ఞానం పొందాలనుకునే వారికి నల్లమల అటవీ ప్రాంతం ఆహ్వానం పలుకుతోంది. వినోదంతో పాటు విజ్ఞానాన్ని సొంతం చేసుకోవచ్చు. మరి ఆ విశేషాలేంటో తెలుసుకుందామా..

**జీవ పరిణామ క్రమం**సున్నిపెంట బయో డైవర్సిటీకి ఎదురుగా ఎనిమిది హెక్టార్లలో ఎకలాజికల్ నాలెడ్జ్ పార్కును ఏర్పాటు చేశారు. జురాసిక్ యుగం నుంచి భూమి పుట్టుక, జీవపరిణామ క్రమం వరకు కాలక్రమేణా సంక్రమించిన మార్పులపై అవగాహన కలిగేలా ఇక్కడ 53 బొమ్మలు ప్రదర్శించారు. పర్యాటకుల అవసరమైన సౌకర్యాలు సైతం కల్పించారు.

**ఔషధాల ఖిల్లా**నల్లమల అటవీ ప్రాంతంలో వేలాది ఔషధ మొక్కలున్నాయి. సున్నిపెంట జీవ వైవిధ్య కేంద్రం పరిధిలో అరుదైన, ఔషధ గుణాలున్న 353 జాతుల ప్రాధాన్యం గుర్తించి వివరించారు. రోళ్లపెంట నుంచి పెచ్చెర్వుగూడేనికి వెళ్లే దారిలో వనమూలికల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒకే చోట 70-80 జాతుల ఔషధ మొక్కలు ఉండటం విశేషం. విహారానికి విచ్చేసే పర్యాటకులు వాటి గురించి తెలుసుకోవచ్చు.

**జీవ వైవిధ్యంపై పరిశోధన**



నల్లమల జీవజాలాన్ని భవిష్యత్తు తరాలకు పరిచయం చేసేందుకు 2001 డిసెంబరు 8న శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ కేంద్రంగా జీవవైవిధ్య పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో 303 రకాల క్షీరదాలు, 80 రకాల పాములు, 102 రకాల సీతాకోక చిలుకలు, 55 రకాల చేపలు, 25 లాంబాలు, 18 కప్పలు, 54 రకాల సరీసృపాలు, 57 రకాల మాత్‌లు, 77 రకాల కీటకాల వివరాలు లభిస్తాయి. ప్రపంచంలోనే వైవిధ్య భరితమైన సాలెపురుగును ఇక్కడ చూడొచ్చు. అప్పట్లో బతికున్న సాలె పురుగుకు బయోడైవర్సిటీలో ప్రత్యేక ఆవాసం కల్పించారు. అది చనిపోయాక భద్రపరిచారు.

**మరికొన్ని విశేషాలు**

దేశంలోని పులుల అభయారణ్యంలో నల్లమల అతి పెద్ద పులుల అభయారణ్యంగా ప్రసిద్ధి గాంచింది. 2024 గణన ప్రకారం నల్లమలలో 87 పులులున్నట్లు ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జున సాగర్-శ్రీశైలం ప్రాజెక్ట్) నిర్ధారించింది. జంగిల్ సఫారీలో వెళ్లే పర్యాటకులకు అప్పుడప్పుడు పులులు తారసపడిన ఘటనలూ ఉన్నాయి.

జాలువారే కృష్ణమ్మ అందాలను ఈ ప్రాంతంలో తిలకించొచ్చు. కృష్ణానది మొత్తం పొడవు 1400 కి.మీలు. నల్లమల ఉత్తర దక్షిణ దిశల్లో 90 మైళ్లు విస్తరించి ఉంది. నల్లమలలోని బైరాని కొండల ఎత్తు 1106 మీటర్లు. నల్లమల విహారానికి విచ్చేసే పర్యాటకులు జంగిల్ క్యాంప్‌లో విడిది చేసేందుకు ఆన్‌లైన్‌లో %nstr.co.in% వెబ్‌సైట్‌లో లాగిన్‌తో బుక్ చేసుకోవచ్చు. పర్యాటకుల సౌకర్యార్థం బైర్లూటిలో 4 కాటేజీలు, 6 టెంట్లు, పచ్చర్లలో 4 కాటేజీలు, 2 టెంట్లు ఏర్పాటు చేశారు. ఒక రోజు విడిదికి రూ.7వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఉదయం 12 నుంచి మరుసటి రోజు ఉదయం 12 వరకు ఇక్కడ ఉండవచ్చు. కేవలం సఫారీ చేసే వారు ఒకసారి వాహనానికి (10 మందికి) రూ.3 వేలు చెల్లించాలి. %www.nstr% లో లాగిన్ అయితే వీటి వివరాలు చూడొచ్చు. ఇక్కడ విహరించేందుకు వాహన సౌకర్యం, ఆరగించేందుకు భోజన సౌకర్యం ఉంటుంది. శ్రీశైలంలో చెంచుల జీవన విధానం వివరించే మ్యూజియం ఉంటుంది. ఆది మానవుల కాలం నుంచి చెంచుల జీవన విధానాన్ని బొమ్మలతో ఏర్పాటు చేశారు.

# నకిలీలు.. నాటకాలు

ఒంగోలు: గత వైకాపా హయాంలో పింఛనుదారుల ఎంపికలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం తనిఖీలు చేయిస్తోంది. మూత్రపిండాల వ్యాధి ఉందంటూ పింఛను పొందుతున్న వారిని గతేడాది డిసెంబరులో తనిఖీ చేయగా.. 415 మంది అనర్హులుగా తేలారు. పక్షవాతం, అనారోగ్యంతో పూర్తిగా మంచానికే పరిమితమై రూ.15 వేల పింఛను పొందుతున్న వారికి సంబంధించి వైద్య బృందం జనవరిలో నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రత్యక్షంగా పరీక్షించింది. 69 శాతం మంది అనర్హులున్నారని, వారిలోనూ 32 శాతం మంది రూ.ఆరు వేల దివ్యాంగ పింఛను పొందడానికి వీలుందని గుర్తించింది. ప్రస్తుతం దివ్యాంగ పింఛను పొందుతున్న వారిని పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా కొందరు నకిలీలు నాటకాలకు తెర లేపారు. వీరిని గుర్తించడం వైద్యులకు ఇప్పుడు కత్తిమీద సాములా మారింది.

**ముందుగానే నోటీసులు:** జనవరిలో రూ.6 వేల పింఛను పొందిన దివ్యాంగుల్లో అర్హుల గుర్తింపునకు వారానికి మూడు రోజులు(బుధ, గురు, శుక్రవారం) శిబిరాలు నిర్వహిస్తున్నారు. చీమకుర్తి, గిద్దలూరు, కొండపి, దర్శి, యర్రగొండపాలెం(శారీరక వైకల్యం), ఒంగోలు, మార్కాపురం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల(అంధులు, బధిరులు, మానసిక ఆరోగ్యం, వైకల్యం)లో ప్రత్యక్షంగా చూసి, ధ్రువపత్రాలు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రోజూ ఒక్కో విభాగానికి సంబంధించి 40 మందిని పరీక్షిస్తున్నారు. వీరు శిబిరానికి హాజరు



కావడానికి వీలుగా సెర్ప్ సిబ్బంది ద్వారా ముందే నోటీసులు అందిస్తున్నారు.

**తల పట్టుకుంటున్న వైద్యులు:** రూ. 15 వేల పింఛను పొందుతున్న వారిలో అనర్హులను గుర్తించడంలో వైద్యులకు పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు. వారిలో ఆరోగ్యంగా ఉండి సైకిల్ తొక్కేవారు, ట్రాక్టర్ నడిపేవారు, కిరాణ దుకాణం నిర్వాహకులు, పరుగెత్తే వారూ ఉన్నట్లు సులువుగానే గుర్తించారు. దివ్యాంగ పింఛనుదారుల్లో నకిలీలను గుర్తించడం మాత్రం కష్టంగా మారింది. 'ఒంగోలు రిమ్స్ ఆసుపత్రి గేటు వద్ద ఆటో దిగిన ఓ వ్యక్తి నడుచుకుంటూ లోపలికి వెళ్లాడు. మెట్లూ ఎక్కాడు. వైద్యుడు పరిశీలించే సమయానికి నడలేకపోతున్నానని, చేతులు కదలవంటూ నటించాడు. దీంతో వైద్యులు విస్తుపోయారు. బధిర పింఛనుదారుల్లో ఆరోగ్యవంతులు కూడా తమకు వినిపించడం లేదని, అంధ పింఛనుదారుల్లో కొందరికి చూపు బాగున్నా కనిపించడం లేదని చెబుతుండటంతో వైద్యులు తల పట్టుకుంటున్నారు. 'ఆగస్టు వరకు దివ్యాంగుల పరిశీలన కొనసాగే అవకాశం ఉంద'ని డీసీహెచ్ఎస్ సూరిబాబు తెలిపారు. దివ్యాంగులను ఒక వైద్యుడు పరిశీలిస్తే.. మరో ఇద్దరు స్క్రూటినీ చేస్తున్నారని, వారందరి నివేదికల ఆధారంగా కంప్యూటర్‌లో వైకల్యం నమోదు అవుతుందని వివరించారు.

# ఏం కావాలన్నా.. ఇచ్చేస్తారు!

భీమవరం : తణుకుకు చెందిన నాగమ్మ కీళ్లనొప్పులతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంది. 15 రోజులకు మాత్రలు సూచించారు. కోర్సు పూర్తయినా నేరుగా ఔషధ దుకాణానికి వెళ్లి మందుల అట్ట చూపించి మందులు తెచ్చుకుని వాడింది. ఫలితంగా మరిన్ని అనారోగ్య సమస్యలు తలెత్తాయి.
భీమవరానికి చెందిన శ్రీకాంత్ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. జలుబు, దగ్గు, జ్వరం.. ఇలా ఏదొచ్చినా యాంటీబయోటిక్స్ వాడేస్తున్నారు. ఈ క్రమంలో నోటిపూత వచ్చి ఏమీ తినలేకపోవడంతోపాటు శరీరంలో రక్తకణాల సంఖ్య తగ్గిపోయింది. వైద్యుడి వద్దకెళ్లి చూపిస్తే.. అతిగా మాత్రలు తీసుకోవడం వల్లే ఇలా అయ్యిందని తేలింది. ఉభయ జిల్లాల్లోని మందుల దుకాణాల్లో మత్తు కలిగించే ఔషధాలను సైతం యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. యాంటీ డిప్రెషన్, యాంటీ అలర్జీ, అధిక మోతాదు నొప్పి నివారణ మాత్రలు, దగ్గు ద్రావణాలను కచ్చితంగా వైద్యుల చీటీ ఉంటేనే విక్రయించాల్సి ఉండగా, దుకాణాల నిర్వాహకులు అవేమీ పట్టించుకోవడం లేదు. చాలా దుకాణాల్లో అర్హులైన ఫార్మాసిస్టులే లేరని కొందరు వైద్యులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ గరుడలోనూ దీన్ని గుర్తించారు. కాలపరిమితి ముగిసిన మందులు సైతం అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.



ఆర్ఎంపీలతో కుమ్మక్కై గ్రామీణ రోగులకు ఈ ఔషధాలు అంటగడుతూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.
కొరవడిన పర్యవేక్షణ.. పారాసెటమాల్, డైసైక్లోమైన్, ట్రెమడాల్ సమ్మిళిత ఔషధాన్ని తీవ్రమైన నొప్పి నివారణకు వైద్యులు సూచిస్తుంటారు. ట్రెమడాల్ అనే ఔషధం ఓపియాయిడ్స్ అనే మాదక ద్రవ్యాల జాబితాకు చెందింది. మెదడులోని నోర్‌పైన్‌ఫ్రెన్, సెరోటోనిన్‌పై పనిచేసి నొప్పిని తెలియనివ్వదు. మత్తుకోసం యువత ఇలాంటి మందులను కొన్ని దుకాణదారులతో లాలూచీ పడి కొనుగోలు చేస్తున్నారని తెలిసింది. పెరుగుతున్న కిడ్నీ బాధితులు.. నొప్పి నివారణ మాత్రలు ఎక్కువగా వినియోగించడంతో మూత్రపిండ బాధితులు పెరుగుతున్నారని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో అధికారికంగా 498 మంది ఉండగా అనధికారికంగా మరో వెయ్యి మంది వరకు ఉంటారు. అధిక మోతాదులో ఔషధాలు వాడటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మందుల చీటీ లేకుండా విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తణుకు ఔషధ నియంత్రణాధికారి మల్లికార్జునరావు తెలిపారు.
డివిజన్ల వారీగా జిల్లాలో మందుల దుకాణాలు
నరసాపురం 800 భీమవరం 600

# నగరాన్ని గాలికొదిలేసి..



విశాఖపట్నం: విశాఖ మహా నగరపాలక సంస్థ(జీవీఎంసీ)కి ప్రస్తుతం కమిషనర్ లేరు. ఇలాంటి సమయంలో మేయర్‌గా ఉన్న గొలగాని హరి వెంకట కుమారి కీలకంగా వ్యవహరించాల్సి ఉంది. ఉదయం నగరంలో వార్డులు, కాలనీలు సందర్శించి పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలపై ఆరా తీసి సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత ఉంది. అలాంటి సమయంలో జీవీఎంసీని గాలికొదిలేసి మేయర్, డిప్యూటీ మేయర్‌తో సహా కొంత మంది కార్పొరేటర్లతో వైకాపా క్యాంపు రాజకీయాలకు తెరలేపడం గమనార్హం.

**అటకెక్కిన పారిశుద్ధ్యం:** రెండు నెలల క్రితం కమిషనర్ సంపత్‌కుమార్ బదిలీ అయిన తర్వాత నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కమిషనర్ ఉన్న సమయంలో మేయర్‌తో కలిసి నిత్యం ఉదయం 5-7గంటల వరకు క్షేత్రస్థాయిలో వార్డు, కాలనీలు సందర్శించేవారు. పారిశుద్ధ్య కార్మికుల బయోమెట్రిక్ తనిఖీలు, గెడ్డలు, కాల్వలు అధ్వానంగా ఉన్నచోట పరిశీలించి పరిష్కారం చేసేవారు. ఈ సమయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జోన్ సహాయ వైద్యాధికారి పర్యటనలో ఉండేవారు. ఇప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఏ అధికారీ వెళ్లడం లేదు. కమిషనర్, మేయర్ ఇద్దరూ అందుబాటులో లేకపోవడంతో నగరంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఒకవైపు స్వచ్ఛసర్వేక్షన్-2025కు ర్యాంకు ఇవ్వడానికి కేంద్రం ప్రభుత్వం పంపిన ప్రత్యేక బృందం సర్వే చేస్తుండగా, ఈ సమయంలోనూ పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో నగర ర్యాంకుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

**ఆగమేఘాలపై అందుకే.. :** జీవీఎంసీ బడ్జెట్ రూ.4,601 కోట్లకు పాలకవర్గం ఆమోదించింది. వాస్తవానికి ఈ బడ్జెట్ ఆమోదానికి మేయర్ అందుబాటులో లేకపోతే, కోరం 33 మంది సభ్యులలో ఒకరిని తాత్కాలిక మేయర్‌గా ఎన్నుకుని బడ్జెట్ ఆమోదం చేసుకునే అవకాశం ఉంది. ఈ విషయం తెలుసుకున్న మేయర్, డిప్యూటీ మేయర్లు ఆగమేఘాలపై బెంగళూరు శిబిరం నుంచి వచ్చారు తప్ప, నగర ప్రజలపై ఎలాంటి ప్రేమ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నేడో, రేపో తిరిగి మళ్లీ ఈ ఇద్దరూ వైకాపా శిబిరానికి వెళ్లనున్నారు.


**హడావుడి శిబిరం ఎందుకో?:** మేయర్‌పై అవిశ్వాసం పెట్టడానికి అవసరమైన సంఖ్యా బలం దగ్గరకు కూటమి వచ్చే వరకు ఉండి, ఆ తర్వాత ఆగమేఘాలపై వైకాపా క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. మొత్తం 111లో కూటమికి 73, సీపీఐ, సీపీఎం కలిపి రెండు ఉండగా, వైకాపాకు ఎక్స్‌అఫియో మెంబర్లతో కలుపుకొని బలం 36 ఉంది. ఇందులో బెంగళూరు శిబిరానికి వెళ్లింది 27 మంది మాత్రమే. శిబిరంలో ఉన్న ఈ 27 మందిలో కొందరు కూటమి పార్టీ నేతలతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. **డిప్యూటీ మేయర్లపైనా అవిశ్వాసం:** మేయర్‌పై అవిశ్వాసం పెట్టి కలెక్టర్‌ను కలిసిన కూటమి నేతలు తాజాగా డిప్యూటీ మేయర్లపైనా అవిశ్వాసానికి అడుగులు వేస్తున్నారు. వైకాపాకు చెందిన డిప్యూటీ మేయర్లు సతీష్, శ్రీధర్‌లపై అవిశ్వాసం పెట్టేందుకు సంతకాలు సేకరిస్తున్నారు. త్వరలో జిల్లా కలెక్టర్‌కు లేఖ సమర్పించే అవకాశం ఉంది. ఈ పదవులకు కూటమిలో కొందరు పోటీ పడుతున్నారు. శాసన సభ్యులు సామాజికవర్గాల వారీగా కొందరు కార్పొరేటర్లను సిఫార్సు చేస్తున్నట్లు సమాచారం.

# సర్పానదిలో కాలనాగులు



రావికమతం : సర్పానది పరివాహక ప్రాంతం సాగు భూమిగా మారుతోంది. వరి, చెరకు, అరటి, కూరగాయలతోపాటు సరుగుడు తోటలు సాగు చేస్తున్నారు. నదిలో ఆక్రమణలు పెరుగుతున్నా.. సంబంధిత యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది. ఫలితంగా ఒకప్పుడు విశాలంగా ఉన్న పరివాహక ప్రాంతం క్రమేణా కుంచించుకుపోయింది. నది గర్భం కొండగెడ్డ, కాలువలా కనిపిస్తోంది.
తూర్పు కనుమల్లోని చింతపల్లి, జి.మాడుగుల అటవీ ప్రాంతం నుంచి రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మీదుగా సుమారు 50 కి.మీ. దూరం ప్రవహించి కోటవురట్ల మండలం వద్ద వరహా నదిలో కలుస్తుంది. కల్యాణపులోవ వద్ద మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టు నిర్మించారు. ఈ జలాశయం దిగువన 4484 ఎకరాల ఆయకట్టు ఉంది. రావికమతం మండలం చీమలపాడు మొదలు మాకవరపాలెం వరకు 45 ఎకరాలకుపైగా పరివాహక ప్రాంతం ఆక్రమణలకు గురైంది. పలుచోట్ల నది గట్టు తక్కువ ఎత్తులో ఉండటంతో సరుగుడు, యూకలిప్టస్, వరి, అరటి, చెరకు సాగు చేస్తున్నారు. ధర్మవరం వంతెన వద్ద సరుగుడు తోటలు సాగు చేస్తుండగా, కొత్తకోట వంతెనకు సమీపంలో నది పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఆక్రమణలతో నది కాలువలా మారడం, వరదల సమయంలో ప్రవాహ ఉద్ధృతికి గట్లు కోతకు గురవుతున్నాయి. ఈ విషయాన్ని జలవనరుల శాఖ కొత్తకోట సెక్షన్ ఏఈ సూర్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా.. 'ఇటీవల బదిలీపై వచ్చా. ఆక్రమణలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు లేవు. ఆక్రమణలు గుర్తించేందుకు తహసీల్దారుతో మాట్లాడి జాయింట్ సర్వే చేయించి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తామ'ని చెప్పారు.
వంతెనల చెంతే తవ్వకాలు... నది పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి పంటలు, తోటలు సాగు చేయడమే కాకుండా ఇసుక అక్రమ తవ్వకాలూ యథేచ్ఛగా జరుగుతున్నాయి. ధర్మవరం సమీపంలో ఇసుక తవ్వకాలు జాతరను తలపిస్తున్నాయి. ట్రాక్టర్లు, ఎడ్లబళ్లపై తరలిస్తున్నారు. కన్నంపేట వద్ద కొత్తకోటకు చెందిన కొందరు రోజూ 15 నుంచి 20 వరకు టైరు బళ్లు, ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేస్తున్నారు.

# కోడి.. ధర పరుగిడి..!



నక్కపల్లి : రెండు నెలలుగా కుదుపునకు లోనైన కోడి ధర పౌల్ట్రీ రైతుల మోముపై మళ్లీ ఇన్నాళ్లకు చిరునవ్వు తెచ్చింది. కొత్త అమావాస్య ప్రభావంతో కేజీ రూ.230కు చేరింది. జిల్లాలో 400 వరకు పౌల్ట్రీలు ఉండగా, లక్షల కోళ్ల ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో స్థానిక అవసరాలు పోనూ, మిగిలినవి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. సంక్రాంతి సమయంలో దాదాపు కేజీ రూ. 250 పలికిన ధర ఆ తర్వాత బర్డ్‌ఫ్లూ ప్రభావంతో కొద్దిరోజులకే ధర పతనమైంది. స్థానికంగా వ్యాధి లేకపోయినా, వదంతులతో కొనుగోలుదారులు వెనుకాడటంతో అమ్మకాలు తగ్గిపోయాయి. దీంతోపాటే ధరలు పడిపోయాయి. ఫలితంగా కేజీ రూ. 150లకు వచ్చేసింది. దాదాపు నెలరోజులు ఇదే పరిస్థితి కొనసాగగా.. రైతుల పరిస్థితి చూసి ప్రభుత్వం, పౌల్ట్రీ యాజమాన్యాలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాయి. ఇది కాస్త అనుకూల మార్పును తెచ్చింది. మార్చి మొదటి వారానికి పరిస్థితి కాస్త కుదుటపడింది. ఫలితంగా రెండు నెలల తర్వాత కిలో మాంసం రూ. 200కు చేరింది. ఇది కేవలం వారం రోజులు మాత్రమే నిలిచింది. తర్వాత కోళ్ల ఉత్పత్తి అధికం కావడం.. డిమాండ్ తగ్గడంతో మరోసారి ధర నేల చూపులు చూసింది. అయినా పౌల్ట్రీ నిర్వాహకులు నష్టాలు చూస్తూనే ధర కొనసాగించారు. ఈలోగా కొత్త కోళ్ల పెంపకం తాత్కాలికంగా ఆపేసి, ఉన్న సరకును విక్రయించారు.
తాజాగా కొత్త అమావాస్య రావడంతో కోడికి గిరాకీ పెరగడంతో ధర కూడా భారీగా ఎగబాకింది. అయిదు రోజుల కిందట కిలో మాంసం ధర రూ. 190 ఉండగా, రెండు రోజుల కిందట రూ. 200 కు చేరింది. ఇక ఆదివారం నాడు ఏకంగా రూ. 230కి విక్రయించారు. అయినా జనాలు వెనుకాడలేదు. పండగ కావడంతో దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. ప్రస్తుతం ఉన్న ధరతో పౌల్ట్రీ నిర్వాహకులకు కాస్త ఊపిరి వచ్చినట్లయింది. ఈ ధర కొనసాగే అవకాశం కనిపిస్తోంది. మరో రెండు వారాల్లో సముద్రంలో చేపలవేట నిలిచిపోనుంది. దీనికి తోడు రానున్న రోజుల్లో శుభకార్యాలు ఉన్నాయి. అంతేకాకుండా ఎండల తీవ్రత కారణంగా కోళ్లు చనిపోతుంటాయి. ఫలితంగా డిమాండ్‌కు తగిన సరకు లేక ధర నిలకడగా కొనసాగే అవకాశం ఉందని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు.


# మట్టికొట్టుకుపోతున్నారు!

వరదయ్యపాళెం : అధికారుల అలసత్వం మట్టి మాఫియాకు వరంగా మారింది. సత్యవేడు మండలం చెన్నేరి, వానెల్లూరు వద్ద వైకాపా హయాంలో అనుమతులు పొందామంటూ మట్టి తవ్వి పక్క రాష్ట్రానికి తరలిస్తున్నారు. పత్రాలు చూపాలంటే ఎదురుదాడి చేస్తున్నారు. రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తే వాటి గురించి తమకు తెలియదంటున్నారు. భూగర్భ గనుల శాఖను సమాచారం అడిగామని వారి నుంచి సమాధానం వచ్చిన తర్వాత చర్యలకు ఉపక్రమిస్తామని తాత్సారం చేయడం విమర్శలకు తావిస్తోంది. సత్యవేడు మండలం చెన్నేరి, వానెల్లూరు వద్ద ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు నెలరోజులుగా జోరుగా సాగుతున్నాయి. తవ్విన మట్టిని తమిళనాడుకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రశ్నిస్తే తమకు అనుమతులున్నాయంటూ బుకాయిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు చూపాలని కోరుతున్నా, మీరేమైనా అధికారులా.. ఎందుకివ్వాలంటూ ఎదురుదాడి చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇలా నిత్యం వందల వాహనాల్లో తమిళనాడుకు తరలిస్తున్నా, అధికారులు మౌనం దాల్చడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**రహదారులు ఛిద్రం** నిత్యం భారీ మట్టి వాహనాలతో సత్యవేడులోని రహదారులు ఛిద్రమయ్యాయి. ఇటీవల భాజపా నాయకులు సైతం గ్రావెల్ వాహనాలను అడ్డుకుని ఆందోళన చేసినా అధికారులు స్పందించలేదు. ఈ విషయమై తహసీల్దార్ రాజశేఖర్‌ను వివరణ కోరగా గత ప్రభుత్వంలో ఇచ్చిన అనుమతులపై నివేదిక ఇవ్వాలని భూగర్భగనుల శాఖ అధికారులను కోరామన్నారు. వారి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# ఇక్కడ పేరు.. అక్కడ చదువు

పాడేరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి కొన్నిచోట్ల ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారు. పిల్లల పేర్లు మాత్రమే తమ పాఠశాలల్లో చూపిస్తున్నారు.. వారి చదువులు మాత్రం ప్రైవేటు పాఠశాలల్లో సాగించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. నర్సీపట్నం మండలంలో కేబీపాలెం, నగరం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సంధ్య, సూర్యప్రకాశ్‌ల పిల్లలు ప్రైవేటు స్కూళ్లకు పంపించి ప్రభుత్వ పాఠశాలల్లో చూపించడంతో వారిద్దరిపై వేటు వేశారు. చోడవరం మండలంలోనూ కొంతమంది ఉపాధ్యాయులు ఈ తరహా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి చర్యలకు సిద్ధం చేస్తున్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)తో గురువుల లీలలు బయటపడుతున్నాయి. వాటిపై ప్రాథమిక విచారణ చేపట్టి ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఈ తరహా అక్రమాలు చాలానే జరిగినట్లు గుర్తించినా ఆ వివరాలు బయటకు




రాకుండా విద్యాశాఖ అధికారులు గోప్యత పాటిస్తున్నారు. గతేడాది మొదలుపెట్టిన అపార్ నమోదు ఇప్పటికీ పూర్తికాకపోవడానికి విద్యార్థుల లెక్కలు తేలకపోవడం కూడా ఓ కారణమని సంబంధిత అధికారులే చెబుతున్నారు.

**ప్రవేశాల్లో మాయాజాలం..** విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే ఆయా పాఠశాలల్లో పోస్టులు కోతపెడతారని కొంతమంది ఉపాధ్యాయులు ప్రవేశాలను (అడ్మిషన్లు) రికార్డుల్లోనే చూపిస్తున్నారు. వారు బడికి రాకపోయినా హాజరుపట్టీలో మాత్రం వచ్చినట్లే టిక్ పెట్టేటస్తున్నారు. నవోదయ, సైనిక్ పాఠశాలలు, ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకే ఎక్కువ అవకాశం కల్పిస్తుంటారు. దీనికోసం ప్రైవేటు స్కూల్ పిల్లలను కొన్నిచోట్ల సర్కారీ బడుల్లో చదువుతున్నట్లు చూపిస్తున్నారు. అల్లూరి జిల్లాలో మొత్తం 1,97,049 మంది విద్యార్థులున్నారు. వీరిలో 1,55,809 మంది వివరాలు అపార్‌లో నమోదు చేశారు. ఇంకా 41,418 మంది పెండింగ్‌లో ఉన్నారు.

**మిగతా వారిపై దృష్టి..** ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో చదువుతున్న ఒకటో తరగతి నుంచి జూనియర్ కళాశాల విద్యార్థుల వరకు 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్' ఐడీ పేరిట అపార్ నమోదు చేయిస్తోంది. ఒక విద్యార్థి అడ్మిషన్ ఒకే చోట ఉండాలి.. రెండు మూడుచోట్ల చూపడానికి వీల్లేదు. ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసి అపార్ నమోదులో అనధికార విద్యార్థులు వెలుగులోకి వస్తున్నారు. ఈ విషయమై డీఈవో అప్పారావునాయుడు వద్ద ప్రస్తావించగా పరీక్షలు దగ్గర పడడంతో అపార్ నమోదుపై ఒత్తిడి తగ్గించారని, అందుకే ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు. అనధికార విద్యార్థుల వివరాలు కొన్నిచోట్ల వెలుగు చూడగా ఇద్దరిపై చర్యలు తీసుకున్నామని మిగతా వారిపైనా దృష్టిసారించినట్లు చెప్పారు. సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చేందుకు యత్నించగా ఉపాధ్యాయులు అందుబాటులో లేరని ఎంఈవో తలుపులు చెప్పారు.

# పల్లె పయనం.. ఇక పదిలం

నంద్యాల : కొన్నేళ్లుగా నిర్వహణ, మరమ్మతులు కరవై దారుణంగా దెబ్బతిన్న గ్రామీణ రహదారులకు మోక్షం కలుగనుంది. ఇటీవల ఆర్‌అండ్‌బీ రహదారులపై గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం.. తాజాగా పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులపై దృష్టిపెట్టింది. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో ఈ రహదారులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. కొత్త రహదారులు వేయకపోగా.. దెబ్బతిన్న వాటికి మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో చాలా గ్రామాల పరిధిలో రోడ్లు రూపు కోల్పోయాయి. త్వరలో నిధులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సంబంధిత శాఖ అధికారులను ప్రతిపాదనలు పంపాలని ఇటీవల ఆదేశించింది.

**ఐదేళ్లు పట్టించుకోలేదు** జిల్లా పంచాయతీరాజ్‌లో రెండు విభాగాలు ఉన్నాయి. పీఐయూ నుంచి 49 రోడ్లకు ప్రతిపాదనలు పంపారు. 183.01 కి.మీల పొడవున మరమ్మతులకు రూ.68.56 కోట్లతో ప్రతిపాదించారు. పీఆర్ డివిజన్ నుంచి 47 రోడ్లకు 184.94 కి.మీల పొడవున మరమ్మతులు చేసేందుకు రూ.83.06 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇవన్నీ బాగా దెబ్బతిన్న బీటీ రోడ్లే. వీటిని గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించారు. గత ఐదేళ్లలో కనీస నిర్వహణ లేకపోవడంతో ఛిద్రమయ్యాయి. కొన్ని రహదారు లపై పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. మరికొన్ని రహదారులపై తారు కొట్టుకుపోయి కంకర రాళ్లు దర్శనమిస్తున్నాయి. పంట పొలాల మధ్య వేసిన రహదారులు కోతకు గురవడంతో వీటిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

**ఎట్టకేలకు వీటికి మోక్షం**
పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండలంలో ఎనిమిది చోట్ల రహదారులు బాగా దెబ్బతిన్నాయి. ప్రత్యేకించి నంద్యాల- నందికొట్కూరు రోడ్డు నుంచి భోగేశ్వరం రహదారి వరకు 4.17 కి.మీల పొడవున దారి దారుణంగా ఉంది. గని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పైభోగుల రోడ్డు, ఎన్ఎన్ రోడ్డు నుంచి- బిలకలగూడూరు వరకు దారి ఛిద్రమైంది. 6.9 కి.మీ ఉన్న చిందుకూరు- పరమటూరు రోడ్డు కూడా అధ్వానంగా మారింది. మంచాలకట్ట- ఎల్‌కే తండా రహదారి మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. శ్రీశైలం నియోజకవర్గంలోని బండిఆత్మకూరు మండలంలో ఈర్నపాడు- మణికంఠాపురం మధ్య 4 కి.మీ., మణికంఠాపురం- ఓంకారం మధ్య 3.3 కి.మీ., బండిఆత్మకూరు- ఈర్నపాడు మధ్య 11 కి.మీల పొడవున్న రోడ్లను బాగు చేయాలని ప్రతిపాదించారు.
ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మండలం మహదేవపురం నుంచి కె.కొత్తూరు వరకు 2.58 కి.మీలు, బాచపల్లి నుంచి అహోబిలం వరకు 9 కి.మీల ఉన్న రోడ్ల మరమ్మతులకు నిధులు రానున్నాయి.
నంద్యాల మండలంలోని పోలూరు- రాయమాల్పురం, అయ్యలూరు- మసీదుపురం, గోస్పాడు మండలం జిల్లెల్ల- పసురపాడు రోడ్డును మరమ్మతులు చేయనున్నారు.

# స్మార్ట్‌గా నడుపుదాం.. ఇక కొత్త కార్డుల జారీ

పుత్తూరు : పుత్తూరుకు చెందిన వ్యక్తి ఒకరు ఏడాదిన్నర కిందట కారు కొన్నారు. అప్పటి నుంచి ఆర్‌సీ రాలేదు. ఆయన పక్క రాష్ట్రానికి వెళ్లినపుడు పోలీసులు ఆర్‌సీ అడగ్గా తన వద్ద ఉన్న డిజిటల్ పత్రాన్ని చూపారు. ఒరిజినల్ కార్డు లేకుంటే చలానా చెల్లించాలని చెప్పడంతో అవాక్కయ్యాడు. విధిలేని పరిస్థితుల్లో అపరాధ రుసుము చెల్లించారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్(ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్(డీఎల్)లు తీసుకునే వారికి కూటమి ప్రభుత్వం మంచి వార్త చెప్పింది. వైకాపా హయాంలో నిలిపేసిన స్మార్ట్ కార్డులు మళ్లీ అందజేయాలని నిర్ణయం తీసుకోవడంతో వాహన చోదకుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. లైసెన్సులు పొందిన చోదకులు సదరు కార్డులు పొందేందుకు అర్హులని పేర్కొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేల సంఖ్యలో త్వరలో కార్డులు జారీ చేయనున్నారు.

**రెండేళ్లుగా కార్డులు ఇవ్వక..** వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలంటే ఆర్టీవో కార్యాలయంలో వాహన చోదక పరీక్షల్లో ఉ




త్తీర్ణత సాధించాలి. వైకాపా హయాంలో రెండేళ్లుగా డ్రైవింగ్ వాహనా రిజిస్ట్రేషన్ కార్డుల జారీ నిలిపేసింది. వాటికి బదులుగా ఆన్‌లైన్ ద్వారా లైసెన్స్ చూసుకోవచ్చని చెప్పింది. ఈ నిబంధనలు వాహన చోదకులకు ఇబ్బందిగా మారాయి. ప్రమాదాలు జరిగినపుడు బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఇబ్బందులు ఎదుర్కొనేవారు.


**రూ.235 చెల్లిస్తే పోస్టు ద్వారా..** డీఎల్, ఆర్‌సీలకు మళ్లీ స్మార్ట్‌కార్డులు అందజేయనున్న నేపథ్యంలో రవాణాశాఖ నిర్వహించే ఈ-ప్రగతి పరివాహన్ పోర్టల్‌లో నమోదు అవకాశం కల్పించారు. కార్డు ఫీజు రూ.200, పోస్టు ద్వారా పంపడానికి రూ.32, ఇతరత్రా కలిపి రూ.235 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. గతంలో డబ్బులు చెల్లించినా కార్డులు రాలేదని, ఇప్పుడు టెండర్ల ప్రక్రియ నిర్వహించకుండా ఫీజు వసూలు చేయడంపై వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వైకాపా హయాంలో వాహనదారుల నుంచి వసూలు చేసిన సొమ్ము గుత్తేదారుకు ఇవ్వకపోవడంతో సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కచ్చితంగా కార్డులు వచ్చేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

**రుసుము చెల్లిస్తే కార్డులు వస్తాయి..**

ప్రభుత్వం వాహన చోదకులకు డీఎల్ కార్డుల జారీకి ఉత్తర్వులు ఇచ్చింది. రుసుం చెల్లించిన వాహన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు కార్డులు పొందే అవకాశం కల్పించింది. కార్డులు ముద్రణ పూర్తయింది. రుసుం చెల్లించిన వెంటనే కార్డులు తపాలాలో పంపుతున్నారు. చంద్రశేఖర్, మోటారు వాహనాల తనిఖీ అధికారి, పుత్తూరు

# కుప్పంలో అక్రమాలకు ఉపాధి

కుప్పం : వైకాపా హయాంలో 2019 నుంచి 2024 వరకు కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉపాధి హామీ ద్వారా రూ.236 కోట్లు ఖర్చు చేశారు. ఐదేళ్లకు సంబంధించి.. రామకుప్పం మండలంలో అత్యధికంగా రూ.72.65 కోట్లు, కుప్పంలో రూ.63.56 కోట్లు, శాంతిపురంలో రూ.60 కోట్లు, గుడుపల్లెలో రూ.49.80 కోట్లు వ్యయం చేశారు. పులివెందుల తరహాలో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని వైకాపా హయాంలో సాక్షాత్తు నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పారు. ప్రగతి పనులు అటుంచి



అక్రమంగా ఆరగించడంలో మాత్రం దూసుకెళ్లారని తేటతెల్లమవుతోంది. ఈ నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో నిధుల వ్యయంపై జరుగుతున్న విజిలెన్స్ విచారణలో ఈ విషయమే స్పష్టమవుతోంది. స్థానిక తెదేపా నేతలు కూటమి ప్రభుత్వానికి లేఖ రాయగా విచారిస్తున్న అధికారులకు ఈ విషయమే వెల్లడవుతోంది.

**కొవిడ్ సమయంలో అత్యధికంగా..**

ప్రజలను గడగడలాడించిన కరోనా మహమ్మారి (కొవిడ్) కాలంలోనే అత్యధికంగా ఉపాధి నిధులు ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కరోనా తీవ్రతతో జనం చాలా వరకు ఇళ్లకే పరిమితమైన 2020-21 ఆర్థిక సంవత్సరంలో.. నాలుగు మండలాలకు రూ.68.78 కోట్లు ఖర్చు చేశారు. రామకుప్పం మండలంలో రూ.20.15 కోట్లు, కుప్పంలో రూ.16.79, రామకుప్పంలో రూ.19.12, గుడుపల్లెలో రూ. 12.72 కోట్లను ఉపాధి పనులకు వెచ్చించారు. కొవిడ్ భయాందోళనతో కూలీలు చాలా వరకు ఉపాధి పనులకు వెళ్లలేదు. ప్రభుత్వ కార్యాలయాలు సైతం మూతపడిన విషయం తెలిసిందే.

**అధికారం అండతో అక్రమాలకు తెరతీసి..**

కరోనా కాలాన్ని సద్వినియోగం చేసుకున్న అక్రమార్కులు ఉపాధిలో అక్రమాలకు తెరతీసినట్లు స్పష్టమవుతోంది. నాలుగేళ్లకు గాను రూ.167 కోట్లు ఖర్చు చేయగా.. కరోనా ఏడాదిలో రూ.68.78 కోట్లు వ్యయం చేసినట్లు గణాంకాలు ఉండటంతో అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో అధికారం అండతోనే సామాజిక తనిఖీలను తూతూమంత్రంగా ముగించినట్లు స్పష్టమవుతోంది.

**విజిలెన్స్ అధికారుల ఆరా**

తిరుపతికి చెందిన విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటించి ఉపాధి నిధుల వ్యయం వివరాలు సేకరించారు. నెలన్నర కిందట మండల ప్రజాపరిషత్తు, ఉపాధి కార్యాలయాల్లో వీరు రహస్యంగా వివరాలు తీసుకెళ్లగా.. తాజాగా మరోదఫా సేకరించారు. త్వరలోనే సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

# దొంగ డబ్బు పోలీసులు కాజేసినా మౌనం?



చిత్తూరు : జిల్లా పోలీసు యంత్రాంగం తీరు నానాటికీ వివాదాస్పదమవు తోంది. జిల్లా పోలీస్ బాస్ ఉదాసీన వైఖరితో తమకు తీరని నష్టం జరుగుతోందంటూ ఏకంగా తెదేపా ఎమ్మెల్యేలు బహిరంగంగా విరుచుకు పడుతున్నారు.. ఎస్పీ మౌనమే తమ వారిపై వైకాపా నేతల దాడులకు ఊతమిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేరం రుజువైనా.. గతేడాది 30న జరిగిన చోరీలో దొంగను పట్టుకున్న చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు అతని నుంచి స్వాధీనం చేసుకున్న రూ.12 లక్షలు కాజేశారు. ఇదే దొంగ అన్నమయ్య జిల్లా పోలీసులకు పట్టుబడటంతో చిత్తూరు పోలీసుల అక్రమం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం రుజువైనా ఎస్పీ చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**అక్రమ బదిలీలకు న్యాయం జరిగేనా..?** అర్ధరాత్రి బదిలీ అయిన 264 మంది కానిస్టేబుళ్లు న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. పుంగనూరు ఘటనలో అక్కడి అధికారుల పొరపాట్లకు జిల్లా అంతటా ప్రతాపం చూపడమేంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బదిలీ ప్రక్రియలోనూ కార్యాలయ అధికారులు చేతివాటాన్ని ప్రదర్శించి కొందరికి స్థానికంగా పోస్టింగ్ ఇప్పించడంతో డీపీవో ప్రతిష్ఠ మసకబారింది. దీనిపై విచారణ ముగిసి అక్రమార్కుల జాబితా సిద్ధం చేసినా చర్యలు కొరవడ్డాయి.

**ఉత్తుత్తి కదలికలు..**

కీలకమైన ప్రత్యేక బ్రాంచి (ఎస్‌బీ)లో ఏళ్ల తరబడి ఉన్నవారిని నామమాత్రంగా కదిలించారని ఇటీవల కొత్తగా చేరిన వారినే మళ్లీ బదిలీ చేశారని కొందరు అధికారులే ఆరోపిస్తున్నారు. ఇప్పటికీ చాలామంది అక్కడే ఉండి చక్రం తిప్పుతున్నారని వాపోతున్నారు. పుంగనూరు మండలంతో తెదేపా కార్యకర్త రామకృష్ణ హత్య ఘటనలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఎస్పీ మణికంఠ తీరుపై విరుచుకుపడ్డారు. చిత్తూరులో రెండ్రోజుల కిందట తెదేపా కార్యకర్తలపై.. వైకాపా నాయకుల మూకుమ్మడి దాడిపై ఎస్పీ ఉదాసీనంగా వ్యవహరించడంపై చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మండిపడ్డారు. ఆకస్మిక బదిలీలకు తెర లేపిన వ్యవహారంలో డీపీవో సిబ్బంది కొందరు అయినవారి నుంచి డబ్బు తీసుకుని నచ్చినచోట పోస్టింగ్ ఇచ్చినా.. దొంగ వద్దే పోలీసులు చేతివాటాన్ని ప్రదర్శించినా చర్యలు కరవు. ఎస్బీలో కొందరిపై వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తూ ఇతరులపై బదిలీ వేటు వేయడం విమర్శలకు తావిచ్చింది.

# జీవిత ఖైదీలు.. వ్యవసాయ పాఠాలు



బుక్కరాయసముద్రం : వారంతా కరుడగట్టిన నేరస్తులు. ప్రస్తుతం జీవిత ఖైదీలు శిక్షణ అనుభవిస్తున్నారు. అయితేనేం వ్యవసాయం చేస్తూ సమాజానికి ఆరోగ్యకర పంటలను పండిస్తున్నారు. జైలులో ఉంటూనే వ్యవసాయ పాఠాలు నేర్చుకుంటున్నారు. దిగుబడులను స్వయంగా విక్రయిస్తూ.. జైళ్ల శాఖకు ఆదాయంతోపాటు వారూ ఉపాధి పొందుతున్నారు. ఆ ఖైదీల వ్యవసాయ జీవనంపై స్ఫూర్తిదాయక కథనం. వ్యవసాయంలో రసాయనిక ఎరువులు వాడకం ఎక్కువవుతున్న తరుణంలో ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా ప్రజలు సేంద్రియ పద్ధతిలో పండించే కూరగాయలు, ఆకుకూరల వైపు దృష్టి సారిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బుక్కరాయసముద్రం శివారులో ఉన్న ఖైదీల వ్యవసాయ క్షేత్రంలో జైలు అధికారులు, జీవిత ఖైదీలతో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలను ఐదేళ్లుగా పండించి విక్రయిస్తున్నారు.

**అందరిదీ వ్యవసాయ కుటుంబమే..**

జైలులో ఉన్న ఖైదీలంతా వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారే కావడం కలిసొచ్చింది. ప్రస్తుతం దాదాపుగా 10 ఎకరాల విస్తీర్ణంలో బోరు నీటి సాయంతో సొరకాయలు, మిరపకాయలు, బెండ, వంకాయ, గోంగూర, పాలకూర, ఎర్రమొలక కూర, చిక్కుడు తదితర కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేయకుండా పూర్తిగా సేంద్రియ పద్ధతిలోనే సాగు చేస్తున్నారు.

**క్రమశిక్షణతో పనులు**

ఖైదీలంతా ఉదయాన్నే 6 గంటలకు పొలం పనుల్లో నిమగ్నమవుతారు. 9 గంటలకు కూరగాయలను కోసి జైలు అవసరాలకు పరిపడా ఉపయోగించిన తర్వాత, జైళ్లశాఖ పెట్రోల్ బంకుల వద్ద సాయంత్రం వరకు తక్కువ ధరలకే విక్రయిస్తారు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు కావడంతో ప్రజలు ఎక్కువగా వస్తుంటారు.

**రోజు కూలి రూ.180..** తోటలో పని చేసినందుకు జైళ్లశాఖ ఒక్కో ఖైదీకి రోజుకు రూ.180 చెల్లిస్తుంది. ఈమొత్తంలో సగం ఖైదీల ఖర్చులకు ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని ఖైదీల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. దీన్ని వారు జైలు నుంచి విడుదలయ్యే సమయంలో అందజేస్తారు. ప్రస్తుతం జైలులో ఖైదీల సంఖ్య భారీగా తగ్గడంతో పరిమిత విస్తీర్ణంలో సాగు చేపట్టామని జైలు అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని లాభాపేక్ష లేకుండా కూరగాయలను, ఆకుకూరలు పండిస్తూ ఖర్చులు పోనూ మిగిలిన ఆదాయాన్ని అధికారులు జైళ్లశాఖ ఖాతాకు జమ చేస్తారు.

# నీటి పథకాల పూర్తికి యూఐడీఎఫ్ నిధులు



సూళ్లూరుపేట : పట్నవాసులకు సురక్షిత తాగునీరు అందించడంతో పాటు, రానున్న 40 ఏళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలన్న లక్ష్యంతో 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఏషియాన్ మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు(ఏఐఐబీ) నిధులతో చేపట్టిన పనులు వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించక అసంపూర్తిగా ఆగాయి. ఆ పనులను మళ్లీ పరుగులు పెట్టించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందుకు పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులు(యూఐడీఎఫ్) ఖర్చు చేయాలని తలచింది. నెల్లూరు ప్రజారోగ్యశాఖ సర్కిల్‌లోని సూళ్లూరుపేట, నాయుడుపేట, పుత్తూరు, అద్దంకి, కనిగిరి, చీమకుర్తి, గిద్దలూరు పురపాలక సంఘాలతోపాటు, చిత్తూరు నగరపాలక సంస్థలో శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు 2018లో ఏఐఐబీ నుంచి రూ.559 కోట్ల నిధులు కేటాయింపులు జరిగాయి. అప్పట్లో తెదేపా ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. పలు కారణాలతో 2023 ఫిబ్రవరి వరకు గడువు ఇచ్చారు.

**బిల్లుల చెల్లింపుల్లో జాప్యం**

ఈ పనులకు ఏఐఐబీ 70 శాతం నిధులిస్తే.. 30 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. పనులు చేసినా వైకాపా హయాంలో నిధులు విడుదల చేయలేదు. దీంతో గుత్తేదారు పనులు చేయకపోవడంతో ఎక్కడి పథకాలు అక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయి.

**యూఐడీఐ నిధులు**

ఏఐఐబీ నిధులతో పనులు చేసేందుకు ఇంజినీర్లు 2017-18 ధరలతో టెండర్లు పిలిచారు. నాటికి నేటికి ధరల్లో వ్యత్యాసం వల్ల గుత్తేదారులు పనులు చేసేందుకు ముందుకురాలేదు. కొత్తగా డీపీఆర్‌లు రూపొందించి, టెండర్లు పిలిచేందుకు ఇంజినీర్లు కసరత్తు చేస్తున్నారు.

**పనులు పరిశీలిస్తే..**

ఏఐఐబీ నుంచి సూళ్లూరుపేటకు రూ.112.19కోట్లు, నాయుడుపేటకు రూ.125.44 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ఏఐఐబీ వాటా రూ.166.34 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.71.29 కోట్లు. ఇప్పటిదాకా పనులు చేసినందుకు ఏఐఐబీ వారు రూ.5683.47 లక్షలు విడుదల చేశారు. రెండుచోట్ల 35 శాతం పనులు జరిగాయి. శ్రీకాళహస్తి సమీపాన కేపీ కెనాల్ నుంచి పుత్తూరుకు తాగునీటిని తీసుకెళ్లేందుకు 55కి.మీల పైపులైన్ వేయాలి. ఇప్పటికి 35కి.మీ వేశారు. రాయపేడు, లక్ష్మీపురం వద్ద సంపులు నిర్మించాల్సి ఉంది. అడవపల్లి రిజర్వాయర్ నుంచి 8.5కి.మీ పైపులైన్, 16 కేఎల్ వీఎల్ఎస్ఆర్ నిర్మించాలి.

**డీపీఆర్‌లు రూపకల్పన**

పురపాలక సంఘాల్లో తాగునీటి పథకాలను పూర్తి చేసేందుకు డీపీఆర్‌లు రూపొందిస్తున్నాం. పనుల వేగవంతానికి చర్యలు చేపడతాం. మోహన్, ప్రజారోగ్యశాఖ ఎస్ఈ, నెల్లూరు

# ఒత్తిడి తగ్గేలా.. ఉత్సాహం పెరిగేలా..

నక్కపల్లి: పోటీ ప్రపంచంలో విద్యార్థులను ఒత్తిడి లేని చదువుల ద్వారా.. భవితకు భరోసా ఇచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న విధానాల్లో కొన్ని మార్పులు తెచ్చి పిల్లలను తీర్చిదిద్దేలా విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి దీన్ని అమలు చేయనున్నారు. జిల్లాలో 1447 ప్రభుత్వ పాఠశాలలుండగా, వీటి పరిధిలో 1.05 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం వీరంతా ఉదయం నుంచి సాయంత్రం బడిలోనే ఉంటున్నారు. ఏవో కొన్ని పాఠశాలల్లో తప్పితే మిగిలిన చోట్ల పెద్దగా ఆట, పాటలుండటంలేదు. తాజా నిర్ణయంతో పిల్లలకు సరికొత్త విద్య అందనుంది. ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ప్రస్తుతం వార్షికోత్సవాలు చేస్తున్నారు. ఇకపై



ఏటా జనవరి 27న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకలు చేసేలా ఆదేశాలిచ్చారు. ప్రతి శనివారం నో బ్యాగ్‌డే అమలు చేయనున్నారు. ఈ రోజున విద్యార్థులు ఏ పుస్తకాలు లేకుండా బడికి వెళ్లి ఆటపాటలతో గడుపుతారు. దీని ద్వారా బడిపట్ల ఆకర్షణ పెంచి, చదువుపట్ల భయం తొలగించాలనేది ఉద్దేశం. భవిష్యత్తుకు భరోసాగా తొమ్మిది, పది విద్యార్థులకు కృత్రిమ మేధ (ఏఐ), కోడింగ్ వంటి తరగతులను నిర్వహించనున్నారు. నైతిక విలువలు పెంపొందించే కార్యక్రమాలు చేస్తారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు మార్చి 15లోగా పరీక్షలు పూర్తి చేసి, పదో తరగతి సిలబస్‌తో బ్రిడ్జికోర్సు నిర్వహించనున్నారు. నూతన విద్యా క్యాలెండర్ అమలు ద్వారా విద్యార్థులకు మేలు జరుగుతుంది. ముఖ్యంగా ఇందులో కొన్ని అంశాల ద్వారా కచ్చితంగా సత్ఫలితాలు వస్తాయి. అప్పారావునాయుడు, డీఈఓ

# ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ఇక స్లాట్ బుకింగ్ విధానం

అనంత : ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించి నూతన ఒరవడి సృష్టించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ఇందులో భాగంగా తొలుత ఆస్తుల రిజిస్ట్రేషన్ల విషయమై స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది. అనంతపురం ఆర్ఓ, శ్రీసత్యసాయి జిల్లాలో బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ల కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏప్రిల్ 2 నుంచి, అనంతపురం ఆర్ఓలో 4 నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తారు.




పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్యలో స్లాట్‌ను బుకింగ్ చేసుకోవచ్చు. ఈ విధానం వల్ల రోజంతా నిరీక్షించే అవసరం తప్పుతుంది. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి నిర్ణీత సమయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా రిజిస్ట్రేషన్ సులభతరంగా పూర్తవుతుంది. రాబోయే రోజుల్లో అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రవేశపెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ జి.భార్గవ్ మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్లను సులభతరం చేసి వేగవంతంగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ విధానాన్ని అన్ని కార్యాలయాల్లో ప్రవేశపెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే సమయం వృథాకాదని ఆయన వివరించారు.

# కన్నేసి.. కొట్టేసి.. అమ్మేసి

ఒంగోలు : గత వైకాపా పాలనలో ఊరికొకరు భూ బకాసురుడి అవతారమెత్తారు. అధికారమే పెట్టుబడిగా చెలరేగిపోయారు. ప్రజల ఆస్తులు, సహజ వనరులు, ఖాళీ జాగాలను వీలైనంతగా కొల్లగొట్టారు. ప్రభుత్వ భూములను బొక్కేశారు. కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామంలో ఓ అడుగు ముందుకేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా.. ఏకంగా ఇతరులకు అమ్మి జేబులు నింపుకొన్నారు.

**తొలుత సాగు.. ఆపై అమ్మకం:** కొత్తపట్నం మండలం పాదర్తిలో ఎల్‌పి నెంబర్ 3840 లో రెండు ఎకరాల తొంభై ఎనిమిది సెంట్ల ప్రభుత్వ



భూమి ఉంది. గత ప్రభుత్వం హయాంలో వైకాపాకు చెందిన ఇద్దరు నాయకులు ఈ ఖాళీ స్థలంపై కన్నేశారు. కొద్దిరోజులపాటు తమ ఆధీనంలోనే ఉంచుకుని పంటలు సాగు చేశారు. ఆ తర్వాత ఒక ఎకరాను రూ. 40 లక్షలకు ఇతరులకు విక్రయించారు. మరో ఎకరా తొంభై సెంట్ల భూమిలో ఇప్పటికీ సాగు చేసుకుంటున్నారు. భూమి కొనుగోలు చేసిన వ్యక్తులు అందులో ఇటీవల ప్లాట్లు వేశారు. దీంతో ఆక్రమణ విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికుల ఫిర్యాదుతో తహసీల్దార్ మధుసూదనరావు స్పందించారు. సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపారు. అక్రమాన్ని గుర్తించి సదరు స్థలంలో ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేయించారు.

చురకలు



## కాజోల్ నటవారసురాలిని చూశారా?

ఐదేళ్ల క్రితం నైసా వేరు.. ఇప్పటి నైసా వేరు! ఇంత నైసుగా ఎలా మారిందో కానీ, ఇటీవల నటవారసురాలి ఫోటోషూట్ల దూకుడు అమాంతం పెరిగింది. ప్రతి ఈవెంట్లోను తల్లి కాజోల్ తో పోటీపడి ఫోటోగ్రాఫర్స్ కి ఫోజులిస్తోంది. మమ్మీని మించి నైసా నైసుగా దర్శనమిస్తోంది. తనతో కలిసి ఈవెంట్లలో బోలెడంత సందడి చేస్తోంది. అది పెళ్లి వేడుక లేదా సినిమా ఈవెంట్, లేదా ఇంకేదైనా కానీ కాజోల్ తో పాటు నైసా దేవగన్ కనిపిస్తోంది. మునుపటితో పోలిస్తే నైసా దేవగన్ గ్లామరస్ వేషధారణలు వెబ్ లో వైరల్ గా మారుతున్నాయి. నేటి జెన్ జెడ్ నటవారసురాళ్లతో పోటీపడుతూ ఈ బ్యూటీ అందాలను



ఆరబోస్తోంది. తాజాగా నైసా దేవగన్ కొత్త అవతారంలో కనిపించింది. పదహారణాల దేశీ గాళ్ లా పట్టు పరికిణీలో గుబులు రేపింది. ఎరుపు, గోల్డ్ మిశ్రమ రంగు పరికిణీ దానికి కాంబినేషన్ గా బిస్కెట్ కలర్ టాప్ ధరించి మెడలో కాంబినేషన్ వజ్రాల హారం ధరించి నైసా ధగ ధగా మెరిసిపోతోంది. 22 ఏళ్ల నైసా అందచందాలు మైమరిపిస్తున్నాయి. ఈ లుక్ చూడగానే నైసా నైసుగుందమ్మా! అంటూ అభిమానులు తన అందాన్ని పొగిడేస్తున్నారు. ఇదే హుషారులో నైసా సినీ ఎంట్రీ ఇస్తుందని ఊహిస్తున్నారు. ఇప్పటి వరకూ కాజోల్– అజయ్ దేవగన్ తమ కుమార్తె సినీఎంట్రీ గురించి ఎలాంటి హింటూ ఇవ్వలేదు. ఇటీవల నైసా దేవగన్ తన తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడుస్తూ నటిగా మారాలని కోరుకోవడం లేదని కాజోల్ వెల్లడించడం నిరాశ కలిగించింది. ప్రస్తుతానికి నైసా స్టడీస్ పైనే దృష్టి సారిస్తోందని సమాచారం.

## తమన్నా లక్... రెండు దశాబ్దాలైనా రచ్చే

మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతుంది. 2005 సంవత్సరంలో హిందీ మూవీ చాంద్ సా రోషన్ చెహ్రా, తెలుగు సినిమా 'శ్రీ' తో సినీ కెరీర్‌ను ప్రారంభించింది. మొదటి ఏడాదిలో లక్ కలిసి రాలేదు. సినిమాలు పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోలేదు. ఆ తర్వాత ఏడాది కూడా కలిసి రాలేదు. 2007లో నటించిన హ్యాపీ డేస్ సినిమా తర్వాత మిల్కీ బ్యూటీ తమన్నాకు వెనక్కి తిరిగి చూసుకునే అవసరం రాలేదు. తెలుగులో ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేస్తూ వచ్చింది. టాలీవుడ్ స్టార్ హీరోల అందరితోనూ సినిమాలు చేసిన ఘనత ఈ అమ్మడికి దక్కింది. యంగ్ స్టార్ హీరోలతోనే కాకుండా చిరంజీవి, వెంకటేష్ వంటి సీనియర్ స్టార్స్‌తోనూ ఈ అమ్మడు నటించింది. సాధారణంగా హీరోయిన్స్ దశాబ్ద కాలం పాటు బిజీగా కొనసాగితే గొప్ప విషయం. కానీ ఈ అమ్మడు రెండు దశాబ్దాలు అయినా కెరీర్ ఏ మాత్రం జోరు తగ్గలేదు. టాలీవుడ్‌లో ఈ అమ్మడి జోరు తగ్గింది. కానీ నార్త్ ఇండియాలో ఈమె జోరు కంటిన్యూ అవుతోంది. సినిమాలనే కాకుండా



వెబ్ సిరీస్‌లు, మ్యూజిక్ వీడియోలు, ఐటెం సాంగ్స్ ఇలా చాలా విధాలుగా ప్రేక్షకులకు చేరువ అవుతూ వస్తోంది. మిల్కీ బ్యూటీ తమన్నా ప్రస్తుతం బాలీవుడ్‌లో ఏకంగా అయిదు సినిమాలు చేస్తోంది. అందులో రెండు పెద్ద సినిమాలు కావడం విశేషం. బాలీవుడ్ యంగ్ స్టార్ హీరో సిద్దార్థ్ మల్హోత్ర హీరోగా నటిస్తున్న వ్యన్ సినిమాలో హీరోయిన్‌గా తమన్నా నటిస్తున్న విషయం తెల్సిందే. దీపక్ మిశ్రా దర్శకత్వంలో భారీ అంచనాల నడుమ రూపొందుతున్న 'వ్యన్' సినిమాపై తమన్నా చాలా ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే ఈ అమ్మడి సినిమాలు బాలీవుడ్‌లో చాలా విడుదల అయ్యాయి. కానీ అక్కడ ఆశించిన స్థాయిలో సక్సెస్‌లు దక్కించుకోలేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాలతో సక్సెస్‌ను దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే ఈ అమ్మడు రైడ్ 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ సినిమాలో మిల్కీ బ్యూటీ తమన్నా పాత్ర గురించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొత్తానికి రెండు దశాబ్దాలు అయినా కూడా కెరీర్‌లో ఏమాత్రం తగ్గకుండా ఓ రేంజ్‌లో దూసుకు పోతున్న మిల్కీ బ్యూటీ ఎంతో మందికి ఆదర్శం. ఒక్క భాషపై నమ్మకం పెట్టుకోకుండా, ఒకే ఇండస్ట్రీలో సినిమాలు చేస్తూ ఉండకుండా అన్ని భాషల్లో సినిమాలు చేయడం ద్వారా ఒకచోట కాకున్నా మరో చోట అయినా ఆఫర్లు ఎప్పుడూ ఉంటాయి అనేది తమన్నాను చూస్తే అర్థం అవుతుందని ఇండస్ట్రీ వర్గాల వారు కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలోనూ తమన్నాకు ఉన్న క్రేజ్ ఏంటో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ క్రేజ్‌కు తగ్గట్లుగానే మిల్కీ బ్యూటీ తమన్నా రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆ అందమైన ఫోటోల కారణంగా కూడా తమన్నాకు బాలీవుడ్ నుంచి ఆఫర్లు వస్తూ ఉంటాయి. మరో దశాబ్ద కాలం పాటు మిల్కీ బ్యూటీ తమన్నా బిజీ బిజీగా సినిమాలు చేసే అవకాశం ఉంది. అదృష్టం అంటే తమన్నాదే అంటూ ఆమె ఫ్యాన్స్ కామెంట్ చేస్తూ ఉంటారు.




## సర్ ప్రైజ్ ఇవ్వబోతున్న బిగ్ స్టార్



నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ 2 – తాండవం' షూటింగ్‌లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అఖండ సృష్టించిన ప్రభంజనం తర్వాత ఈ కాంబో నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. టైటిల్ వీడియో విడుదలైనప్పటి నుంచే మూవీపై క్రేజ్ మామూలుగా లేదు. బాలయ్య మాస్ యాటిట్యూడ్, బోయపాటి మాస్ ట్రీట్‌మెంట్ మళ్లీ ప్రేక్షకులను థియేటర్లవైపు రప్పించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంతలోనే అఖండ 3కి సంబంధించిన ఆసక్తికర రూమర్స్ తెగ వైరల్ అవుతున్నాయి. అఖండ 2 పూర్తి కాగానే అఖండ 3 ప్రీ–ప్లానింగ్ మొదలైనట్టు టాక్. ఇప్పటికే బాలీవుడ్ స్టార్స్‌తో కూడిన విలన్ క్యారెక్టర్‌లను ఫిక్స్ చేయాలనే ఆలోచన బోయపాటి టీం చేస్తున్నట్టు సమాచారం. అఖండ 2లో సంజయ్ దత్ పాత్ర మేజర్ అట్రాక్షన్ కానుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు అఖండ 3 కోసం సన్నీ డియోల్ పేరూ గట్టిగా వినిపిస్తోంది. లేటెస్ట్ గా అఖండ 2 సినిమా జార్జియాలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ షెడ్యూల్‌కు స్పెషల్ ఆకర్షణగా బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్ జాయిన్ అవుతున్నారట. అయితే అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, సన్నీ డియోల్ ఈ సినిమాలో కేవలం గెస్ట్ రోల్‌లో మాత్రమే కనిపించబోతున్నారని తెలుస్తోంది. పూర్తి లెంగ్త్ విలన్ రోల్ అనుకోకుండా, ఒక కీలకమైన చిన్న పాత్రలో ఫుల్ పవర్ ప్యాక్ గెస్ట్ అప్పియరెన్స్ ఇవ్వనున్నారని సమాచారం. సన్నీ డియోల్ పాత్ర గురించి కొన్ని రిపోర్ట్స్ ప్రకారం, ఆయన గెస్ట్ రోల్ అఖండ ఫ్రాంచైజీలో మూడో భాగానికివేదిగా మారే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ, సన్నీ డియోల్ అఖండ యూనివర్స్‌లో ఎంట్రీ ఇవ్వడం ప్రేక్షకుల్లో మంచి ఉత్సాహాన్ని రేపుతోంది. సన్నీ డియోల్ తన లేటెస్ట్ చిత్రం 'జాట్'తో బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతున్నారు. 100 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ సినిమా విజయంతో సన్నీ డియోల్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చారు. ఈ హవాలో అఖండ 2లో గెస్ట్ రోల్ చేయడం ఆయన కెరీర్‌కు మరింత బూస్ట్ ఇచ్చేలా చేస్తుందా అనే ఆసక్తి అందరిలో ఉంది. మొత్తం మీద అఖండ 2లో సన్నీ డియోల్ గెస్ట్ రోల్ సినిమాకు అదనపు మసాలా జోడించనుంది. బాలయ్య పవర్, బోయపాటి మాస్ ట్రీట్‌మెంట్‌తో కలిసి సన్నీ సర్ప్రైజ్ అప్పియరెన్స్ ప్రేక్షకులకు ఫుల్ కిక్ ఇచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మరి అధికారిక వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయో చూడాలి.

## నా ఎత్తుతో సమస్య... చాలా బాధ వేసేది : మీనాక్షి చౌదరి





గత ఏడాది 'లక్కీ భాస్కర్', ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాల్లో నటించి సూపర్ హిట్‌ను సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో ఒడిదుడుకులు ఎదుర్కొంది. తెలుగులో మొదటి సినిమా 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' నిరాశపరచడంతో ముందు ముందు ఆఫర్లు వస్తాయా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ లక్కీగా ఈ అమ్మడికి ఆ సినిమా కారణంగా ఖిలాడీ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ తర్వాత హిట్ 2, గుంటూరు కారం సినిమాల్లో నటించే అవకాశం దక్కింది. గత ఏడాదిలో చాలా సినిమాలు చేసిన ఈ అమ్మడు లక్కీ భాస్కర్‌తో మాత్రమే హిట్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు నవీన్ పొలిశెట్టితో కలిసి అనగనగా ఒక రాజు సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఇటీవల ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్ ఆరంభం గురించి, తన బాల్యం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

మీనాక్షి చౌదరి మాట్లాడుతూ... చిన్నతనంలో ఇతరులతో మాట్లాడేందుకు చాలా ఇబ్బంది పడేదాన్ని. కాలేజ్ రోజుల్లోనే నా ఎత్తు 6.2 ఉండేది. దాంతో చాలా మంది అమ్మాయిలతో పోల్చితే నేను చాలా ఎత్తుగా ఉండేదాన్ని. దాంతో అంతా నాకు దూరంగా ఉండేవారు, నా ఎత్తు నాకు పెద్ద సమస్యగా అనిపించింది. ఆ సమయంలో చాలా బాధ వేసింది. ఆర్మీ ఆఫీసర్ అయిన మా నాన్నకు ఆ విషయం గురించి చెప్తే నీ సమస్యను నువ్వే పరిష్కరించుకోవాలని సూచించాడు. దాంతో నేను బుక్స్‌ను స్నేహితులుగా చూడటం చేశాను. ఎక్కువ బుక్స్ చదవడంతో పాటు, అందాల పోటీల్లో పాల్గొనేందుకు, ఆటలపై ఆసక్తి కలిగింది. సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో నిరాశే మిగిలింది. అయితే వచ్చిన ప్రతి ఆఫర్ కూడా నేను సాధ్యం అయినంత వరకు కష్టపడి సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నించాను. ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమా కారణంగానే నాకు ఖిలాడీ సినిమాలో నటించే అవకాశం దక్కింది. కనుక ఇండస్ట్రీలో ప్రతి చిన్న ఆఫర్ కూడా కచ్చితంగా ముందు ముందు కెరీర్ నిలదొక్కుకునేందుకు సహాయపడుతుందని భావిస్తున్నాను. సీనియర్ హీరోలతో నటించడం ఏంటి అంటూ చాలా మంది నన్ను ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి హీరోతో అయినా నటించేందుకు నాకు ఇబ్బంది లేదు. సీనియర్ హీరోలతో నటించడం అనేది ఒక జోనర్ సినిమాగా భావిస్తాను.

వెంకటేష్ గారితో సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో నటించడం అనేది చాలా కంఫర్ట్‌బుల్‌గా అనిపించింది. ఆయనతో వర్క్ చేయడంను ఎంజాయ్ చేశాను. ఇప్పుడు చిరంజీవి గారి సినిమా విశ్వంభరలోనూ నటిస్తున్నాను. ఆ సినిమాలో నటించే అవకాశం రావడం అదృష్టంగా, గొప్ప విషయంగా భావిస్తున్నాను. ఇండస్ట్రీలో ఎక్కువ కాలం నిలదొక్కుకోవాలంటే వచ్చిన ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలి. కథల ఎంపిక విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలి తప్ప అతి విశ్వాసం, అతి నమ్మకంతో సినిమాలను వదులుకోవద్దని మీనాక్షి సూచించింది. పుకార్లు అనేవి చాలా కామన్‌గా వస్తూ ఉంటాయి. అయినా కూడా రూమర్స్ చూసినప్పుడు కోపం వస్తుంది. నేను ఎప్పుడూ అందుబాటులోనే ఉంటాను. కనుక నన్ను సోషల్ మీడియా ద్వారా సంప్రదించి క్లారిటీ తీసుకోవాలని మీనాక్షి కోరింది. నా గురించి ఏ విషయం అయినా సోషల్ మీడియా ద్వారా నేను చెప్తాను. కనుక పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.

## హీటెక్కించే లుక్స్ లో సామ్.. ఈ ఫొటోలు చూశారా?

సౌత్ సినిమా ప్రపంచంలో బ్యూటీఫుల్ హీరోయిన్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని అందుకున్న టాప్ హీరోయిన్స్ లిస్టులో సమంత రూత్ ప్రభు ఒకరు. సినిమాల్లో తన నటనతోనే కాదు, వ్యక్తిత్వంతోనూ మిలియన్ల మంది అభిమానులను సంపాదించుకుంది. సమంత కెరీర్‌దిశలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా, ఆమెకు ఉన్న ఫైట్ స్పిరిట్ వేరే లెవెల్ అని చెప్పవచ్చు. ఇక లేటెస్ట్ గా, ఆమె పుట్టినరోజు సందర్భంగా 'ఫెమినా' మాగజైన్ విడుదల చేసిన మర్చ్ 2024 కవర్ స్టోరీస్ మరింత హైలైట్ అయ్యాయి. ఫోటో షూట్‌లో సమంత డిఫరెంట్ స్టైల్ తో ఆకట్టుకుంది. వైట్ లేస్ కాస్ట్యూమ్ నుంచి స్టైలిష్ మోడర్న్ అవతారాల వరకు ఆమె ప్రతీ ఫోటో ఒక కొత్త స్టిల్ లా అనిపిస్తోంది. ప్రత్యేకంగా బ్లాక్ క్రియేటివ్ డిజైన్ గౌన్‌లో సమంత అందాన్ని వర్ణించడానికి మాటలు చాలవు.




ఆ డ్రెస్‌లో ఆమె సూపర్ కాన్ఫిడెన్స్‌తో పోజులు ఇవ్వడం చూసి ఫ్యాషన్ లవర్స్ మైమరచిపోయారు. 'ఫెమినా' కవర్ పేజీపై సమంతను చూసిన ప్రతి ఒక్కరూ బ్యూటీఫుల్ హీరోయిన్! అంటూ కామెంట్స్ చేస్తున్నారు. నిజంగానే, ఆమెలో ఉన్న ధైర్యం, గ్లామర్, గ్రేస్ అన్నీ కలిపి ఒక రేర్ కాంబినేషన్. గోల్డెన్ కార్సెట్ లుక్‌లోనూ ఆమె మరింత స్టన్నింగ్‌గా కనిపించింది. ప్రతి డ్రెస్‌ని తనదైన స్టైలిష్ స్వాగ్‌తో క్యారీ చేయగల గుణం సమంతను ప్రత్యేకం చేస్తోంది. సమంత ఫోటోలు అలా పోస్ట్ చేసిన వెంటనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఫ్యాన్స్ ఆమె బ్యూటీ, ఫెయిర్ ఫైటింగ్ స్పిరిట్‌ను మళ్ళీ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఆమె చేసిన కొన్ని రిఫ్లెక్టివ్ పోస్ట్‌లు కూడా ఆమె జీవితాన్ని ఎంత పాజిటివ్‌గా ముందుకు తీసుకెళ్లిందో చెప్పకనే చెబుతున్నాయి. మొత్తానికి సమంత ఫెమినా కవర్ ఫోటోలు మరోసారి నిరూపించాయి.. ఎన్ని అడ్డుకట్టలు వచ్చినా, నిజమైన అందం, స్ఫూర్తి ఎప్పుడూ వెలిగిపోతుంది. ఆమె తదుపరి ప్రాజెక్ట్స్‌పై కూడా ఇప్పుడు భారీ అంచనాలు నెలకొన్నాయి.

## బ్రేకప్ స్టోరీల గురించి... ఎన్నో బాయ్ ఫ్రెండ్ అంటారు!

కమల్ హాసన్ వారసురాలు శృతి హాసన్ కెరీర్ ఆరంభం నుంచి తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ వచ్చింది. తండ్రి పేరును వినియోగించుకుని ఆఫర్లు దక్కించుకోవడం లేదంటే, తండ్రి పేరును వినియోగించుకుని ఇండస్ట్రీలో నిలదొక్కుకునే ప్రయత్నం ఎప్పుడూ శృతి హాసన్ చేయలేదు. ఇండస్ట్రీలో ఆమె ఎంట్రీ ఇచ్చిన మొదటి సినిమాలోనే బికినీ ధరించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. మొదటి హిట్ పడే వరకు తీవ్రమైన ఒత్తిడికి గురి అయినట్లుగా శృతి హాసన్ చెబుతూ ఉండేది. హీరోయిన్‌గానే కాకుండా ఇండస్ట్రీలో నాలుగు కాలల పాటు ఉండే విధంగా ఎప్పుడూ ఏదో విధంగా ప్రేక్షకుల ముందుకు రావాలని అనుకుంటాను అంటూ గతంలో శృతి హాసన్ చెప్పుకొచ్చింది. తాజాగా



ప్రముఖ నేషనల్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శృతి హాసన్ పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది. ముఖ్యంగా తన ప్రేమ వ్యవహారాల గురించి, తన తల్లిదండ్రులు విడిపోయిన సమయంలో ఎదుర్కొన్న పరిణామాల గురించి, ఇండస్ట్రీలో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి శృతి హాసన్ డెప్త్‌గానే చెప్పుకొచ్చింది. గతంలో ఎప్పుడూ చెప్పని విషయాలను ఈసారి శృతి హాసన్ షేర్ చేసుకోవడంతో ఆమె వ్యాక్యలు వైరల్ అవుతున్నాయి. శృతి హాసన్ వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడిన ప్రతిసారీ ఆమె ప్రేమ వ్యవహారాల గురించి టాపిక్ వస్తుంది. ఆమె ఇప్పటికే రెండు మూడు సార్లు ప్రియుడికి బ్రేకప్ చెప్పింది. ఆఫ్ ది రికార్డ్ మరికొందరు కూడా ఉండి ఉండవచ్చు అంటారు. తాజాగా ఆ విషయం గురించి శృతి హాసన్ స్పందిస్తూ... నాతో ఎవరైనా కొత్త వ్యక్తి కనిపిస్తే చాలా మంది ఇతడు ఎన్నో బాయ్ ఫ్రెండ్ అని అడుగుతూ ఉంటారు. వారు ఆ నెంబర్ గురించి ఆలోచిస్తూ ఉంటారు, కానీ నేను మాత్రం నెంబర్ గురించి ఆలోచించను. నేను కోరుకునే ప్రేమ లభించే వరకు ఎన్ని సార్లు అయినా విఫలం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నాను. ఒక వ్యక్తికి బ్రేకప్ అయినంత మాత్రాన తప్పుబట్టాల్సిన అవసరం లేదు. అంతే కాకుండా ప్రేమికులు ఇద్దరు బ్రేకప్ చెప్పుకున్నప్పుడు ఒకరిని ఒకరు తప్పుపట్టకూడదు. రిలేషన్ షిప్‌లో నిజాయితీగా ఉండాలని నేను అనుకుంటాను, అవతలి వారు మొదట నిజాయితీగా ఉన్నా ఆ తర్వాత ఉండక పోవచ్చు అంది. కోరుకునే ప్రేమ లభించే వరకు వెయిట్ చేస్తానంది. తన తల్లిదండ్రులు కమల్, సారికలు విడాకులు తీసుకున్న సమయంలో తీవ్రమైన ఒత్తిడికి గురి అయ్యాను. చెన్నై నుంచి ముంబై మకాం మార్చిన సమయంలో బెంజ్ కారులో తిరిగే నేను ముంబై లోకల్ రైల్‌లో, ట్యాకీ కారులో తిరగాల్సి వచ్చింది. ఆ సమయంలో జీవితం చాలా నేర్పించింది. అన్ని విషయాలను గుర్తు పెట్టుకుని జీవితంలో ముందుకు సాగుతూ వచ్చాను. తిరిగి నా తండ్రి వద్దకు చేరుకునే వరకు చాలా ఒడిదొడుకులు ఎదుర్కొన్నాను. అంత ఈజీగా నా జీవితం సాగలేదని, ముందు ముందు కూడా నటిగా తనను తాను నిరూపించుకునేందుకు విభిన్నమైన పాత్రల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ బోల్డ్‌గా వ్యాఖ్యలు చేసింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536